

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


స్థానిక పోరులో 100 శాతం

## విజయమే లక్ష్యం



- 34 శాతం బీసీ రిజర్వేషన్లకు టీడీపీ కట్టుబడి ఉంది
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

- వివరాలు 4 లో..

# ‘తల్లికి వందనం’కు రూ.10,208 కోట్లు

- 68.57 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి
- డైట్ ఛార్జీలు 10 శాతం పెంపు
- విశాఖ మరికవలసలో గిరిజన విద్యార్థులకు ఐఐటీ-జేఈఈ, నీట్ కోచింగ్ సెంటర్
- 12 కీలక అంశాలకు ఏపీ కేబినెట్ ఆమోదం
- ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా సేవపై ప్రత్యేక తీర్మానం

2

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన దాదాపు మూడు గంటల పాటు సాగిన రాష్ట్ర మంత్రివర్గ భేటీలో 12 కీలక ఎజెండా అంశాలకు ఆమోదం తెలిపినట్లు సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని అభినందిస్తూ ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించినట్లు చెప్పారు.




## ముఖ్యాంశాలు

- ‘తల్లికి వందనం’ పథకం అమలు కోసం రూ. 10,208 కోట్లు కేటాయించి రాష్ట్రవ్యాప్తంగా 68.05 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చే ప్రతిపాదనకు ఆమోదం పలికారు.
- వసతి గృహాలు, గురుకులాల విద్యార్థుల డైట్ ఛార్జీలను 10 శాతం మేర పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.
- విదేశీ, ప్రైవేట్ వర్సిటీలను ఆకర్షిం చేందుకు ‘ఉన్నత విద్యా విధానం-2026’కు ఆమోదం తెలిపారు.
- విశాఖపట్నం జిల్లా మరికవలసలో గిరిజన విద్యార్థుల కోసం ‘ఐఐటీ-జేఈఈ, నీట్ కోచింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్’ ఏర్పాటుకు పచ్చజెండా ఊపారు.
- రేపల్లె 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటరును 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు నిర్ణయించారు.
- విధి నిర్వహణలో మృతి చెందిన ఆశా కార్యకర్తల కుటుంబాలకు రూ.1.50 లక్షల వరకు గ్రాట్యుటీ అందించేందుకు ఆమోద ముద్ర వేశారు.
- హార్టికల్చర్ ఇన్‌స్పెక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కోసం రూ. 20.62 కోట్లతో APHIMS ప్రాజెక్టుకు ఆమోదం తెలిపారు.
- కొండపిలో గురుకులానికి 7 ఎకరాలు, ఆలయాభివృద్ధికి 7.66 ఎకరాల భూమి కేటాయించారు.
- పేదల ఇళ్ల స్థలాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా మంత్రుల సబ్ కమిటీ ఏర్పాటు చేశారు.

సమావేశం అనంతరం రాజధాని భూముల అంశంపై మంత్రి నారాయణకు సీఎం పలు సూచనలు చేశారు. కేటగిరీ-4, ఎండోమెంట్ భూములకు సంబంధించి న్యాయ పరమైన అంశాలను పరిశీలించిన తర్వాత మరోసారి తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం

# సమిష్టిగా ముందుకు సాగుదాం

- డ్రగ్స్ వద్దు బ్రో, ఆపరేషన్ చైతన్యం కార్యక్రమాలను విస్తృతం చేయాలి
- డ్రగ్స్ నివారణపై సమన్వయం కోసం త్వరలో దక్షిణ భారత రాష్ట్రాల కాంక్లేవ్
- డ్రగ్స్‌పై ప్రజల్లో అవగాహనకు మంత్రుల బృందం క్షేత్ర స్థాయి పర్యటనలు
- మాదకద్రవ్యాల నివారణపై మంత్రుల బృందం సమావేశంలో మంత్రి లోకేష్



4

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. బుధవారం ఉండవల్లిలో హోం మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన జరిగిన మాదకద్రవ్యాల నివారణ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు, ఈగల్ విభాగం ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే డ్రగ్స్ దుష్ఫలితాలపై అవగాహన కల్పించేందుకు అన్ని ప్రభుత్వ హైస్కూళ్లలో ‘ఈగల్ క్లబ్‌లు’ ఏర్పాటు చేశామని తెలిపారు. యూనివర్సిటీలు, కళాశాలల్లో ప్రతినెలా విద్యార్థులతో ‘టౌన్ హాల్’ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ‘డ్రగ్స్ వద్దు బ్రో’ వంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి యువతను చైతన్యవంతం చేయాలన్నారు. డ్రగ్స్ నివారణపై సమన్వయం కోసం త్వరలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్‌ను విశాఖపట్నంలో నిర్వహించాలన్నారు. డ్రగ్స్‌పై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని మంత్రుల బృందం నిర్ణయించింది.

# ఏపీలో పెట్టుబడులకు కొత్త ఊపు

- గత రెండేళ్లలో రూ.22.6 లక్షల కోట్ల పెట్టుబడులు
- 9.3 లక్షల ఉద్యోగావకాశాలకు అవకాశం
- 714 ప్రాజెక్టుల ప్రణాళికను సిద్ధం చేశాం
- విశాఖను కోస్టల్ సిటీగా అభివృద్ధి చేయడమే ధ్యేయం
- వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్



6

# ఏపీ అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం సహకారం

### మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, కీలక ప్రాజెక్టుల సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని బృందం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో బుధవారం కీలక సమావేశం నిర్వహించింది. ఢిల్లీలోని కర్తవ్య భవన్-1లోని ఆర్థిక శాఖ కార్యాలయంలో జరిగిన భేటీలో సీఎంతో పాటు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పురోగతికి తోడ్పడే పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు.

గ్లోబల్ హార్టికల్చర్ హబ్: రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న ‘గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుతో పాటు జిల్లాల వారీగా అమలు చేయాల్సిన కార్యాచరణ ప్రణాళికపై కేంద్రమంత్రితో సీఎం చంద్రబాబు వివరంగా చర్చించారు. ఈ ప్రాజెక్టు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సహకారం అందిస్తున్నందుకు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం ధన్యవాదాలు తెలిపారు.

ఎయిడెడ్ ప్రాజెక్టులకు నిధులు: విదేశీ ఆర్థిక సహాయంతో రూపుదిద్దుకుంటున్న ఎయిడెడ్ ప్రాజెక్టుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాల సమన్వయం, నిధుల విడుదల అంశంపై ప్రతినిధి బృందం చర్చించింది.

విజయవాడ ఉత్సవ్‌కు ఆహ్వానం: త్వరలో వైభవంగా నిర్వహించనున్న ‘విజయవాడ ఉత్సవ్’కు రావాల్సిందిగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆత్మీయంగా ఆహ్వానించారు.



# ‘తల్లికి వందనం’కు రూ.10,208 కోట్లు



అమరావతి (చైతన్యరథం): ఏపీ కేబినెట్ సమావేశం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగింది. సుమారు మూడు గంటల పాటు సాగిన సమావేశంలో మొత్తం 12 అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయాలను సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కె.పార్థసారథి మీడియాకు వివరించారు. హార్టికల్చర్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు ప్రతిపాదనకు ఆమోదం లభించిందన్నారు. రూ.20.62 కోట్లతో ప్రాంగణానికి ×మీ ప్రాజెక్టుకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. 72 నెలల పాటు అమలు చేయనున్నట్టు తెలిపారు. సేవలో ఉండగానే మరణించిన అర్హత కలిగిన ఆశా కార్యకర్తలకు గ్రాట్యుటీకి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. ప్రతి ఏడాది సేవకు రూ.5వేల చొప్పున.. గరిష్ఠంగా రూ.1.50 లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

రేపల్లె 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటరును 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు కేబినెట్ ఆమోదముద్ర వేసిందని మంత్రి తెలిపారు. రేపల్లె ఏరియా ఆసుపత్రి అప్‌గ్రేడేషన్‌కు రూ.58.42 కోట్లు, అదనంగా 66 పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదించిందన్నారు. 2026-27 ‘తల్లికి వందనం’ మార్గదర్శకాలు, పరిపాలనా అనుమతులకు రాటిఫికేషన్ ఇచ్చిందని చెప్పారు. అదనంగా 58,060 మందితో కలిపి ఆర్థిక సాయం విడుదలకు ఆమోదం తెలిపిందని.. దీంతో 68,57,880 మందికి ఈ పథంకం వర్తిస్తుందని చెప్పారు. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో డైట్ ఛార్జీల పెంపుపై ఉత్తర్వులకు ఏపీ మంత్రివర్గం రాటిఫికేషన్ ఇచ్చిందన్నారు.

- 68.57 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి
- డైట్ ఛార్జీలు 10 శాతం పెంపు
- విశాఖ మరికవలసలో గిరిజన విద్యార్థులకు ఐఐటీ-జేఈఈ, నీట్ కోచింగ్ సెంటర్
- 12 కీలక అంశాలకు ఏపీ కేబినెట్ ఆమోదం
- ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా సేవపై ప్రత్యేక తీర్మానం

విశాఖ జిల్లా మరికవలసలో గిరిజన విద్యార్థుల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఐఐటీ-జేఈఈ, నీట్‌లక ఇంటెన్సివ్ రెసిడెన్షియల్ కోచింగ్ కేంద్రం ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందన్నారు. కుప్పం ప్రాంత అభివృద్ధి సంస్థ అధికారుల అతిథి గృహం కోసం 1.69 ఎకరాల భూమి వర్గీకరణ మార్పునకు ఆమోదం లభించిందన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో అభ్యంతరం లేని ప్రభుత్వ పోరంబోకు భూముల ఆక్రమణల క్రమబద్ధీకరణకు జారీచేసిన ఉత్తర్వులకు రాటిఫికేషన్ ఇచ్చిందన్నారు. వైఎస్సార్ కడప జిల్లా పాతూరులో ఆలయ అభివృద్ధికి 7.66ఎకరాల ప్రభుత్వ భూమిని దేవదాయశాఖకు బదలాయింపునకు ఆమోదం తెలిపిందన్నారు.

ప్రకాశం జిల్లా కొండపిలో బాలుర రెసిడెన్షియల్ స్కూల్, హాస్టల్ కోసం 7 ఎకరాల భూమి వర్గీకరణ మార్పునకు కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి చెప్పారు. ఏపీ విద్యా చట్టం-1982కు సవరణలు చేసే ప్రతిపాదనకు, విదేశీ ఉన్నత విద్యా సంస్థలు,



ప్రైవేట్ యూనివర్సిటీల క్యాంపస్‌ల ఏర్పాటుకు కొత్త పాలసీ-2026కు మంత్రివర్గ సమావేశంలో ఆమోదముద్ర పడిందన్నారు. విదేశీ విద్యా సంస్థలు, ప్రైవేట్ యూనివర్సిటీల క్యాంపస్‌ల ఏర్పాటు, ప్రోత్సాహకాలు, సదుపాయాలపై సమగ్ర విధానానికి కేబినెట్ ఆమోదం తెలిపినట్లు మంత్రి పార్థసారథి వెల్లడించారు.

సిటీలు పెరుగుతున్న కొద్దీ గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరుగుతాయని మంత్రి అన్నారు. అలా వచ్చిన వారు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని ఉపయోగించి ఇళ్లు కట్టుకోవడం సహజమని చెప్పారు. రాజకీయ అవసరాల కోసం ఇలాంటి వారిని కొందరు వాడుకోవడం చూస్తామని.. దీంతో ముఖ్యమంత్రి వీరికి న్యాయం చేయడానికి ‘పేదలకు పట్టాభిషేకం’ కార్యక్రమం చేపట్టారన్నారు. ఈ ఆస్తిలో కొందరికి కోటి రూపాయలు కూడా ఉన్న దాఖలాలు ఉన్నాయన్నారు. ఏపీ విద్యా చట్టం-1982 సెక్షన్‌లలో సవరణ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని.. విద్యార్థులకు ఉన్న సిలబస్‌పై రెగ్యులర్‌గా మానిటర్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు చెప్పారు. నలుగురు మంత్రులు ముందస్తు అనుమతితోనే కేబినెట్ సమావేశానికి దూరంగా ఉన్నారని తెలిపారు.

ప్రధాని నరేంద్ర మోదీ 25 సంవత్సరాలు ప్రభుత్వాధినేతగా పదవీ కాలం పూర్తిచేసినందుకు ఏపీ కేబినెట్ ముఖ్యమంత్రి నేతృత్వంలో తీర్మా నం చేశామన్నారు. మోదీపై ఈ ప్రభత్వానికి ఉన్న గౌరవం, దేశాన్ని అత్యున్నత స్థాయిలో నిలిపేందుకు చేస్తున్న ప్రయత్నం గురించి మంత్రిమండలిలో మంత్రులు మాట్లాడినట్లు తెలిపారు. పాలనలో మోదీ ఎలా సంస్కరణలు తీసుకువచ్చారని, ఏ విధంగా ప్రధానిగా ఎదిగారనే అనే దానిపై ముఖ్యమంత్రి, మంత్రులు మాట్లాడినట్లు మంత్రి పార్థసారథి చెప్పారు.

## ఢిల్లీ చేరుకున్న సీఎం చంద్రబాబు

### స్వాగతం పలికిన ఎంపీలు, టీడీపీ నేతలు

### నేడు ప్రధాని సహా పలువురు కేంద్ర మంత్రులతో భేటీ



న్యూఢిల్లీ: ఒకరోజు పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం మధ్యాహ్నం న్యూఢిల్లీ చేరుకున్నారు. ఆయనకు రాష్ట్రానికి చెందిన టీడీపీ ఎంపీలు, పార్టీ నేతలు ఆత్మీయ స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబు గురువారం ప్రధాని మోదీతో పాటు మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, సీఆర్ పాటిల్, నితిన్ గడ్కరీలతో భేటీ అవుతారు. విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టుతోపాటు బీచ్ కారిడార్ ప్రాజెక్టులను మంజూరు చేయాలని ప్రధాని మోదీకి సీఎం విజ్ఞప్తి చేయనున్నారు. ప్రత్యేకించి నదుల అనుసంధానం ప్రాజెక్టు చేపట్టేందుకు అవసరమైన అధ్యయనం చేయించాలని కూడా కోరనున్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితుల నుంచి ఉపశమనం కలిగించేలా ప్రత్యేక నిధులు మంజూరుపై కూడా ప్రధాని, కేంద్ర హోం మంత్రి అమిత్ షానూ కోరనున్నారు. వచ్చే ఏడాదిలో గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం కేంద్ర సహకారం అందించాలని ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం విజ్ఞప్తి చేయనున్నారు. రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే అంశంపై కూడా కేంద్ర ఆర్థిక మంత్రితో చంద్రబాబు చర్చించనున్నారు. గోదావరి నది నుంచి పెద్ద ఎత్తున సముద్రంలోకి వెళ్తున్న వరద నీటిని సద్వినియోగం చేసుకునే అంశంతోపాటు నదుల అనుసంధానంపై కేంద్ర జలవనరుల శాఖ మంత్రితో భేటీలో చర్చించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఢిల్లీలో భారత పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్ సదస్సులో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయెల్‌తో కలిసి సీఎం చంద్రబాబు పాల్గొంటారు. రాత్రికి ఢిల్లీ నుంచి అమరావతి చేరుకుంటారు.





చైతన్యరథం

## సీఎం చంద్రబాబును కలిసిన ఏపీకి చెందిన

# ఆసియా క్రీడల విజేతలు

### ఆంధ్రప్రదేశ్ ఖ్యాతి నిలిపారంటూ ముఖ్యమంత్రి అభినందనలు

అమరావతి (చైతన్యరథం): ఆసియా క్రీడలు-2026లో విశేష ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఖ్యాతితెచ్చిపెట్టిన క్రీడాకారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభినందించారు. ఆసియా క్రీడల విజేతలు రాష్ట్ర సచివాలయంలో సీఎంను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు సాధించిన పతకాలు, వారి అత్యుత్తమ ప్రదర్శనను ముఖ్యమంత్రి కొనియాడారు. అంతర్జాతీయ వేదికలపై మాతృ భూమి పేరును నిలబెట్టిన క్రీడాకారుల ప్రతిభను అభినంది స్తూ... రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి అంతర్జాతీయంగా రాణించాలని ఆకాంక్షించారు. సీఎం చంద్రబాబును కలిసిన వారిలో క్రీడాకారులు శ్రీచరణి, గణేష్ మణిరత్నం, ధీరజ్ బొమ్మదేవర, వెన్నం జ్యోతిసురేఖ ఉన్నారు. మొత్తంగా 3 రకాల క్రీడాంశాల్లో 3 స్వర్ణాలు, 2 రజతాలు, 3



కాంస్యాలతో సహా మొత్తం 8 పతకాలను మన రాష్ట్ర క్రీడాకారులు కైవసం చేసుకున్నారని సీఎం చంద్రబాబుకు 'శాప్'ఎండీ భరణి వివరించారు. భవిష్యత్తులో రాష్ట్రం నుంచి మరింత మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా ప్రభుత్వం తరపున పూర్తి ప్రోత్సాహం, అవసరమైన మౌలిక సదుపాయాలు అందిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

## మీతో కలిసి పనిచేయడం గర్వంగా ఉంది

### ప్రధాని నరేంద్ర మోదీకి 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్యరథం): 'భారతదేశానికి సరైన సమయంలో సరైన నేతగా మోదీ ఉన్నారు. ఆయన విజన్‌తో వికసిత్ భారత్-2047 దిశగా దేశం వేగంగా పయనిస్తోంది. సుదీర్ఘ ప్రజా సేవలో భాగమైన ప్రధాని మోదీతో కలిసి పని చేయడం నాకు గర్వంగా ఉంది. కేంద్రంలోను, ఏపీలోను డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్లతో అభివృద్ధి, పెట్టుబడులు సరికొత్త వేగం అందుకున్నాయి. ప్రధాని సహకారంతో మౌలిక సదుపాయాలు, అవకాశాల కల్పనతో ఏపీ ముందుకు సాగుతోంది. మోదీ నేతృత్వంలో దృఢమైన భారత్‌తో పాటు సుసంపన్నమైన స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా శ్రమిస్తున్నాం. ప్రధానిగా నరేంద్ర మోదీ మరిన్ని విజయాలను అందుకుని దేశాన్ని ముందుకు నడిపించాలని ఆకాంక్షిస్తాను' అంటూ మోదీ 25ఏళ్ల రాజకీయ ప్రస్థానం సందర్భంగా సీఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా శు భాకాంక్షలు తెలిపారు.

# 25 ఏళ్ల ప్రజా సేవా శిఖరానికి నమో

- ఆధునిక ఉక్కు మనిషి ప్రధాని మోదీ వజ్ర సంకల్పం నెరవేరాలి
- వెంకటపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి నారా లోకేష్ పూజలు

అమరావతి (చైతన్యరథం): దేశ శ్రేయస్సు-ప్రజా సంక్షేమమే లక్ష్యంగా 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానం పూర్తిచేసుకున్న ఆధునిక ఉక్కు మనిషి ప్రధాని నరేంద్ర మోదీకి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, ఆయన వికసిత్ భారత్ వజ్ర సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ అమరావతిలోని వెంకటపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి నారా లోకేష్ పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్నారు. 2001 అక్టోబరు 7వ తేదీన గుజరాత్ ముఖ్యమంత్రిగా మొదలైన మోదీ ప్రస్థానం నేటితో 25 ఏళ్ల



(రజతోత్సవం) పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పేరు మీద వెంకటపాలెం ఆలయంలో లోకేష్ పూజలు చేశారు. ప్రపంచంలోనే మన దేశం అన్ని రంగాల్లో నెం.1గా ఉండాలనే లక్ష్యంతో నిస్వార్థంగా పని చేస్తున్న ఆధునిక ఉక్కు మనిషి నరేంద్ర మోదీకి ఆ శక్తియుక్తులన్నీ దేవుడు ప్రసాదించాలని లోకేష్ ప్రార్థించారు. మోదీ ప్రజా సేవా ప్రస్థా నాన్ని దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ యాత్రగా నిర్వహించడం దేశాభివృద్ధి కోసం ప్రధాని చేస్తున్న కృషికి నిదర్శనమని లోకేష్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.







## సేవా సంకల్ప యాత్రికులకు ప్రధాని అభినందన

'గత కొన్ని రోజులుగా ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రజలు సేవ, సుపరిపాలన (సుశాసన్) లక్ష్యాలను చాటిచెప్తూ సేవా 'సంకల్ప యాత్ర' పేరిట టీడీపీ నాయకులు తిరుపతి నుంచి వారణాసి వరకు బైక్ యాత్ర చేపట్టారు. కృష్ణా, గోదావరి నదుల పవిత్ర జలాలను కాశీకి తీసుకువెళ్లడం అనే వారి ఆలోచన ఎంతో హృదయపూర్వకంగా, స్ఫూర్తించేలా ఉంది. ఈ యాత్రను నిర్వహించి సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఇందులో భాగస్వాములయ్యేలా చూసిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల బృందాన్ని అభినందిస్తున్నాను.' అంటూ ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు.



## డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం

# సమిష్టిగా ముందుకు సాగుదాం

- డ్రగ్స్ వద్దు బ్రో, ఆపరేషన్ చైతన్యం కార్యక్రమాలను విస్తృతం చేయాలి
- డ్రగ్స్ నివారణపై సమన్వయం కోసం త్వరలో దక్షిణ భారత రాష్ట్రాల కాంక్లేవ్
- డ్రగ్స్‌పై ప్రజల్లో అవగాహనకు మంత్రుల బృందం క్షేత్ర స్థాయి పర్యటనలు
- మాదకద్రవ్యాల నివారణపై మంత్రుల బృందం సమావేశంలో మంత్రి లోకేష్




అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నివారణపై హోం మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన మంత్రుల బృందం బుధవారం ఉండవల్లిలో సమావేశమైంది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... డ్రగ్స్‌పై అవగాహన కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ హైస్కూళ్లలో ఈగల్ క్లబ్ లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డ్రగ్స్ దుష్ఫలితాలపై ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులను చైతన్యవంతం చేసేందుకు ఆపరేషన్ చైతన్యం, ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ వంటి కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టాలని ఆదేశించారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' వంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి యువతను చైతన్యవంతం చేయాలన్నారు. డ్రగ్స్, గంజాయి చాక్లెట్ల వంటి వాటి రవాణాను నిరోధించేందుకు రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని, దీనిపై అధికారులు అధ్యయనం చేయాల్సిందిగా మంత్రి సూచించారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో చేపట్టే క్లస్టర్ సమావేశాల్లో ఈగల్ యంత్రాంగాన్ని భాగస్వాములు చేసి, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలకు రూపకల్పన చేయాల్సిందిగా మంత్రి ఆదేశించారు.

యూనివర్సిటీలు, కళాశాలల్లో విద్యార్థులతో నెలకోసారి టౌన్ హాలు సమావేశాల నిర్వహించి డ్రగ్స్‌పై అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. విద్యార్థులను చైతన్యవంతం చేసేలా రాష్ట్రవ్యాప్తంగా ఔత్సాహిక ఉపాధ్యాయులకు బాధ్యతలు ఇస్తామని మంత్రి లోకేష్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నషా ముక్త్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలో డ్రగ్స్ నివారణకు ఈగల్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సింథటిక్ డ్రగ్స్ నివారణపై పంజాబ్ పోలీసులు చేపడుతున్న విధానాలను అధ్యయనం చేయాల్సిందిగా మంత్రి లోకేష్ ఈగల్ విభాగం అధికారులకు విజ్ఞప్తి చేశారు.డ్రగ్స్ నివారణపై సమన్వయం కోసం త్వరలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్‌ను విశాఖపట్నంలో నిర్వహించాలన్నారు. డ్రగ్స్‌వల్ల కలిగే నష్టాలపై మంత్రులు పాల్గొనే ప్రతి సమావేశంలోనూ ప్రస్తావించి ప్రజలను చైతన్యవంతం చేయాల్సిందిగా మంత్రి లోకేష్ కోరారు. డ్రగ్స్‌పై పెద్ద ఎత్తున ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని మంత్రుల బృందం నిర్ణయించింది.

హోం మంత్రి అనిత మాట్లాడుతూ... ఒడిసా నుంచి రాష్ట్రంలోకి గంజాయి రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపుతున్నట్లు చెప్పారు. ఒడిసా సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో నిఘాను పటిష్టం చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా డ్రోన్ నిఘాను విస్తృతం చేయాలని సూచించారు. డ్రగ్స్‌పై అవగాహనకు 'బ్రేక్ ద సైలెన్స్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ మాట్లాడుతూ... ఇటీవల విశాఖ, నర్సరావుపేటల్లో గంజాయి చాక్లెట్లు పట్టుబడ్డాయని, అయితే అవి బిహార్, యూపీ నుంచి వచ్చినట్లు గుర్తించామని చెప్పారు. దీనిపై ఆయా రాష్ట్రాల్లోని పోలీసు ఉన్నతాధికారులకు సమాచారమిచ్చి అప్రమత్తం చేశామని వెల్లడించారు. మత్తుకోసం షెడ్యూల్ డ్రగ్స్, కాఫ్ సిరప్ వంటివి వాడుతున్న వారిపై నిఘా వేసి ఉంచామని, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను విక్రయిస్తున్న 20 మెడికల్ షాపులను సీజ్ చేసినట్టు చెప్పారు. విజయవాడ, రాజమహేంద్రవరం నగరాల్లో డ్రగ్స్ ఉపయోగించే బ్లేడ్ బ్యాచ్‌లను గుర్తించి కఠిన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్ రవాణాను గుర్తించేందుకు 36 సుశిక్షిత జాగిలాలను ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ వినియోగంపై అనుమానితులను గుర్తించి, రాపిడ్ డ్రగ్ డిటెక్షన్ కిట్స్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. డ్రగ్స్‌కు సంబంధించి 192 మంది యాక్టివ్ రిపీట్ అఫెండర్స్‌ను గుర్తించి, వారిపై తీవ్రమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

సమావేశంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, గుమ్మడి సంధ్యారాణి, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్‌చంద్ర లడ్హా, ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ, హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార విశ్వజీత్ పాల్గొన్నారు.

# స్థానిక పోరులో 100 శాతం విజయమే లక్ష్యం

- 34 శాతం బీసీ రిజర్వేషన్లకు టీడీపీ కట్టుబడి ఉంది
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



అమరావతి (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే భాగస్వామ్య పార్టీలతో సీట్ల సర్దుబాటుపై చర్చలు కొనసాగుతున్నాయని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇప్పటికే నాలుగు దఫాలుగా భాగస్వామ్య పక్షాలతో సమావేశాలు నిర్వహించామని, సీట్ల కేటాయింపుపై ఒక అవగాహనకు వచ్చామని చెప్పారు. స్థానిక పోరులో అన్ని స్థానాల్లో విజయమే ధ్యేయంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని, అభ్యర్థులు-పార్టీ శ్రేణుల మధ్య సమన్వయానికి పెద్దపీట వేస్తున్నామని స్పష్టంచేశారు. సీట్ల సర్దుబాటుపై తుది నిర్ణయానికి రిజర్వేషన్ల అంశం కీలకంగా మారిందని పల్లా పేర్కొన్నారు. బీసీలకు 34శాతం రిజర్వేషన్ల అంశం సుప్రీంకోర్టులో పెండింగులో ఉన్నందున బీసీ, ఓసీ తదితర కేటగిరీల వారీగా అభ్యర్థులను ఖరారు చేయలేకపోతున్నామని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం రిజర్వేషన్లపై స్పష్టత వస్తుందని, ఆ వెంటనే సీట్ల సర్దుబాటు ప్రక్రియకు తుదిరూపు ఇస్తామని చెప్పారు. మరో రెండు, మూడు రోజుల్లో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు.

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నదే టీడీపీ విధానమని పల్లా స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పుతో 34 శాతం రిజర్వేషన్లకు విఘాతం కలగడంపై కొంత నిరాశ ఉన్నప్పటికీ, సుప్రీంకోర్టులో సానుకూల ఫలితం వస్తుందన్న ఆశాభావంతో ఉన్నామని తెలిపారు. అనుకూల తీర్పు వస్తే 34 శాతం రిజర్వేషన్ల ప్రకారమే ముందుకు సాగుతామని, న్యాయపరంగా అది సాధ్యం కాని పరిస్థితి ఉంటే పార్టీపరంగా బీసీలకు 34శాతం ప్రాతినిధ్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు కూడా పార్టీపరంగా 34శాతం బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాయని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో వైసీపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని పల్లా విమర్శించారు. ఒకవైపు బీసీ గర్జనలు నిర్వహిస్తూ 34శాతం రిజర్వేషన్లకు మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పూనే మరోవైపు అదే అంశంపై న్యాయస్థానాలను ఆశ్రయిస్తోందని ఆరోపించారు. బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న విషయంలో టీడీపీకి ఎలాంటి సందిగ్ధత లేదని, అందుకే న్యాయపరంగా అన్ని మార్గాల్లో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. రిజర్వేషన్లపై స్పష్టత వచ్చిన వెంటనే నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల ఎంపికకు తుదిరూపు ఇస్తామని పల్లా తెలిపారు. స్థానిక పరిస్థితులపై అవగాహన, ప్రజలతో అనుబంధం, అభివృద్ధి అంశాలపై పట్టున్న వారిని అభ్యర్థులుగా ఎంపిక చేసేలా కసరత్తు చేస్తున్నామని చెప్పారు. ఎన్డీయే భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయంతో పాటు అభ్యర్థులు, పార్టీ శ్రేణుల మధ్య ఎలాంటి పొరపొచ్చాలకు తావులేకుండా ఎన్నికలను సమష్టిగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

టీడీపీ 44 ఏళ్ల ప్రస్థానంలో తొలిసారిగా అత్యధిక సంఖ్యలో నామినేటెడ్ పదవులను కూటమి భాగస్వామ్యపక్షాలకు కేటాయించామని పల్లా తెలిపారు. ఎన్నికలకు ముందు కుదిరిన రాజకీయ అవగాహనలో భాగంగా టీడీపీ నాయకత్వం కూటమి భాగస్వాముల కోసం కొన్ని పదవులను త్యాగం చేసిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో రానున్న రెండేళ్లలో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి అహర్నిశలూ శ్రమించిన నాయకులు, కార్యకర్తలను విస్మరించబోమని పల్లా స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం చేసిన కృషిని నాయకత్వం గుర్తిస్తోందని, అర్హత, సేవలను పరిగణనలోకి తీసుకుని నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. కార్యకర్తల్లో అపోహలు, విభేదాలకు తావులేకుండా అందరినీ కలుపుకుని ముందుకు సాగుతామని చెప్పారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందని పల్లా పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల్లో విశ్వాసం మరింత బలపడిందని తెలిపారు. ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా కూటమి ప్రభుత్వానికి మరోసారి పట్టంకట్టేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని పల్లా పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లోనూ ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించి కూటమి సత్తా చాటేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేస్తాయని స్పష్టం చేశారు.




### దార్శనికత, నిర్ణయాత్మక నాయకత్వానికి

## మోదీ ప్రయాణం ప్రతీక

**ప్రధాని 25ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు**

అమరావతి (చైతన్యరథం): గుజరాత్ నుంచి న్యూఢిల్లీ వరకు గౌరవనీయ ప్రధాని నరేంద్ర మోదీ ప్రయాణం దార్శనికత, నిర్ణయాత్మక నాయకత్వం, భారత అభివృద్ధిపట్ల అచంచలమైన అంకితభావంతో రూపుదిద్దుకుంది.ఆయన నాయకత్వంలో మన దేశం మరింత ఆత్మవిశ్వాసంతో, ఉన్నత లక్ష్యాలతో, ప్రపంచ వేదికపై మరింత గౌరవప్రదంగా ఎదగడాన్ని ఒక తరం భారతీయులు చూశారు. వికసిత్ భారత్-2047 దిశగా పనిచేస్తున్న తరుణంలో, పెద్దగా ఆలోచించడం, ప్రతి అంశంపైనా దృష్టి పెట్టడం, భారీ స్థాయిలో అమలు చేయడంలో ఆయనకున్న సామర్థ్యం ప్రజా జీవితంలో ఉన్న మనందరికీ నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. ఈ అద్భుతమైన మైలురాయిని పూర్తి చేసుకున్నందుకు అభినందనలు సర్. భారత్‌కు ఇంకా మరెన్నో సంవత్సరాలు సేవ అందించాలని ఆశిస్తున్నాను.'అంటూ 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తి చేసుకున్న ప్రధాని మోదీకి మంత్రి ఐటీ, విద్య శాఖల మంత్రినారా లోకేష్ 'ఎక్స్'వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

## పింఛన్ నుంచి పట్టా వరకు.. పంట నుంచి ప్రపంచ మార్కెట్ వరకు...
## గ్రామాల్లో రోడ్ల నుంచి.. ప్రతి ఇంటికీ తాగునీటి వరకు...

# ప్రతి కుటుంబానికి భరోసా... వర్గానికి అండ... ప్రాంతానికి అవకాశం



- **ఏడురోజులు...తొమ్మిది ప్రాధాన్యత కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు**
- **సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో అవసరాలు, భవిష్యత్ అవకాశాలు కల్పించేలా కార్యాచరణ**
- **కేంద్ర సహకారం, పవన్‌కళ్యాణ్ సమన్వయంతో వేల కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం**

ప్రతి కుటుంబానికి భరోసా...ప్రతి వర్గానికి అండ... ప్రతి ప్రాంతానికి అవకాశం అనే విధానంలో ఏపీ ప్రభుత్వం కార్యక్ర మాల జోరు పెంచింది. రెండేళ్ల పాలనలో వ్యవస్థలను చక్కదిద్ది సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్ర పునర్ నిర్మాణ యజ్ఞం లో మరికొన్ని కీలక అడుగులు వేసింది. ప్రజల తక్షణ అవసరా లైన సంక్షేమం అందిస్తూనే...వారి జీవన ప్రమాణాలు పెంచే కార్యక్రమాలు అమలు చేస్తోంది. గత వారంరోజుల్లో 9 కార్యక్ర మాల్లో పాల్గొన్ని సీఎం చంద్రబాబు పలు భారీ అభివృద్ధి కార్యక్ర మాలను ప్రారంభించారు. కేంద్ర సహకారం, పవన్‌కళ్యాణ్‌తో సమన్వయంతో పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పింఛన్ నుంచి పట్టా వరకు...పంట నుంచి ప్రపంచ మార్కెట్ వరకు... గ్రామాల్లో రోడ్ల నుంచి ప్రతి ఇంటికీ తాగునీటి వరకు... ప్రజల జీవన ప్రమాణాలు పెంచే కార్యక్రమాలను కేంద్రమంత్రులతో కలిసి ప్రారంభించారు. ఏడురోజులు... తొమ్మిది ప్రాధాన్యత కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు అవకాశాలు అన్‌లాక్ చేశారు.

### సంక్షేమం...అభివృద్ధి బ్యాలెన్స్!

పేద కుటుంబానికి 1వ తేదీ పింఛన్ అందాలి. నివసిస్తున్న ఇంటిపై శాశ్వత హక్కు ఉండాలి. ఇంటి ముందు రోడ్డు, ఇంటిలో తాగునీరు ఉండాలి. రైతు పండించిన పంటకు మార్కెట్, యువత నేర్చుకున్న నైపుణ్యానికి ఉపాధి అవకాశం దొరకాలి. ప్రభుత్వ కార్యాలయంలో ప్రజల పని సకాలంలో జరగాలి. ఈ లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం ప్రాధాన్యతలు నిర్ధేశించుకుని వారం రోజుల్లో పలు కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో చేపట్టింది. వారంరోజుల పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్న తొమ్మిది ప్రాధాన్యతా కార్యక్ర మాల్లో ఈ అనుసంధానం కనిపించింది. పేదల సేవలో పింఛన్ల పంపిణీ, పల్లె పండుగ, ఇంటి పట్టాలు, హార్టికల్చర్ హబ్-ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్, స్వచ్ఛతా అవార్డులు, ఐగాట్ కర్మయోగి, పాన్ ఐఐటీ సదస్సు, మూడు లక్షల ఇళ్లకు భూమి పూజ, అమరజీవి జలధార కార్యక్రమాలు కుటుంబ భద్రత నుంచి రాష్ట్ర భవిష్యత్తు వరకు అనేక ప్రయోజనాలను కల్పించనున్నాయి. పేదలకు అండ, గ్రామాలకు సౌకర్యాలు, సీమ రైతులకు ఆదా యం, యువతకు అవకాశాలు ప్రధాన అంశాలుగా వేల కోట్ల ప్రాజెక్టులను పట్టాలు ఎక్కించారు.

### పింఛన్‌తో రోజువారీ భరోసా... పట్టాతో జీవితకాల భద్రత

ఎన్టీఆర్ భరోసా పథకం కింద 28వ విడత పింఛన్ల పంపిణీ లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పింఛన్ల కోసం ఇప్పటివరకు రూ.76 వేల కోట్లు పంపిణీ చేశారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఈ సహాయం రోజువారీ అవసరా లను తీర్చుకోవడంలో అండగా నిలుస్తుంది. వ్యక్తిగత ఖర్చులకు స్వయంగా డబ్బు వెచ్చించగలగడం వారి ఆత్మగౌరవానికీ తోడ్పడుతుంది.

### పేదల ఆత్మగౌరవానికి పట్టాభిషేకం... 60 వేల మందికి మందికి ఇళ్ల పట్టాలు

'పేదల సేవలో' కార్యక్రమం ద్వారా లబ్ధిదారులను నేరుగా కలుసుకోవడం, వారి పరిస్థితులను తెలుసుకోవడం పాలనకు క్షేత్రస్థాయి అనుసంధానాన్ని అందిస్తుంది. ఆర్థిక అండతో పాటు కుటుంబానికి స్థిరమైన నివాస హక్కు కల్పించాలనే లక్ష్యంతో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తూ హక్కుల కోసం ఎదురు చూస్తున్న అర్హులైన పేద కుటుంబాలకు శాశ్వత పట్టాలు అందిం చడం దీని ఉద్దేశం. విజయవాడ పరిసర నియోజకవర్గాల్లో 26,401 కుటుంబాలకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ ఆస్తుల ప్రభుత్వ విలువ రూ.11,246 కోట్లు కాగా, మార్కెట్ అంచనా రూ.28,118 కోట్లు. విశాఖపట్నంలో 28,445 కుటుంబాలకు అందించిన పట్టాల ప్రభుత్వ విలువ రూ.8,874 కోట్లు కాగా మార్కెట్ అంచనా దాదాపు రూ.22,185 కోట్లు. మంగళగిరిలో మూడు విడతల్లో 5,800 మందికి పట్టాలు అందించారు. వాటి ప్రభుత్వ విలువ రూ.727 కోట్లు కాగా, మార్కెట్ అంచనా రూ. 1,706 కోట్లు. మొత్తంగా ఈ మూడు ప్రాంతాల్లో 60,646 మంది లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చి పేదల ఆత్మగౌరవానికి పట్టాభిషేకం చేశారు. మూడు చోట్లా కలిపి మార్కెట్ అంచనా రూ.52,000 కోట్లు ఉంటుంది. ఇంటి పట్టాతో కుటుంబానికి లభించేది తన నివాసంపై నమ్మకం. రేపటి గురించి ఆలోచించేం దుకు స్థిరత్వం. పింఛన్ నేటి అవసరానికి అండగా ఉంటే, పట్టా భవిష్యత్ భద్రతకు పునాది వేస్తుంది. అందుకే ప్రభుత్వం ప్రత్యేక జీవోలు ఇచ్చి ఈ కార్యక్రమం చేపట్టింది.

### 3 లక్షల ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం

2029 నాటికి రాష్ట్రంలో అర్హులైన ప్రతిఒక్కరికి సొంతిల్లు ఇవ్వాలన లక్ష్యంలో భాగంగా మూడు లక్షల పీఎంఏవై-గ్రామీణ్ 2.0 ఇళ్లకు భూమిపూజ జరిగింది. మరో ఆరు లక్షల ఇళ్లను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కేంద్రాన్ని కోరారు. 2029 నాటికి ప్రతి కుటుంబానికి ఇల్లు, రాష్ట్రంలో 19 లక్షల ఇళ్ల నిర్మా ణం అనే ప్రభుత్వ లక్ష్యాల సాధనలో తాజా భూమిపూజ ఒక అడుగు. కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌తో కలిపి తెనాలిలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు.

### గ్రామాల్లో మళ్లీ వెలుగులు...పల్లె పండుగ 3.0

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పల్లె పండుగ 3.0 ద్వారా రూ.11,085 కోట్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉదయగిరి లో ముఖ్యమంత్రి చంద్రబాబు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కలిసి ఈ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 15,500 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్లు, 22,000 మినీ గోకులాలు, పశుగ్రాసం కొరతను అధిగమించేం దుకు హరిత గోపాలం, 1,000 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రైన్లు, బస్ షెల్టర్లు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం, ఉద్యాన పంటల పెంపకానికి ప్రోత్సాహం వంటి అంశాలు ఉన్నాయి. రహదారి రైతుకు మార్కెట్ చేరువ చేస్తుంది. విద్యార్థికి పాఠశాల ప్రయాణా న్ని, రోగికి ఆసుపత్రి చేరుకోవడాన్ని సులభం చేస్తుంది. మినీ గోకులాలు, పశుగ్రాసం కార్యక్రమాలు పాడి ఆధారిత జీవనోపాధి కి ఉపయోగపడేలా రూపొందించారు. గ్రామీణ సౌకర్యాలకు కుటుంబ ఆదాయాలు, స్థానిక ఆర్థిక కార్యకలాపాలతోనూ సంబం ధం ఉంది. వీటికి అనుగుణంగా భారీస్థాయిలో పల్లె పండుగ 3.0 కార్యక్రమం ప్రారంభించారు.

### జల్‌జీవన్‌కు మళ్లీ జీవం

గత ప్రభుత్వం కేంద్ర పథకాలు అన్నీ నిర్వీర్యం చేసింది. ముఖ్యంగా ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు ఇచ్చే కేంద్ర పథకమైన జల్ జీవన్ మిషన్‌ను నిర్వీర్యం చేసింది. అన్ని రాష్ట్రాలు లక్షల కోట్ల పనులు చేస్తే గత ప్రభుత్వం మన రాష్ట్రంలో కేవలం రూ.2600 కోట్ల పనులకే పరిమితం చేసింది. ఇంటి గడపకు సురక్షితమైన నీరు అందించే లక్ష్యంతో జలజీవన్ మిషన్ 2.0-'అమరజీవి జలధార' కింద రూ.30,156 కోట్ల పనులకు శ్రీకారం చుట్టారు. కొత్తగా మరో 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు ఇంటి కొళాయి కనెక్షన్లు అందించడం లక్ష్యం. నీటి సేకరణకు వెచ్చించే సమయం, శ్రమ తగ్గడం కుటుంబాలకు, ముఖ్యంగా మహిళలకు ప్రయోజనం కలిగించగలదు. ఇల్లు, రహదారి, పారిశుధ్యం, తాగునీరు కలిసినప్పుడే నివాస ప్రాంతంలో జీవన నాణ్యత పెరుగుతుంది.

### హార్టికల్చర్ హబ్‌తో సీమలో సిరులు

రాయలసీమ దశ దిశ మార్చే గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టు కు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఏడాది కాలంగా దీని కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలించి నేడు కార్యరూపం దాల్చింది. రాయలసీమను 'ఫ్రూట్ బౌల్ ఆఫ్ ది వరల్డ్'గా తీర్చిదిద్దడం, కరువు పరిస్థితులను అధిగమించడం, రైతులకు స్థిరమైన రాబడి కల్పించి తలసరి ఆదాయాన్ని పెంచడం ప్రధాన లక్ష్యాలు. దీనిలో భాగంగా మదనపల్లిలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఈ పనులకు శ్రీకారం చుట్టారు. రూ.లక్ష కోట్ల ప్రణాళికలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.40 వేల కోట్లు, ప్రైవేటు పెట్టుబడుల ద్వారా మరో రూ.60 వేల కోట్లు సమీకరించాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. రంగాల వారీగా సాగునీటికి రూ.20,884 కోట్లు, ఉద్యానవన రంగానికి రూ.14,906 కోట్లు, గ్రామీణ రహదారుల విస్తరణకు రూ.4,562 కోట్ల ఖర్చు చేస్తారు. రాయలసీమలోని ఎనిమిది జిల్లాలు, ఉమ్మడి ప్రకాశం పరిధిలోని రెండు జిల్లాలతో కలిపి మొత్తం 10 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. 201 హార్టికల్చర్ క్లస్టర్లు, 303 మండలా లు, 5,869 గ్రామాలు దీని పరిధిలో ఉన్నాయి. కొత్తగా సుమారు ఆరు లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరించి మొత్తం సాగును 14.41 లక్షల హెక్టార్లకు పెంచడం లక్ష్యం. ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం 9.6 లక్షల మంది రైతులకు ప్రత్యక్ష ప్రయోజ నం, 49 లక్షల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రాజెక్టు ద్వారా ఏటా సుమారు రూ. 81 వేల కోట్ల స్థూల విలువ జోడింపు GVA సాధ్యమవుతుందని అంచనా. ఇది సంబంధిత ఆర్థిక కార్యకలాపాలు సృష్టించే విలువకు సంబంధించిన అంచనా. ఇదే కార్యక్రమంలో రిలయన్స్ సహకారంతో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్-ISAకు శంకుస్థాపన చేశారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో జ్ఞానం, పరిశోధన, విలువ గొలుసుల అభివృద్ధికి ఇది వేదిక కావాలన్నది ఉద్దేశం. రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలను కార్పొరేట్ మార్కెట్లతో అనుసంధానించడం, సరైన ధరలు పొందే అవకాశా లను విస్తరించడం కూడా ఈ దృక్పథంలో భాగం. సాగునీటి నుంచి పంట వరకు, పంట నుంచి రవాణా వరకు, రవాణా నుంచి మార్కెట్ వరకు అవసరమైన అనుసంధానం ఏర్పడితే రైతు శ్రమకు మెరుగైన ప్రతిఫలం లభించే అవకాశం ఉంటుంది. గ్రామీణ ఆదాయాలను పెంచే ప్రయత్నంగా ఈ కార్యక్రమం ప్రాధాన్యం సంతరించుకుంది.

### ఉద్యోగి నైపుణ్యం

పథకాలు ప్రజలకు సమర్థంగా చేరాలంటే వాటిని అమలు చేసే పరిపాలనా వ్యవస్థకు సామర్థ్యం అవసరం. ఐగాట్-కర్మయోగి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల పరిపాలనా నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యం, సేవల నాణ్యతను మెరుగుపరిచే శిక్షణకు ప్రాధాన్యం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఉద్యోగులు ఇప్పటికే రెండు కోట్ల కోర్సులు పూర్తి చేసుకున్నారు. శిక్షణ ద్వారా నేర్చుకు న్న అంశాలు కార్యాలయ పనితీరులో ప్రతిఫలిస్తే ప్రజలకు ప్రయో జనం పెరుగుతుంది.

### స్వచ్ఛతకు ప్రోత్సాహం

అలాగే గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛాంధ్ర-2026 అవార్డుల ద్వారా పరిశుభ్రతలో మంచి పనితీరును ప్రోత్సహించా రు. 22 విభాగాల్లో 91 రాష్ట్రస్థాయి అవార్డులు, జిల్లాస్థాయిలో 1,906 అవార్డులు అందించారు. స్థానిక సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రతను నిరంతర ఆచరణగా మార్చాలన్నది ఈ ప్రయత్నం. స్వర్ణాంధ్ర లక్ష్యానికి పరిశుభ్రమైన గ్రామాలు, పట్టణాలు అవసరం. ప్రభుత్వ సేవల్లో సమర్థత, నివాస ప్రాంతాల్లో పరిశు భ్రత ప్రజల ఆరోగ్యానికి, సమయానికి, జీవన నాణ్యతకు తోడ్పడతాయి.

### పాన్ ఐఐటీ సదస్సు నిర్వహణ.. అమరావతి కౌన్సిల్ ఏర్పాటుకు నిర్ణయం

విజయవాడలో పాన్ ఐఐటీ ఏపీ-2026 సదస్సును అత్యంత ఘనంగా నిర్వహించారు. విజన్, ఆవిష్కరణలు, యువత అవకాశా లను అనుసంధానించే కార్యక్రమంగా ఇది నిలిచింది. 23 ఐఐటీల డైరెక్టర్లు, 50 మందికి పైగా పరిశ్రమల అధిపతులు-సీఈఓలు, 100 మంది వెంచర్ క్యాపిటలిస్టులు-ఇన్వెస్టర్లు హాజరయ్యారు. ఐఐటీలతో పాటు ఐఐఎం, ఐఐఎస్ఈఆర్ వంటి విద్యాసంస్థల మేధోసంపత్తి, గ్లోబల్ ఐఐటీ నెట్‌వర్క్‌ను రాష్ట్ర అభివృద్ధి, డీప్‌టెక్ విస్తరణకు అనుసంధానించడం ప్రధాన ఉద్దేశం. ఐటీ, పరిశోధన, స్టార్టప్, డీప్‌టెక్ రంగాల్లో నెట్‌వర్క్‌లు, పెట్టుబడుల ద్వారా ఏపీని అంతర్జాతీయ నాలెడ్జ్, టెక్నాలజీ కేంద్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అమరావతి డిక్లరేషన్ ద్వారా పాన్ ఐఐటీ అలుమ్ని భాగస్వామ్యంతో అమరావతిలో శాశ్వత సంస్థాగత కౌన్సిల్ ఏర్పా టుకు అంగీకరించారు. రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు, 'ల్యాబ్ టు మార్కెట్' విధానంలో విద్యాసంస్థల పరిశోధనలను పరిశ్రమలు, ఇన్వెస్టర్లతో అనుసంధానించి వాణిజ్య ఉత్పత్తులుగా మార్చడం వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. క్వాంటం రంగం లో అమరావతిలో పూర్తి వ్యవస్థల అభివృద్ధి, తయారీ లక్ష్యాలను ముఖ్యమంత్రి వివరించారు. 2027 ఫిబ్రవరి నుంచి క్వాంటం కంప్యూటర్ కార్యకలాపాలు ప్రారంభించాలని ప్రకటించారు.

### హెల్తీ వెల్తీ హ్యాపీ ఏపీ

ఈ వారం కార్యాచరణలో పింఛన్ ద్వారా తక్షణ అండ, పట్టా ద్వారా ఆస్తి భద్రత, ఇల్లు-రోడ్డు-నీటి ద్వారా జీవన సౌకర్యాలు, ఉద్యాన అభివృద్ధి ద్వారా ఆదాయం, శిక్షణ-ఆవిష్కరణల ద్వారా సేవలు అవకాశాలు కల్పించే కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థ వంతంగా చేపట్టింది. ప్రతి కుటుంబం మరింత భద్రంగా, గౌరవం గా, మెరుగైన ఆదాయంతో జీవించగలిగినప్పుడు సంక్షేమం-అభివృద్ధి-సుపరిపాలన అనే లక్ష్యానికి పూర్తి అర్థం లభిస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. హెల్తీ వెల్తీ హ్యాపీ ఏపీ సాధిస్తామని ప్రకటించారు.

- గురజాల మాల్యాద్రి,
టీడీపీ నాలెడ్జ్ సెంటర్ చైర్మన్



# ఏపీలో పెట్టుబడులకు కొత్త ఊపు

- గత రెండేళ్లలో రూ.22.6 లక్షల కోట్ల పెట్టుబడులు
- 9.3 లక్షల ఉద్యోగావకాశాలకు అవకాశం
- 714 ప్రాజెక్టుల ప్రణాళికను సిద్ధం చేశాం
- విశాఖను కోస్టల్ సిటీగా అభివృద్ధి చేయడమే ధ్యేయం
- వాణిజ్యం మరియు ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్

విశాఖపట్నం (చైతన్య రథం): ఆర్థిక అభివృద్ధి పవర్‌పాయింట్‌లో కనిపించకూడదు... ప్రజల జీవితాల్లో కనిపించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే పరిశ్రమలకు ప్రోత్సాహాన్ని అందిస్తూ పెట్టుబడిదారులకు చేయూతనిస్తున్నట్లు వాణిజ్యం మరియు ఆహార శుద్ధి శాఖ మంత్రి టి.జి. భరత్ పేర్కొన్నారు. విశాఖ మధురానగరంలో ఉన్న ఐఐఎంలో బుధవారం జరిగిన 31వ ప్రాంతీయ పెట్టుబడుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయుడు చాలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని, ఎంఓయూలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని చెప్పారని తెలిపారు. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు రూ.22.6 లక్షల కోట్ల విలువైన, 9.3 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించగల 714 ప్రాజెక్టుల ప్రణాళికను సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే రూ.5 లక్షల కోట్ల విలువైన 257 ప్రాజెక్టులు క్షేత్రస్థాయికి చేరుకుంటున్నాయని, రాబోయే కొద్ది నెలల్లో మరిన్ని ప్రాజెక్టులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. బ్యాంక్ ఆఫ్ బరోడా, ఫోర్బ్స్ నివేదికల ప్రకారం భారతదేశంలో ప్రతిపాదిత పెట్టుబడుల్లో 25.3 శాతం వాటా ఒక్క ఆంధ్రప్రదేశ్‌దేనని, భారతదేశం మొత్తం మీద వచ్చే ప్రతిపాదిత పెట్టుబడుల్లో నాలుగో వంతు ఒకే ఒక రాష్ట్రానికి వస్తోందని, అదే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమని అన్నారు.




ముఖ్యమంత్రి 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వైపు అడుగులు వేయడం గురించి మాట్లాడుతున్నారని, ఇది పెట్టుబడిదారులకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. పెట్టుబడిదారులు, మంత్రులు, ఉన్నతాధికారులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటున్నామని, పెట్టుబడిదారునికి జరిగే ఆలస్యం జరిగితే ఆంధ్రప్రదేశ్‌కు జరిగే ఆలస్యమేనని భావించాల్సి ఉందన్నారు. ఈ రోజు 92,000 పైగా ఉద్యోగాలను సృష్టించే అవకాశం ఉన్న రూ.21,498 కోట్ల విలువైన 31 ఎంఓయూలు కుదుర్చుకుంటున్నామని, ఈ రోజే సుమారు రూ.5,000 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని తెలిపారు. నక్కపల్లి వద్ద ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ సంస్థ దాదాపు రూ.1.35 లక్షల కోట్ల వ్యయంతో, 18 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో, 55,000 ఉద్యోగాల కల్పన లక్ష్యంగా భారీ ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టడం జరుగుతోందన్నారు. గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్లతో 1 గిగావాట్ ఏఐ హబ్‌ను, రిలయన్స్ సంస్థ 17 బిలియన్ డాలర్లతో 1.5 గిగావాట్ ఏఐ క్లస్టర్‌ను నిర్మిస్తున్నాయని, 2030 నాటికి డేటా సెంటర్ల సామర్థ్యం 6.5 గిగావాట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

స్టీల్, ఏఐ, డేటా సెంటర్లు, గ్రీన్ హైడ్రోజన్, రక్షణ రంగం, నౌకా నిర్మాణం, ఫుడ్ ప్రాసెసింగ్, స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ వంటివన్నీ మూడు వేర్వేరు ప్రాంతాలలో ఒకేచోట రూపుదిద్దుకుంటున్నాయని, అందుకే వైజాగ్ తర్వాతి బెంగళూరుగానో లేక తర్వాతి హైదరాబాద్‌గానో పిలవబడటం ఇష్టం లేదని, వైజాగ్ తనదైన గుర్తింపు, బలాలు, భవిష్యత్తు కలిగిన మొట్టమొదటి గ్లోబల్ నగరంగా ఎదగాలని కోరుకుంటున్నానని అన్నారు. 175 ఎంఎస్‌ఎంఈ పార్కులు, క్లస్టర్ ఆధారిత పారిశ్రామిక కారిడార్లు, సెక్టోరియల్ పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 'ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త' కార్యక్రమం ద్వారా వ్యాపారవేత్తలను ప్రతి జిల్లాకు, ప్రతి సమాజానికి చేరవేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అంతిమంగా ఆర్థిక వృద్ధి అనేది పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్లకే పరిమితం కాకూడదు, ప్రజలు దాన్ని తమ జీవితాల్లో అనుభవించాలని తెలిపారు. రైతు మరింత ఆదాయం పొందాలి, యువత ఇంటికి సమీపంలోనే మంచి ఉద్యోగం సంపాదించాలి, మహిళలు తాము కూడా వ్యాపారవేత్తలు కాగలమనే ఆత్మవిశ్వాసాన్ని పొందాలని, తమ పిల్లలు అవకాశాల కోసం రాష్ట్రాన్ని విడిచి వెళ్లాలా అని తల్లిదండ్రులు ఆలోచించాల్సిన పరిస్థితి ఉండకూడదని అన్నారు. నవంబర్ 12, 13 తేదీల్లో 31వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ కోసం ప్రపంచం తిరిగి ఇక్కడికి విశాఖపట్నానికి రానుందని, ఈ కార్యక్రమానికి ఇక్కడున్న పెట్టుబడిదారులను నేను వ్యక్తిగతంగా ఆహ్వానిస్తున్నానని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కేవలం ఒక సదస్సు కోసం మాత్రమే రావద్దు; ఒక ప్రాజెక్ట్‌తో రండి, ఒక ఆలోచనతో రండి, ఒక సవాలుతో రండి, మా వేగాన్ని పరీక్షించండి. ఎందుకంటే మేము కేవలం ఒక సదస్సు కోసం పెట్టుబడిదారుల కోసం చూడటం లేదు; రాబోయే 20 సంవత్సరాల పాటు మా భాగస్వాములుగా ఉండే వారి కోసం చూస్తున్నాం అని పిలుపునిచ్చారు.

## ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు లక్ష్యం

**మీడియా సమావేశంలో మంత్రి భరత్**

విశాఖపట్నం (చైతన్య రథం): రాష్ట్రంలో పెట్టుబడులను వాస్తవరూపంలోకి తీసుకువచ్చి పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. గంభీరం ఐఐఎంలో సీఐఐ రీజినల్ కాన్ఫరెన్స్ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంఓయూల సంఖ్య కంటే వాటి గ్రౌండింగ్‌కే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలో సుమారు రూ.14 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం లభించిందని, గత ఎంఓయూలతో కలిపి రూ.22–23 లక్షల కోట్ల పెట్టుబడులు కన్ఫర్మ్ అయ్యే స్థాయికి వచ్చాయని తెలిపారు. వీటి ద్వారా 10 లక్షలకు పైగా ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రత్యేక గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ పనిచేస్తోందని చెప్పారు. అన్ని ప్రాంతాల్లో సమతుల్య పారిశ్రామిక అభివృద్ధి కోసం క్లస్టర్ విధానాన్ని అమలు చేస్తున్నామని, డిఫెన్స్, స్పేస్, ఆటోమోటివ్, కెమికల్స్, ఫార్మా తదితర రంగాల్లో ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు లక్ష్యంతో 175 పార్కుల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని, ఇప్పటికే సుమారు 138 పార్కుల్లో గ్రౌండింగ్ లేదా ఫౌండేషన్ పనులు జరుగుతున్నాయన్నారు. స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే దీర్ఘకాలిక అభివృద్ధి సాధ్యమని మంత్రి పేర్కొన్నారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామని, పరిశ్రమల్లో స్థానికులకు సుమారు 80 శాతం వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# ఏపీ మౌలిక సదుపాయాలతో పెట్టుబడులకు ఊపు

- పెట్టుబడులు, పరిశ్రమలకు అనుకూలంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి
- రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

విశాఖపట్నం (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రాజెక్టులు ముందుకు సాగేలా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. విశాఖలో జరిగిన సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ ప్రాంతీయ సదస్సులో పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఒక ఉత్పత్తి ఫ్యాక్టరీ గేటు నుంచి దేశ, విదేశీ మార్కెట్లకు సరుకు చేరే వరకు అవసరమైన రోడ్లు, పోర్టులు, టెర్మినల్స్, లాజిస్టిక్స్ వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. రవాణాలో ఆదా అయ్యే ప్రతి రోజు, లాజిస్టిక్స్‌లో ఆదా అయ్యే ప్రతి రూపాయి పెట్టుబడి పోటీతత్వాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గించడం, మల్టీ-మోడల్ కనెక్టివిటీని పెంచడం ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, మున్సిపాలిటీల పరిధిలో కలిపి సుమారు 1.6 లక్షల కిలోమీటర్ల రోడ్ల నెట్‌వర్క్ ఉందని, ఇందులో 8,360 కిలోమీటర్లు జాతీయ రహదారులు ఉన్నాయని



తెలిపారు. రాష్ట్రంలో రూ.1 లక్ష కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులు నిర్మాణం, డీపీఆర్ దశల్లో ఉన్నాయని చెప్పారు. 2024-25, 2025-26లో ఎన్‌హెచ్‌ఏఐ పరిధిలో సుమారు రూ.24 వేల కోట్లతో 1,530 కిలోమీటర్ల రహదారి ఆస్తులను అభివృద్ధి చేశామని, ఈ విషయంలో జాతీయ స్థాయిలో రాష్ట్రం మూడో స్థానంలో నిలిచిందన్నారు.

కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.31 వేల కోట్ల విలువైన అమరావతి ఔటర్ రింగ్ రోడ్ ప్రాజెక్టును మంజూరు చేసిందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మద్దతుతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమన్వయంతో ఇది సాధ్యమైందన్నారు. పోర్టుల అభివృద్ధిని రోడ్లు, లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలతో అనుసంధానిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 23 పోర్టు, హార్బర్ ప్రాజెక్టులను గుర్తించామని, మచిలీపట్నం, రామాయపట్నం, మూలాపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు మార్చి 2027 నాటికి అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. విశాఖపట్నంలో రెండు మల్టీ-మోడల్ లాజిస్టిక్స్ పార్కులు ఇప్పటికే పనిచేస్తున్నాయని, అనకాపల్లిలో మరో ఎంఎంఎల్‌పీ ఏర్పాటుపై అధ్యయనం జరుగుతోందన్నారు. ప్రతిపాదిత ఏపీ లాజిస్టిక్స్ పాలసీలో రైలు అనుసంధానత కలిగిన నాలుగు మల్టీ-మోడల్ లాజిస్టిక్స్ పార్కులు, ఆరు ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్కులు, 22 ట్రక్ టెర్మినల్స్, 300 కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలను సమన్వయం చేసేందుకు ఏపీ-లింక్‌ను ఆమోదించామని, ట్రాన్స్‌పోర్ట్ కనెక్ట్ యాప్, లాజిస్టిక్స్ అనలిటిక్స్ డ్యాష్‌బోర్డ్ వంటి డిజిటల్ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. విశాఖ ప్రాంతంలో మెరైన్, సీఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా, పెట్రోలియం, ఎనర్జీ, ఐటీ రంగాల్లో, శ్రీకాకుళంలో మెరైన్ ఉత్పత్తులు, ఆగ్రో ప్రాసెసింగ్, లోహాలు, ఖనిజాల్లో, విజయనగరంలో ఆక్వాకల్చర్, ఇంజనీరింగ్ రంగాల్లో భారీ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జిల్లా అవసరాలకు అనుగుణంగా లాజిస్టిక్స్ పార్కులు, ట్రక్ టెర్మినల్స్, కోల్డ్ చైన్లు, మల్టీ-మోడల్ కనెక్టివిటీని అభివృద్ధి చేస్తున్నామన్నారు.

కేవలం మౌలిక సదుపాయాలను నిర్మించడం కాకుండా పరిశ్రమలకు ఎక్కడ అవసరమో అక్కడే వాటిని ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. డెవలపర్లు, లాజిస్టిక్స్ కంపెనీలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్, సాంకేతిక సంస్థలు, తయారీదారులు, అంతర్జాతీయ పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దాదాపు రూ.1 లక్ష కోట్ల విలువైన రోడ్ల ప్రాజెక్టులు పైప్‌లైన్‌లో ఉన్నాయని, వేగవంతమైన రవాణాకు టెర్మినల్స్, లాజిస్టిక్స్ పార్కులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. "ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉంది. రండి.. ప్రభుత్వంతో చేతులు కలపండి. రోడ్లు, ఓడరేవులు, లాజిస్టిక్స్ వ్యవస్థలను మనమందరం కలిసి నిర్మిద్దాం" అని పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు.



# వేగమే ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకత

## పెట్టుబడులకు, పరిశ్రమలకు రాష్ట్రం స్వర్గధామంగా మారుతోంది: కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



విశాఖపట్నం (చైతన్య రథం): ఎన్ని అవరోధాలు వచ్చినా ప్రధాని మోదీ నాయకత్వంలో 7.8 శాతం వృద్ధి రేటుతో భారతదేశం ఎదుగుతోందని కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. బుధవారం విశాఖపట్నం ఐఐఎంలో జరిగిన సీఐఐ ప్రాంతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రామ్మోహన్ నాయుడు.. 25 సంవత్సరాలుగా ఒక్కరోజు కూడా విరామం లేకుండా దేశ సేవలో నిమగ్నమై పనిచేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కేంద్ర శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల ఆలోచనలు, నాయకత్వంతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో వేగంగా పయనిస్తోందన్నారు. ఈ అభివృద్ధి ప్రయాణంలో ప్రధాన ఇంగ్రీడియంట్‌గా నారా లోకేష్ మారారని పేర్కొన్నారు. "టైమే ఇప్పుడు పెట్టుబడి" అని రామ్మోహన్ నాయుడు అన్నారు. పెట్టుబడిదారులకు ప్రాజెక్టులను వేగంగా ప్రారంభించడమే కీలకమని, ఏపీఐఐసీ సింగిల్ విండో మెకానిజం ద్వారా 6 నుంచి 12 నెలల్లో అనుమతుల ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. దీంతో పెట్టుబడిదారులు రాష్ట్రంలో వేగంగా పరిశ్రమలను స్థాపించేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు. చంద్రబాబు నాయుడు వచ్చే 25 ఏళ్లలో జరగబోయే అభివృద్ధిని ముందుగానే ఊహించి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. విశాఖపట్నం గేట్‌వే ఆఫ్ ఎకానమీగా దేశంలో గుర్తింపు పొందుతోందని, అన్ని రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ ఆలోచన ఎంతో గొప్పదని రామ్మోహన్ నాయుడు అన్నారు.

**భోగాపురం విమానాశ్రయం ఆర్థిక అభివృద్ధిలో కీలక భాగస్వామి**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి విజయ ప్రస్థానంలో భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం భాగస్వామ్యం కావడం ఎంతో ఆనందంగా ఉందని కేంద్ర మంత్రి అన్నారు. కేవలం 31 నెలల్లో విమానాశ్రయ నిర్మాణం పూర్తవడం, నిర్ణీత గడువుకు ఆరు నెలల ముందుగానే ప్రాజెక్టు పూర్తిచేయడం రాష్ట్రంలో ప్రాజెక్టుల అమలులో ఉన్న వేగానికి నిదర్శనమన్నారు. కేంద్రం, రాష్ట్రం మధ్య మ్యూచువల్ రెస్పెక్ట్‌తో బంధం మరింత బలపడిందని రామ్మోహన్ నాయుడు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నూతన ఆలోచనలతో దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడిగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్రానికి రైల్వే జోన్ రావడం కూడా కీలక పరిణామమని పేర్కొన్నారు. అహ్మదాబాద్ నుంచి ముంబై వరకు నిర్మితమవుతున్న బుల్లెట్ ట్రైన్ ఆంధ్రప్రదేశ్ మీదుగా వెళ్లే అవకాశం ఉండటం ఆనందంగా ఉందని రామ్మోహన్ నాయుడు అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విమానయాన రంగంలో విస్తరణ జరుగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. విమానాశ్రయాలు కేవలం కనెక్టివిటీని మాత్రమే అందించడం లేదని, ఆయా ప్రాంతాలను మినీ ఎకనామిక్ సిటీలుగా మార్చుతున్నాయని చెప్పారు. విమానాశ్రయాల రాకతో కార్గో, వ్యవసాయం, పర్యాటకం, రవాణా, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర రంగాలు కూడా అభివృద్ధి చెందుతున్నాయని వివరించారు. కుప్పం, శ్రీకాకుళం విమానాశ్రయాలకు సైట్ క్లియరెన్స్ లభించడం శుభపరిణామమని తెలిపారు. ఈ విమానయాన రంగానికి అవసరమైన మానవ వనరులను తీర్చిదిద్దే దిశగా 5,000 మంది ఏవియేషన్ ప్రొఫెషనల్స్‌ను తయారు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.

**ఏపీకి రూ.8.67 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు**

గత రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో 216 మెగా ప్రాజెక్టుల ద్వారా రూ.8.67 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయని రామ్మోహన్ నాయుడు తెలిపారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2023–24లో 92 మిలియన్ డాలర్ల నుంచి 2025–26లో 608 మిలియన్ డాలర్లకు పెరిగాయని చెప్పారు. గూగుల్, ఆర్సెలర్ మిట్టల్–నిప్పాన్ స్టీల్, ఎన్‌టీపీసీ, టాటా పవర్, రిలయన్స్ వంటి ప్రపంచస్థాయి సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో భారీ పెట్టుబడులకు ముందుకు రావడం రాష్ట్రంపై పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమన్నారు.

**విమానయాన రంగంలో కొత్త శకం**

కర్నూలులో దేశంలో తొలి డ్రోన్ సిటీ రూపుదిద్దుకుంటోందని, పుట్టపర్తిలో ఏరోస్పేస్, డిఫెన్స్ కార్యకలాపాలు విస్తరిస్తున్నాయని తెలిపారు. కర్నూలులో రాష్ట్ర తొలి ఎఫ్‌టీఓ ప్రారంభించామని, మరో ఐదు ఎఫ్‌టీఓలు పైప్‌లైన్‌లో ఉన్నాయని చెప్పారు. కుప్పంలో దేశంలో తొలి హంస ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ కేంద్రం ఏర్పాటవుతోందని వివరించారు.

**ఈ దశాబ్దం భారతదేశానిదే..**

ఎన్ని ఇబ్బందులు ఎదురైనా భారత్ 7.8 శాతం వృద్ధి రేటుతో ముందుకు సాగుతోందని రామ్మోహన్ నాయుడు అన్నారు. ఇబ్బందులను అవకాశాలుగా మార్చుకుని దేశం అద్భుతాలను సృష్టిస్తోందని తెలిపారు. ప్రపంచ పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించిన 'స్వర్ణాంధ్ర' విజన్‌లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. "ఈ దశాబ్దం భారతదేశానిది.

ఇబ్బందులను అవకాశాలుగా మార్చుకుని అద్భుతాలు సృష్టిస్తున్నాం. వేగాన్ని ఎంచుకోండి.. ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోండి" అని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. వివిధ సంస్థలతో కుదుర్చుకున్న 31 ఎంవోయూలను కేంద్ర మంత్రి సమక్షంలో మార్చుకున్నారు. స్టాల్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి వాటిని సందర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, ఎంపీలు మతుకుమిల్లి శ్రీ భరత్, కలిసెట్టి అప్పలనాయుడు, సీఐఐ అధికారులు, ఐఐఎం అధికారులు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## సీఐఐ రీజనల్ సమ్మిట్ ఎగ్జిబిషన్‌ను సందర్శించిన రామ్మోహన్ నాయుడు

విశాఖపట్నం (చైతన్య రథం): గంభీరం ఐఐఎంలో జరిగిన సీఐఐ రీజనల్ సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సందర్శించారు. రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డితో కలిసి వివిధ సంస్థల స్టాళ్లను సందర్శించి ఉత్పత్తులు, సాంకేతికతలు, ఆవిష్కరణల వివరాలను తెలుసుకున్నారు.

ఎగ్జిబిషన్‌లో ఉత్తరాంధ్రకు చెందిన వివిధ రంగాల 25 సంస్థలు తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించాయి. అరకు కాఫీ, పొందూరు ఖాదీ, మాడుగుల హల్వా, ఆంధ్ర వుడెన్ టాయ్స్ వంటి స్థానిక ఉత్పత్తులతో పాటు హైడ్రాలిక్స్, మెటలర్జీ, మ్యానుఫ్యాక్చరింగ్, హెల్త్‌కేర్, అగ్రిటెక్, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం తదితర రంగాల ఉత్పత్తులను ప్రదర్శించారు. స్థానిక ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు, పెట్టుబడులు, పరిశ్రమల మధ్య భాగస్వామ్యాలకు ఈ ఎగ్జిబిషన్ వేదికగా నిలిచింది.




## రీజినల్ కాన్ఫరెన్స్‌తో ఉత్తరాంధ్రకు ఊతం: ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

విశాఖపట్నం (చైతన్య రథం): ఉత్తరాంధ్రలో పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధికి సీఐఐ రీజినల్ కాన్ఫరెన్స్ మరింత ఊతమిస్తుందని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. గంభీరంలో జరిగిన సదస్సు అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రలో పెట్టుబడుల అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తల్లో విశ్వాసం పెంచేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయని తెలిపారు. పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు, సేవా రంగం అభివృద్ధితో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. పెట్టుబడిదారులకు అవసరమైన అనుమతులు, క్లియరెన్సులు త్వరితగతిన అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

**అభివృద్ధి అవకాశాలను వెలుగులోకి తేవడమే లక్ష్యం: పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యువరాజ్**

ప్రాంతీయ పెట్టుబడులు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, పరిశ్రమల అవకాశాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు యువతకు ఉపాధి, నైపుణ్య, పారిశ్రామిక అవకాశాలు కల్పించడమే ప్రాంతీయ సదస్సుల ఉద్దేశమని పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. యువరాజ్ తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా ఐదు ప్రాంతాల్లో సదస్సులు నిర్వహిస్తున్నామని, విశాఖ తర్వాత కాకినాడ, గుంటూరు, తిరుపతి, అనంతపురంలో నిర్వహిస్తామని చెప్పారు. ఉత్తరాంధ్ర నుంచి ఎంపిక చేసిన 25 ఎంఎస్ఎంఈల ఉత్పత్తులను ప్రదర్శించామని, వాటిలో ఐదు సంస్థలకు నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో జరిగే సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో ప్రదర్శించే అవకాశం కల్పిస్తామని తెలిపారు.

**విశాఖను తూర్పు తీర ఆర్థిక ముఖద్వారంగా అభివృద్ధి చేస్తాం: అభిషిక్త్ కిశోర్**

ఎకనామిక్ రీజియన్ ప్రాజెక్టు సహకారంతో విశాఖను తూర్పు తీరంలో ప్రధాన ఆర్థిక ముఖద్వారంగా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, విజయనగరం ఏవియేషన్ హబ్, విశాఖ బే సిటీలోని మైస్ సదుపాయం వంటి ప్రాజెక్టులు ప్రాంత ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. విశాఖలో గూగుల్, టీసీఎస్, అనకాపల్లిలో ఏఎంఎన్ఎస్, లారస్ తదితర సంస్థల పెట్టుబడులు పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిస్తున్నాయని పేర్కొన్నారు.



## 25 ఏళ్ల నిరంతర నాయకత్వం..

# మోదీ ప్రస్థానం దేశానికి స్ఫూర్తి

- గుజరాత్ సీఎం నుంచి దేశ ప్రధానిగా విశిష్ట సేవలు
- దేశ ప్రయోజనాలు, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందడుగు
- రైతు సంక్షేమం, పేదల అభ్యున్నతి, మహిళా సాధికారతకు పెద్దపీట
- ప్రధాని నరేంద్ర మోదీకి మంత్రి కింజరాపు అభినందనలు



అమరావతి (చైతన్య రథం): ప్రభుత్వ నాయకత్వంలో నిరంతరంగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. 2001 అక్టోబర్ 7న గుజరాత్ సీఎంగా బాధ్యతలు చేపట్టి, 2014 నుంచి భారత ప్రధానమంత్రిగా దేశానికి సారథ్యం వహిస్తున్న మోదీ ప్రస్థానం క్రమశిక్షణ, పట్టుదల, ప్రజాసేవపట్ల అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. గుజరాత్‌లో ప్రజల విశ్వాసాన్ని చూరగొని, జాతీయస్థాయిలో వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో విజయాన్ని సాధించడం ఆయన నాయకత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని చాటుతోందన్నారు. దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న మోదీ నాయకత్వం దేశానికి స్ఫూర్తిదాయకం. 25 ఏళ్ల ఈ ప్రస్థానం ప్రజాసేవకు అంకితమైన విశిష్ట అధ్యాయం అని మంత్రి కొనియాడారు. రైతు సంక్షేమాన్ని దేశాభివృద్ధిలో కీలక భాగంగా భావిస్తున్న మోదీ, పీఎం కిసాన్ ద్వారా రైతులకు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారని అచ్చెన్నాయుడు అన్నారు. జన్‌ధన్ ద్వారా బ్యాంకింగ్ సేవలను ప్రజలకు చేరువ చేయడం, ప్రత్యక్ష నగదు బదిలీలతో సంక్షేమ ప్రయోజనాలను లబ్ధిదారులకు అందించడం, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడం వంటి చర్యలు సామాన్యుల జీవితాల్లో మార్పుకు దోహదపడ్డాయని పేర్కొన్నారు. పేదలకు గృహాలు, తాగునీరు, ఆరోగ్య సేవలు అందించడంపై దృష్టి సారించడంతో పాటు మహిళల సాధికారత, యువతకు నైపుణ్యాలు, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. మౌలిక వసతుల అభివృద్ధి, స్వదేశీ ఉత్పత్తులకు ప్రోత్సాహం, శాస్త్ర సాంకేతిక రంగాల పురోగతితో స్వావలంబన దిశగా దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. అంతర్జాతీయ వేదికలపై భారతదేశ ప్రతిష్ఠను పెంచడంలో మోదీ నాయకత్వం కీలక పాత్ర పోషించిందని మంత్రి అన్నారు. 2047నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలనే 'వికసిత్ భారత్' సంకల్పం భావితరాలకు మెరుగైన భవిష్యత్తును అందించే దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ తనవంతు భాగస్వామ్యాన్ని అందించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రైతుల అభ్యున్నతి, ఉపాధి అవకాశాల విస్తరణ, సమగ్రాభివృద్ధికి కృషి చేయాలన్నారు. మోదీ సంపూర్ణ ఆరోగ్యంతో మరెన్నో ఏళ్లు దేశానికి సేవలందించాలని ఆకాంక్షిస్తున్నట్టు వెల్లడించారు. 25 ఏళ్ల నిరంతర నాయకత్వాన్ని పూర్తి చేసుకున్న ఈ సందర్భంగా నరేంద్ర మోదీకి మంత్రి అచ్చెన్న హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# సౌర విద్యుత్‌తో బిల్లుల భారం తగ్గుతుంది

- పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్‌చంద్



విజయవాడ (చైతన్య రథం): ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా లభించే ప్రయోజనాలను అర్హులైన గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ సూచించారు. సౌర విద్యుత్ వినియోగంతో విద్యుత్ బిల్లుల భారం తగ్గడంతోపాటు స్వచ్ఛమైన ఇంధనాన్ని ప్రోత్సహించవచ్చని, పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన అమలులో భాగంగా ఏపీసీపీడీసీఎల్ పరిధిలోని గుణదలలో నిర్వహించిన ప్రత్యేక 'సేవా సేతు అభియాన్' శిబిరాన్ని జేఎండీ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ సందర్శించారు. శిబిరానికి చేరుకున్న ఆయనకు ఏపీసీపీడీసీఎల్ అధికారులు ఏర్పాట్లు, వినియోగదారులకు అందిస్తున్న సేవలను వివరించారు. రిజిస్ట్రేషన్, అవగాహన, దరఖాస్తుల స్వీకరణ, రూఫ్‌టాప్ సోలార్ సాంకేతిక సహాయం, బ్యాంకింగ్ సేవల కోసం ఏర్పాటు చేసిన వివిధ కౌంటర్లను జేఎండీ పరిశీలించారు.

శిబిరానికి వచ్చిన వినియోగదారులతో జేఎండీ నేరుగా మాట్లాడారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై వారికి ఉన్న అవగాహన, రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటుకు సంబంధించి సందేహాలు, దరఖాస్తు ప్రక్రియపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు అధికారులు అందిస్తున్న సమాచారం, దరఖాస్తు విధానం, సబ్సిడీ ప్రయోజనాలు, రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు అనుసరించాల్సిన ప్రక్రియపై అధికారులను వివరాలు అడిగారు.

రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటులోని వివిధ దశలను వినియోగదారులకు ఏ విధంగా వివరిస్తున్నారో కూడా జేఎండీ సమీక్షించారు. దరఖాస్తు చేసుకునే దశ నుంచి సబ్సిడీ పొందే వరకు వినియోగదారులకు అందిస్తున్న సహాయాన్ని పరిశీలించారు. బ్యాంకులు, సౌర విద్యుత్ సంస్థల ప్రతినిధులతోనూ మాట్లాడి వినియోగదారులకు అందిస్తున్న సహకారం గురించి తెలుసుకున్నారు.

అర్హులైన గృహ వినియోగదారులు ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజనను సద్వినియోగం చేసుకుని తమ ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని జేఎండీ సూచించారు. పథకం ద్వారా లభించే ప్రయోజనాలు, సబ్సిడీ తదితర అంశాలపై పూర్తి సమాచారాన్ని తెలుసుకుని దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

డిస్కమ్ పరిధిలోని సబ్ డివిజన్, జిల్లాస్థాయిల్లో అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో నిర్వహిస్తున్న 'సేవా సేతు అభియాన్' శిబిరాలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హత ఉన్న వినియోగదారులు శిబిరాలను సందర్శించి పథకానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకుని రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిబిరం నిర్వహణ, ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ప్రజల్లో కల్పిస్తున్న అవగాహన, వినియోగదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ, దరఖాస్తు దశనుంచి రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటు వరకు వినియోగదారులకు అందిస్తున్న సహాయంపై ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ హెచ్‌ఆర్) టీవీఎస్ఎన్ మూర్తి జేఎండీకి వివరించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ హనుమయ్య, గుణదల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విశ్వేశ్వర ప్రసాద్, ఏపీసీపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది, సౌర విద్యుత్ సంస్థల ప్రతినిధులు, బ్యాంకర్లు, వినియోగదారులు పాల్గొన్నారు.

# హజ్ సేవా సహాయకులు సేవా దృక్పథంతో పనిచేయాలి



మంగళగిరి (చైతన్య రథం): హజ్ యాత్రికులకు సేవలందించే సహాయకులు అధికారులుగా కాకుండా సేవకులుగా భావించి బాధ్యతలు నిర్వర్తించాలని మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సీహెచ్ శ్రీధర్ సూచించారు. యాత్రికులకు అండగా నిలిచి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. హజ్-2027కు సంబంధించి ఏపీ నుంచి వివిధ ప్రభుత్వ విభాగాల నుంచి తాత్కాలికంగా ఎంపికైన 78 మంది సేవా సహాయకులు (స్టేట్ హజ్ ఇన్‌స్పెక్టర్లు)కు మంగళగిరి వడ్డేశ్వరంలోని సీఈడీఎం కార్యాలయంలో బుధవారం ముఖాముఖి పరీక్షలు నిర్వహించారు. మార్కుల ఆధారంగా కేంద్ర హజ్ కమిటీ 19మందిని ఎంపిక చేయనుంది. రాష్ట్ర హజ్ కమిటీ అధ్యక్షుడు హాజీ షేక్ హసన్ భాష, ఈవో అబ్దుల్ ఖాదర్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరిగింది. వక్ఫ్ బోర్డు సీఈవో యాకూబ్ భాష పాల్గొన్నారు. విజయవాడను అధికారిక హజ్ ఎంబార్కేషన్ పాయింట్‌గా కేంద్రం ఆమోదించిందని, అక్కడి నుంచి హజ్‌కు వెళ్లే ప్రతి యాత్రికుడికి రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తోందని అధికారులు తెలిపారు. హజ్ హౌస్ నిర్మాణాన్ని త్వరలో చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హజ్ కమిటీ సభ్యులు బాబా ఫక్రుద్దీన్, మన్సూర్ అలీఖాన్, షేక్ హుస్సేన్, షేక్ ఆబిద్ తదితరులు పాల్గొన్నారు.

# 9న జనాభా లెక్కలపై రాష్ట్రస్థాయి సమావేశం

అమరావతి (చైతన్య రథం): జనాభా లెక్కల సేకరణ-2027లో భాగంగా రెండోవిడత పాపులేషన్ ఎన్యూమరేషన్ ప్రక్రియపై ఈ నెల 9న రాష్ట్ర సచివాలయంలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (జీపీఎం అండ్ ఏఆర్) ఎస్ఎస్ రావత్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయంలోని ఐదో భవనంలో సమావేశం జరగనుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్ అధ్యక్షతన జరిగే సమావేశంలో రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్, సంబంధిత శాఖల కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు, జేసీ/డీఆర్వో స్థాయి అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, అదనపు/డిప్యూటీ కమిషనర్లు, సెన్సస్ డైరెక్టరేట్ అధికారులు పాల్గొంటారని రావత్ తెలిపారు. రెండో విడత పాపులేషన్ ఎన్యూమరేషన్‌కు సంబంధించిన సన్నాహక చర్యలు, ఇతర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్టు ఆయన వెల్లడించారు.

# ప్రధాని మోదీ పేరిట ఇంద్రకీలాద్రిలో ఖడ్గమాల అర్చన

**- రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేష్ వెల్లడి**

విజయవాడ (చైతన్య రథం): ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా ప్రస్థానం 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిలోని శ్రీ కనకదుర్గమ్మ దేవాలయంలో ఎంపీ లింగమనేని రమేశ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దుర్గమ్మ ఆశీస్సులతో ప్రధాని మోదీకి ఆయురారోగ్యాలతోపాటు దేశాన్ని వికసిత్ భారత్‌వైపు నడిపించడానికి అవసరమైన శక్తి సామర్థ్యాలు లభించాలని కోరుతూ విశిష్టమైన ఖడ్గమాల అర్చన చేయించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్టు ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు రమేష్ వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో విశ్వగురుగా రూపొందుతున్న భారత దేశానికి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, ఆయన పాలనలో దేశం అన్ని రంగాల్లో వేగవంతంగా పురోగతి సాగిస్తోందన్నారు. మహిళలు, రైతులు, యువకులు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలకు మోదీ పాలనలో తగిన ప్రాధాన్యత లభిస్తుండడంతో.. సకల జనులు సంతృప్తిగా ఉన్నారన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు మోదీ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనివిధంగా అధిక ప్రాధాన్యత ఇస్తుందని రమేష్ వెల్లడించారు. అలాగే, ఏపీపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుండడంతో రాష్ట్ర ప్రజల కలలైన రాజధాని అమరావతి, పోలవరం పనులు నిరాటంకంగా వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. సకల సదుపాయలతో ప్రత్యేకంగా నిలిచిన



భోగాపురం విమనాశ్రయం ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడం మోదీకి రాష్ట్రంపై ఉన్న ప్రత్యేక ప్రేమకు నిదర్శనమని రమేష్ వ్యాఖ్యానించారు. ప్రత్యేక పూజల సందర్భంగా ఖడ్గమాల అర్చన ప్రసాదం, అమ్మవారి చిత్రపటం, అమ్మవారి శేషవస్త్రాలు పీఎంవోకు పంపుతున్నట్టు లింగమనేని తెలిపారు. బుధవారం తెల్లవారుజామున నిర్వహించిన కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్, జనసేన నేతలు అమ్మిశెట్టి వాసు, ఠాకూర్ అజయ్ వర్మ, ఆలయ పాలక మండలి సభ్యులు ఎం రామబ్రహ్మం, పద్మావతి ఠాకూర్ పాల్గొన్నారు.

చైతన్యరథం

# గోదావరి డెల్టా ఆధునీకరణకు సమగ్ర కార్యాచరణ

- **శాశ్వత ముంపు సమస్య పరిష్కారానికి లైడార్ సర్వేతో డీపీఆర్**
- **కాలువలు, డ్రెయిన్లు, బండ్‌లు, లాకులు, సీ మౌత్‌ల ఆధునీకరణకు ప్రాధాన్యత**
- **జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి**



విజయవాడ (చైతన్య రథం): గోదావరి డెల్టాలో శాశ్వత ముంపు సమస్యకు పరిష్కారం చూపే విధంగా సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఇందుకోసం రూ.13.4 కోట్ల వ్యయంతో నిర్వహించిన లైడార్ సర్వే ఆధారంగా డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. బుధవారం విజయవాడలోని ఇరిగేషన్ క్యాంపు కార్యాలయంలో గోదావరి డెల్టా ఆధునీకరణపై ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, గోదావరి డెల్టా చీఫ్ ఇంజనీర్, సూపరింటెండింగ్ ఇంజనీర్, ఐఐఎస్‌సి టెక్నాలజీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గోదావరి డెల్టా ఆధునీకరణలో భాగంగా ఇప్పటికే ఈస్టర్న్ డెల్టాకు రూ.1,137 కోట్లు, సెంట్రల్ డెల్టాకు రూ.1,268 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు మంత్రి నిమ్మల తెలిపారు. వెస్టర్న్ డెల్టాకు సంబంధించిన అంచనాలను కూడా త్వరితగతిన సిద్ధం చేసి అందించాలని సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులను మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు.

డెల్టా ఆధునీకరణలో కాలువలు, డ్రెయిన్లు, బండ్‌ల స్థాయి, డీసిల్టింగ్, లాకులు, షట్టర్లు తదితర అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. పూడికతో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారిన సీ మౌత్‌ల వద్ద డ్రెడ్జింగ్ పనులకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

గోదావరి దిగువ ప్రాంతాల్లోని ముమ్మిడివరం, అమలాపురం, రాజోలు, నరసాపురం, భీమవరం తదితర ప్రాంతాల్లో, సముద్రంలో కలిసే డ్రెయిన్లలో పేరుకుపోయిన పూడికను తొలగించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి నిమ్మల తెలిపారు.

బ్రిటిష్ కాలంలో నిర్మించిన పాత లాకులు, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో వాటి మరమ్మతులు చేపట్టడం లేదా అవసరమైన చోట కొత్త నిర్మాణాలు చేపట్టడంపై సమగ్రంగా పరిశీలించాలని మంత్రి నిమ్మల అధికారులను ఆదేశించారు.

లైడార్ సర్వే నిర్వహించిన ఐఐఎస్‌సి టెక్నాలజీస్ ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు, డీపీఆర్‌లు సిద్ధం చేసే సమయంలో స్థానిక సాగునీటి సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధుల అనుభవాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి నిమ్మల సూచించారు. స్థానికంగా ఉన్న సమస్యలు, నీటి ప్రవాహ మార్గాలు, ముంపు ప్రాంతాలు, డ్రెయిన్ల పరిస్థితిపై సాగునీటి సంఘాలు, ప్రజాప్రతినిధులకు ఉన్న అనుభవాన్ని సాంకేతిక సమాచారంతో సమన్వయం చేసి సమగ్ర డీపీఆర్‌లు రూపొందించాలని మంత్రి తెలిపారు.

డీపీఆర్‌లు పూర్తయిన అనంతరం వాటిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. గోదావరి డెల్టా ఆధునీకరణ ద్వారా ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, సాగునీటి పారుదల వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు.

# రాష్ట్రాన్ని పచ్చదనంతో సస్యశ్యామలం చేద్దాం

- **హరిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కడియం నర్సరీ రైతుల భాగస్వామ్యం ఎంతో కీలకం**
- **రాష్ట్రాన్ని హరిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే సీఎం, డిప్యూటీ సీఎం ధ్యేయం**
- **నర్సరీ రైతులకు స్థిరమైన మార్కెట్ అవకాశాలు కల్పిస్తాం**
- **పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం పెంపు మరింత కీలకం**
- **కడియంలోని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ రైతుల సమావేశంలో ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబు**



కడియం (చైతన్య రథం): రాష్ట్రాన్ని గ్రీన్ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టితో కృషి చేస్తున్నారని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించాలనే లక్ష్యాన్ని చేరుకోవాలంటే కడియం నర్సరీ రైతులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి రైతు భాగస్వామ్యం, సహకారం ఎంతో అవసరమన్నారు. తూర్పుగోదావరి జిల్లా కడియపులంకలో బుధవారం సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపట్టనున్న భారీ స్థాయి మొక్కల పెంపకం, సేకరణ కార్యక్రమాలపై నర్సరీ రైతులతో చర్చించారు.

ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ.. “2026-27 ఆర్థిక సంవత్సరంలో సుమారు 10 కోట్ల మొక్కలను నర్సరీల్లో సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 500 నుంచి 1,000 నర్సరీల వరకు అవసరమవుతాయి. ప్రభుత్వం కొన్ని నర్సరీలను ఏర్పాటు చేస్తున్నప్పటికీ, ఇంత భారీ స్థాయిలో మొక్కలను అందుబాటులోకి తీసుకురావాలంటే కడియంతో పాటు రాష్ట్రంలోని నర్సరీ రైతులందరి భాగస్వామ్యం అత్యంత కీలకం. రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం పెంపునకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుంది. పట్టణాలు, రహదారులు, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలతోపాటు ప్రభుత్వ శాఖల పరిధిలోని ఖాళీ స్థలాలను గుర్తించి విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలను చేపడుతున్నాం. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ భూములు, పట్టణాల్లోని ఓపెన్ స్పేస్‌లను సైతం హరిత ప్రాంతాలుగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం” అన్నారు.

**రైతులకు నష్టం లేకుండా మొక్కల కొనుగోలు**

భారీస్థాయిలో మొక్కల సేకరణలో భాగంగా నర్సరీ రైతులకు కూడా మేలు జరిగేలా చర్యలు తీసుకుంటాం. అధిక ధరలు విధించకుండా, అదే సమయంలో నర్సరీ రైతులకు నష్టం కలగకుండా మొక్కలను అందించేందుకు సహకరించాలి. ప్రభుత్వం చేపట్టే హరిత కార్యక్రమాల్లో నర్సరీ రైతులను భాగస్వాములను చేయడం ద్వారా వారికి స్థిరమైన మార్కెట్ అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు.

**పచ్చదనంతో సస్యశ్యామలం చేయడమే లక్ష్యం**

“ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గుతున్న పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం పెంపు మరింత కీలకమైంది. ఏపీ గ్రీన్ నిర్దేశించిన లక్ష్యాలను సమష్టి కృషితో సాధించగలిగితే ఆంధ్రప్రదేశ్‌ను పచ్చదనంతో సస్యశ్యామలమైన రాష్ట్రంగా తీర్చిదిద్దవచ్చన్నారు. అనంతరం కడియం నర్సరీ రైతులు మాట్లాడుతూ.. రాష్ట్ర హరిత కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తాం” అని తెలిపారు.

**మహా పుష్కర నగరవనాన్ని సందర్శించిన నాగబాబు**

కడియపులంక పర్యటనకు ముందు నాగబాబు రాజమహేంద్రవరంలోని గోదావరి మహాపుష్కర నగరవనాన్ని సందర్శించారు. నగరవనంలో కలియ తిరిగి అక్కడి పచ్చదనం, మొక్కల పెంపకం, వన సంరక్షణ చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా నగరవనంలో రుద్రాక్ష మొక్కలతోపాటు అత్యంత అరుదైన అండమాన్ పడాక్ మొక్కలను స్వయంగా నాటారు.

**పలు నర్సరీలను పరిశీలించిన నాగబాబు**

కడియపులంకలోని శ్రీ సత్యదేవ నర్సరీతోపాటు పలు నర్సరీలను నాగబాబు పరిశీలించారు. నర్సరీల్లో అందుబాటులో ఉన్న వివిధ రకాల మొక్కలు, వాటి నాణ్యత, ధరలను తెలుసుకున్నారు. నర్సరీల నిర్వాహకులతో మాట్లాడి మొక్కల ఉత్పత్తి, సరఫరా, డిమాండ్, ధరలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల కోరిక మేరకు అరుదైన బ్లాక్ వేప మొక్కను నాటారు. అనంతరం ఒకటి నుంచి మూడు సంవత్సరాల వయసు కలిగిన స్థానిక మొక్కలను పరిశీలించి, వాటి పెరుగుదల, నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే మలేషియా గ్రీన్ కొబ్బరి బొండాన్ని రుచి చూశారు. బనానా మ్యాంగో వివరాలు అడిగి తెలుసుకున్నారు. నర్సరీల్లో పనిచేస్తున్న మహిళా సిబ్బందితో నాగబాబు కాసేపు ముచ్చటించి, వారి పని, ఉపాధి అవకాశాల గురించి తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి ఫోటో దిగారు. కార్యక్రమంలో ఏపీ గ్రీన్ కమిషనర్, సీఈవో బీఎన్ఎన్ మూర్తి, తూర్పుగోదావరి జిల్లా డీఎఫ్ఓ ప్రభాకరరావు, రీసెర్చ్ డీఎఫ్ఓ శ్రీనివాస్, ఎఫ్ఆర్ఓ దావీద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# పీఎంపీలు, ఆర్ఎంపీలు వ్యవస్థను బలోపేతం చేయాలి: టీడీ జనార్ధన్




న్యూఢిల్లీ (చైతన్య రథం): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో పీఎంపీలు, ఆర్ఎంపీలు కీలక పాత్ర పోషిస్తున్నారని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు, పీఎంపీ-ఆర్ఎంపీ జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవాధ్యక్షుడు టీడీ జనార్దన్ అన్నారు. గ్రామాల్లో ఎవరికైనా చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చినా, అత్యవసర పరిస్థితి ఎదురైనా తొలుత స్పందించి అందుబాటులో ఉండేది పీఎంపీలు, ఆర్ఎంపీలేనని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా బేసిక్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పీఎంపీ-ఆర్ఎంపీల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి టీడీ జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా పనిచేస్తున్న పీఎంపీలు, ఆర్ఎంపీల పూర్తి వివరాలను సేకరించాల్సిన అవసరం ఉందన్నారు. వారి సంఖ్య, సేవల పరిధి, అనుభవం, వైద్య నైపుణ్యాలను పరిగణనలోకి తీసుకుని వర్గీకరించాలని సూచించారు. తద్వారా వారి సామర్థ్యాలకు అనుగుణంగా మరింత మెరుగైన శిక్షణ అందించి, గ్రామీణ ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవచ్చున్నారు.

పీఎంపీలు, ఆర్ఎంపీల వైద్య నైపుణ్యాలను పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని టీడీ జనార్దన్ కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలకు సంబంధించి వీరి పాత్రను గుర్తించి, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థీకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. దీనివల్ల మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంశంపై ఇప్పటికే కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాను కలిసి వివరించినట్టు టీడీ జనార్దన్ తెలిపారు. పీఎంపీలు, ఆర్ఎంపీల సమస్యలు, వారి సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకునే అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై సానుకూలంగా ఉందని తెలిపారు. ఇదే దిశగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించడంలో పీఎంపీలు, ఆర్ఎంపీలు పోషిస్తున్న పాత్రను దృష్టిలో ఉంచుకుని, వారి సేవలను ఒక వ్యవస్థలోకి తీసుకురావడంతో పాటు అవసరమైన శిక్షణ, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

# ఎఫ్‌పీవోల ఆధ్వర్యంలో 19 యూనిట్ల ఏర్పాటు

- మునగ ప్రాసెసింగ్‌తో రైతులకు మెరుగైన ఆదాయం
- యర్రావారిపాలెం, వీరబల్లి యూనిట్లు విజయవంతంపై హర్షం
- మునగ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం: మంత్రి కొండపల్లి

అమరావతి (చైతన్య రథం): రైతుల ఆదాయాన్ని పెంపొందించడం, రైతు ఉత్పత్తిదారుల సంస్థలను వ్యాపారపరంగా బలోపేతం చేయడం, గ్రామీణ మహిళలకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ ద్వారా మునగ విలువ ఆధారిత ప్రాసెసింగ్ కార్యక్రమాన్ని చేపడుతున్నాయని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు కేవలం మునగ ఆకుల విక్రయానికే పరిమితం కాకుండా ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ ప్రక్రియల్లోనూ భాగస్వాములు అయ్యేలా రాష్ట్రవ్యాప్తంగా 19 యూనిట్ల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వైఎస్సార్ కడప జిల్లా వీరబల్లి, తిరుపతి జిల్లా యర్రావారిపాలెంలో విజయవంతమైన మునగ ప్రాసెసింగ్ యూనిట్‌లను



ఆదర్శంగా తీసుకుని ఈ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు.

స్థానిక వాతావరణం, సాగు విస్తీర్ణం, రైతుల ఆసక్తి, ముడిసరుకు లభ్యత మరియు రైతు ఉత్పత్తిదారుల సంస్థల సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని యూనిట్లను ఎంపిక చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. తమిళనాడులోని పేరియకుళం హార్టికల్చర్ కళాశాల మరియు పరిశోధనా సంస్థ నుంచి అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన విత్తనాలను సేకరించి రైతులకు అందించడంతో పాటు, ప్రాసెసింగ్, నాణ్యత నియంత్రణ, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అధ్యయన పర్యటనలు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల తిరుపతి జిల్లా ఎర్రావారిపాలెం మండలంలో జీవనోపాధుల నిధుల సాయంతో ఏర్పాటు చేసిన ప్లాంట్ నుంచి రోజుకు 250 కేజీల మునగపొడి తయారు చేస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు.

రైతు స్థాయిలో ఒక కేజీ మునగాకు ఉత్పత్తికి రు.10 ఖర్చు చేస్తుంటే... రైతుల నుంచి ఎఫ్‌పీవోలు రు.15కు కొనుగోలు చేస్తుండడంతో రైతులకు ప్రతి కేజీపై రు.5 లాభం చేకూరుతుందని మంత్రి తెలిపారు. యర్రావారిపాలెంలో రూ.86.80 లక్షలతో ఏర్పాటు చేసిన యూనిట్ ద్వారా 300 ఎకరాల నుంచి మునగాకు సేకరణ జరుగుతోందన్నారు. అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం ఉపాధి హామీ పథకం కింద ఎకరాకు రూ.1.30 లక్షల వరకు అభివృద్ధి సహాయం అందుతుందని.. రైతులకు ఈ మునగ సాగు ద్వారా నెలకు రు.5 నుంచి 10 వేల మధ్యలో నికర ఆదాయం లభిస్తుందని మంత్రి తెలిపారు. దేశీయ, అంతర్జాతీయంగా మునగ పొడిని పోషకాహార ఉత్పత్తులు, హెల్త్ డ్రింక్స్, హెర్బల్ టీలు, న్యూట్రాస్యూటికల్స్, ఆయుర్వేద ఉత్పత్తులలో విస్తృతంగా ఉపయోగిస్తున్నారని... సరైన ప్యాకేజీలతో ఈ కామర్స్ వేదికల ద్వారా వీటిని విక్రయించేందుకు సమగ్ర మార్కెటింగ్ వ్యూహాన్ని అమలు చేస్తున్నట్టు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

# పబ్లిక్ లిటిగేషన్ పాలసీపై మంత్రి వర్గ ఉపసంఘం భేటీ

- త్వరలో పాలసీ ముసాయిదా రూపకల్పన
- న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం (ఏపీ స్టేట్ పబ్లిక్ లిటిగేషన్ పాలసీ) విధివిధానాల ఖరారు కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం బుధవారం భేటీ అయింది. వెలగపూడి సచివాలయంలో న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యక్షంగా, హోంమంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్, వైద్య ఆరోగ్య మంత్రి సతీష్ కుమార్ యాదవ్‌లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. మంత్రివర్గ ఉప సంఘం న్యాయశాఖ ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించారు. లిటిగేషన్ పాలసీపై గతంలో నిర్వహించిన మంత్రివర్గ ఉప సంఘం సమావేశాలలో సమీక్షించి, చేసిన సూచనల మేరకు న్యాయశాఖకు చెందిన అధికారులు ఇతర రాష్ట్రాల్లో అమలుకు సంబంధించిన విధానాలను ఉపసంఘం



దృష్టికి తీసుకువెళ్లారు. పబ్లిక్ లిటిగేషన్ పాలసీ అమల్లో ఉన్న ఇతర రాష్ట్రాలలో పర్యటించి అక్కడ అమలవుతున్న పాలసీకి సంబంధించిన పూర్తి వివరాలను మంత్రులకు న్యాయశాఖ సెక్రటరీ ప్రతిభా దేవి వివరించారు. ఈ సందర్భంగా న్యాయశాఖ మంత్రి ఫరూక్ మాట్లాడుతూ న్యాయశాఖలో అనవసర వ్యాజ్యాలను తగ్గించడం, సకాలంలో ప్రభావవంతమైన వివాద పరిష్కారాన్ని నిర్ధారించడం, ప్రత్యమ్నాయ వివాద పరిష్కార ఫోరంలు ఏర్పాటు చేయడం, పారదర్శకత, జవాబుదారీతనానికి అనుగుణంగా "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం"ను త్వరలోనే రూపొందిస్తామని వెల్లడించారు. న్యాయశాఖను మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళిక బద్ధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతుందని మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ కోర్ట్ కేసుల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించడమే కాకుండా, అమలుకు ప్రత్యేకంగా పర్యవేక్షణ కమిటీలు, నోడల్ అధికారులు, ఆన్ లైన్ పోర్టల్ ఏర్పాటుకు సంబంధించి దృష్టి సారించాలని న్యాయ శాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో న్యాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల ఇంటికే కార్పొరేట్ వైద్యం వస్తుంటే

# వైసీపీకి ఎందుకంత కడుపుమంట?

- సంజీవని దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందుతుంది..
- సాక్షి మాత్రం నిస్సిగ్గుగా అసత్యాలు రాస్తోంది
- సంజీవని ప్రయోజనాలపై వైసీపీ నేతలు తెలుసుకొని మాట్లాడాలి: రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్



మంగళగిరి (చైతన్య రథం): దేశానికి ఆదర్శంగా నిలుస్తోన్న సంజీవని కార్యక్రమంపై గొడ్డలి పార్టీ నేతలు, సాక్షి పత్రిక పగలు, రాత్రి అని తేడా లేకుండా విషం కక్కుతుందని ఏపీ ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ మండిపడ్డారు. పేదలకు అందుతున్న కార్పొరేట్ వైద్యాన్ని చూసి తట్టుకోలేక ఇలాంటి విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సంజీవని కార్యక్రమంతో ప్రతి ఇంటికి టెలిమెడిసిన్ సేవలు, సుమారు 45 రకాల వైద్య పరీక్షలు చేసి వాటిని డిజిటల్ రికార్డు చేస్తున్నట్లు వివరించారు. పక్కా నిబంధనలతో పారదర్శకంగానే టెండర్ల ప్రక్రియ జరిపి రూ.415 కోట్లతో టాటా సంస్థకు ఇస్తే వైసీపీ నేతలు దీనిపై విమర్శలు చేయడం సరికాదని హెచ్చరించారు. పేదల వైద్యానికి భరోసా, బాసటగా నిలిచే ఇలాంటి కార్యక్రమంపై వైసీపీ నేతలు, సాక్షి పత్రిక అసత్యాలను ప్రచారం చేయడం వాళ్ల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని దుయ్యబట్టారు. పేదల ఆరోగ్యంపై జగన్మోహన్ రెడ్డికి ఉన్న బాధ్యతారాహిత ప్రవర్తనకు ఉదాహరణగా అభివర్ణించారు.

**సంజీవని కార్యక్రమంతో ప్రయోజనాలెన్నో**

"ప్రభుత్వం చేస్తోన్న ప్రతి మంచి పనిని వైసీపీ నాయకులు విమర్శించడమే పరమావధిగా పెట్టుకున్నారు. కర్ణాటక, తెలంగాణలో తీసుకొచ్చిన ఫ్రీ బస్సు పథకం మన రాష్ట్రంలో తీసుకొస్తే దానిపై విమర్శలు చేశారు. నేడు వంద కోట్ల ప్రయాణాలతో రికార్డు సాధించాం. మన అక్క చెల్లెమ్మలకు ఆర్థిక చేయూతతో పాటు ప్రయాణ భద్రత కల్పించాం. ఇప్పుడు సంజీవని కార్యక్రమం గురించి విమర్శలు చేస్తున్నారు. పేద ప్రజలకు సంజీవని ఒక వరంగా మారుతుంది. ఇంటి వద్దకే మొబైల్ వ్యాన్ వచ్చి 45 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రజల వైద్య రికార్డులను డిజిటలైజ్ చేసి భద్రపరుస్తున్నాం. నిబంధనలకు లోబడి ప్రైవేట్ సంస్థకు సంజీవని కార్యక్రమం, టెలిమెడిసిన్ సేవలు అప్పగిస్తే వాటిపై విమర్శలు చేస్తున్నారు. అసలు పేదల ఆరోగ్యంపట్ల వైసీపీ నేతలకు, ఆ పార్టీ అధ్యక్షుడైన జగన్మోహన్ రెడ్డికి ఎందుకంత కక్ష. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం వద్దా? సంజీవని కార్యక్రమంతో ఏ ప్రాంతంలో ఎలాంటి వ్యాధులు వస్తున్నాయి. రోగికి సకాలంలో వైద్యం, అనవసర ఖర్చులు తీరుతాయి" ఇలాంటి మంచి కార్యక్రమంపై వైసీపీ బురద జల్లడం తగదని సూచించారు.

**జగన్ హయాంలో ఆరోగ్య రంగం భ్రష్టుపట్టింది**

"వైఎస్సార్సీపీ ఐదేళ్ల అరాచక పాలనలో వెంటిలేటర్‌పైకి వెళ్లిన రాష్ట్ర ఆరోగ్య రంగానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలోనే నూతన జీవం పోసింది. జగన్‌రెడ్డి హయాంలో బకాయిలు పెట్టి ఆస్పత్రుల సేవలను నిలిపివేస్తే, చంద్రబాబు నాయుడి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రూ.2,700 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలను వెంటనే క్లియర్ చేసింది. గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ కోసం నెలకు కేవలం రూ.193 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే, నేడు పేదల వైద్యం కోసం నెలకు ఏకంగా రూ.400 కోట్ల వరకు ఖర్చు చేస్తూ ఈ రెండేళ్లలోనే రూ.7,000 కోట్లు వెచ్చించాం. పేదల ఆరోగ్య భద్రతే ధ్యేయంగా 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో వైద్య ఆరోగ్య రంగానికి భారీగా రూ.19,306 కోట్లు కేటాయించాం. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి వైద్య భరోసా కల్పిస్తూ 'యూనివర్సల్ హెల్త్ పాలసీ'ని అమల్లోకి తెచ్చాం. గర్భిణీలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేకంగా టెలీ కన్సల్టేషన్ సేవలు అందుబాటులోకి తెచ్చాం. 14 ఏళ్ళు నిండిన బాలికలకు గర్భాశయ క్యాన్సర్ రాకుండా 98 శాతం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ పూర్తి చేసిన ఘనత మా ప్రభుత్వానిదే. గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలు తప్పించేందుకు ఆధునిక కంటైనర్ ఆస్పత్రులను ఏర్పాటు చేశాం. జగన్ ఐదేళ్ల పాలనలో సీఎంఆర్ఎఫ్ ద్వారా ఇచ్చిన నిధులు కేవలం రూ.897 కోట్లు అయితే, కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్లలోనే రూ.1,300 కోట్లు అందించి పేదలను ఆదుకుంది" అని రాకేష్ స్పష్టం చేశారు. నిధుల సమీకరణలోనూ, నిరుపేదల ప్రాణాలు కాపాడటంలోనూ కూటమి ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తుంటే, ఉనికి కోసం వైఎస్సార్సీపీ నేతలు విషప్రచారం చేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు.

# నాలుగు నెలల్లోనే నియామక ఉత్తర్వులు

- కారుణ్య నియామకాల్లో విద్యుత్ శాఖ టాప్ స్పీడ్
- కూటమి ప్రభుత్వం వచ్చాక 627 మందికి ఉత్తర్వులు
- నేడు సచివాలయంలో జెన్‌కో నుంచి 27మందికి ఉత్తర్వులు అందజేత
- చంద్రబాబు నాయకత్వంలో విద్యుత్ సంస్థల్లో మౌలిక వసతుల బలోపేతం
- విద్యుత్ చార్జీలు ఒక్క రూపాయి కూడా పెంచని కూటమి ప్రభుత్వం
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి వెల్లడి



అమరావతి (చైతన్య రథం): విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. కారుణ్య నియామకాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసే పరిస్థితికి స్వస్తి పలికి, అర్హత ఉన్న కుటుంబ సభ్యులకు నాలుగు నెలల్లోనే నియామక ఉత్తర్వులు ఇస్తున్నామని చెప్పారు. సచివాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ జెన్‌కోలో పనిచేస్తూ మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు చెందిన 27 మంది అర్హులకు మంత్రి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ జెన్‌కో ఎండీ నాగలక్ష్మి, ఐఏఎస్ పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 627 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశామని మంత్రి తెలిపారు. ఉద్యోగులను కోల్పోయిన కుటుంబాలకు ఉపాధి భరోసా కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. విద్యుత్ శాఖలో మానవ వనరుల కొరతను అధిగమించేందుకు సుమారు 7 వేల మంది ఎనర్జీ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చి వారి సేవలను వినియోగించుకోనున్నట్లు చెప్పారు. సిబ్బంది కొరతను అధిగమించేందుకు 629 ఏఈ పోస్టులను భర్తీ చేస్తున్నామని, నియామక ప్రక్రియను అడ్డుకునేందుకు కోర్టుల్లో కేసులు వేసినా ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొంటోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్క రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచలేదని గొట్టిపాటి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో విద్యుత్ సంస్థలను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. విద్యుత్ శాఖను మరింత బలోపేతం చేసే దిశగా సాహసోపేత నిర్ణయాలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా లోవోల్టేజ్ సమస్యను నివారించడంతో పాటు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేసేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 132, 220, 400 కేవీ సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నామని తెలిపారు. డిస్కంల పరిధిలోనూ 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్) ఏర్పాటు చేస్తున్నామన్నారు. గృహ, వ్యవసాయ, ఆక్వా, పారిశ్రామిక, వాణిజ్య అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో విద్యుత్ కొనుగోలు చేసి డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. రాత్రి పీక్ అవర్స్‌లోనూ రాష్ట్రంలో నిరంతరాయ విద్యుత్ అందిస్తున్నామని అన్నారు.

పునరుత్పాదక విద్యుత్‌కు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా 6 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.2 లక్షల వరకు రాయితీ లభించే సూర్యఘర్ కనెక్షన్లను ఏర్పాటు చేశామని, దేశవ్యాప్తంగా ఈ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానానికి చేరిందన్నారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్ పనులను వేగవంతం చేశామని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు బొగ్గు నిల్వలు పెంచడంతో పాటు విద్యుత్ ప్లాంట్లలో మరమ్మతులు చేపట్టి ఉత్పత్తి పెంచామని చెప్పారు. కొత్తగా ఉద్యోగాల్లో చేరే సిబ్బంది పూర్తిస్థాయి శిక్షణ పొందిన తర్వాత విధుల్లో అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. విద్యుత్ రంగంలో భద్రత, బాధ్యత అత్యంత కీలకమన్నారు. ప్రజల సంతృప్తి మరింత పెరిగేలా, సంస్థకు మంచి పేరు వచ్చే విధంగా ఉద్యోగులు విధులు నిర్వహించాలని కోరారు. విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ రాష్ట్ర విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

## కడప ఉర్సు ఉత్సవాలకు మంత్రి ఫరూక్‌కు ఆహ్వానం



అమరావతి (చైతన్య రథం): కడప అమీన్ పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలకు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను దర్గా ప్రతినిధులు ఆహ్వానించారు. బుధవారం వెలగపూడి సచివాలయంలోని మూడో బ్లాక్‌లో ఉన్న మంత్రి పేషీ కార్యాలయంలో మంత్రికి దర్గా ప్రతినిధులు ఆహ్వాన పత్రికను అందించారు. ఈనెల 24 నుంచి 29 వరకు జరిగే ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు. ఉర్సు ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్ల గురించి మంత్రి ఫరూక్ ఆరా తీశారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని ప్రతినిధుల బృందానికి మంత్రి ఫరూక్ సూచించారు.

## న్యాయవాదుల రక్షణకు, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: మంత్రి ఫరూక్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని న్యాయవాదుల రక్షణకు, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయంలోని మూడో బ్లాక్‌లోని పేషీ కార్యాలయంలో మంత్రి ఫరూక్‌ను పశ్చిమ గోదావరి జిల్లా బార్ ఫెడరేషన్, ఒంగోలు బార్ అసోసియేషన్, హిందూ లాయర్స్ ఫోరం, ఇతర లాయర్ల బృందాల సభ్యులు కలిశారు. న్యాయవాదుల రక్షణ బిల్లు, న్యాయమిత్ర, అడ్వొకేట్ వెల్ఫేర్ ఫండ్, హెల్త్ కార్డులు తదితర పథకాలను అమలు చేయాలని మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల రక్షణ బిల్లు-2026(ఏపీ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్-2026)ను రూపొందించడానికి కూటమి ప్రభుత్వం ఇదివరకే కార్యాచరణ చర్యలకు ఉపక్రమించిన విషయాన్ని గుర్తు చేశారు. ముసాయిదా దాను వీలైనంత త్వరగా తయారు చేసే దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. త్వరలో ముసాయిదా బిల్లును ఆమోదం కోసం మంత్రిమండలి సమావేశం ముందుకు తీసుకు వెళ్లడం జరుగుతుందని మంత్రి ఫరూక్ న్యాయవాదుల బృందంతో చెప్పారు. న్యాయవాదుల సంక్షేమానికి, రక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మరణించిన 1,173 మంది న్యాయవాదుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున మొత్తం రూ.46.92 కోట్ల ఆర్థిక సాయాన్ని కూటమి ప్రభుత్వం విడుదల చేసిన విషయాన్ని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు.

# తెలుగు సాహిత్యం విలువ వెలకట్టలేనిది

- ఏపీ సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి
- ఏపీఎస్ఆర్ఎంలో ఘనంగా ప్రారంభమైన అమరావతి సాహిత్య ఉత్సవాలు
- హాజరైన కవులు, రచయితలు, వివిధ యూనివర్సిటీల విద్యార్థులు, సాహిత్యాభిలాషులు



అమరావతి (చైతన్య రథం): తెలుగు భాష, సాహిత్యం విలువ వెలకట్టలేనిదని, మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దే శక్తి తెలుగు సాహిత్యానికి ఉందని ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి అన్నారు. తెలుగు భాషను విశ్వవ్యాప్తం చేసేందుకు అవసరమైన ప్రణాళికలతో సంస్కృతి కమిషన్ ముందుకు సాగుతోందని తెలిపారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బుధవారం అమరావతి సాహిత్య ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రారంభ కార్యక్రమానికి తేజస్వి పొడపాటి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, సాహిత్యాభిలాషులు, వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన కవులు, రచయితలను ఉద్దేశించి ప్రసంగించారు. యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ సాహిత్య ఉత్సవాల వీడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తేజస్వి పొడపాటి మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో నేటితరం విద్యార్థులు 'అక్షరం' విలువను విస్మరిస్తున్నారని అన్నారు. సాహిత్య మాధుర్యాన్ని ఆస్వాదించాలంటే అక్షరాన్ని ఆరాధించాల్సిన అవసరం ఉందని సూచించారు. విదేశీ భాషలపై ఆసక్తి పెంచుకుంటున్న క్రమంలో తెలుగు విద్యార్థులు మాతృభాషను విస్మరించకూడదని హితవు పలికారు.

తెలుగు భాష, సాహిత్య విలువలను జాతీయ స్థాయిలో మరింత పెంపొందించే దిశగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. తెలుగు భాషా వికాసం, సాహిత్య విలువలను పెంచే దిశగా ఏపీ సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ పనిచేస్తోందన్నారు. ఇందులో భాగంగా విజయవాడలో ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు పది మందికి పైగా ముఖ్యమంత్రులు హాజరుకానున్నారని వెల్లడించారు.

### పుస్తక పఠనంతో ఆత్మవిశ్వాసం..

విశిష్ట అతిథిగా హాజరైన గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడంతో పాటు సంభాషణా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవచ్చని అన్నారు. అమరావతి గొప్పదనాన్ని విశ్వవ్యాప్తం చేసే దిశగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సాహిత్య ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు.

### కవులు, రచయితలను ఒకే వేదికపైకి తీసుకురావడమే లక్ష్యం...

యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల భాషలు, సాహిత్యాలను పరిమళింపజేస్తున్న కవులు, రచయితలను ఒకే వేదికపైకి తీసుకురావడమే అమరావతి సాహిత్య ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. వచ్చే ఏడాది నిర్వహించే సాహిత్య ఉత్సవాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రెండు ప్రతిష్ఠాత్మక సాహిత్య పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. పురస్కారాలు ఎంపిక ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రత్యేక జ్యూరీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు హాజరైన తమిళనాడుకు చెందిన ప్రముఖ రచయిత్రి మినీ కృష్ణన్ సాహిత్య ఉత్సవాల ప్రాధాన్యత, సాహిత్యం సమాజంపై చూపే ప్రభావం గురించి ప్రసంగించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ విష్ణుపథ్, సాహిత్య ఉత్సవాల కన్వీనర్లు డాక్టర్ ఆర్గాబను, డాక్టర్ శయంతన్ ఠాగూర్ తదితరులు ప్రసంగించారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తేజస్వి పొడపాటి, జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మలను యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.

### తరలివచ్చిన కవులు, రచయితలు...

మూడు రోజుల పాటు నిర్వహించే అమరావతి సాహిత్య ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి 50 మందికి పైగా కవులు, రచయితలు, సాహిత్యాభిలాషులు తరలివచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనలు సాహిత్యాభిమానులను ఆకట్టుకున్నాయి. వివిధ భాషల్లోని పుస్తకాలను సందర్శకులు ఆసక్తిగా పరిశీలించి, వాటి గురించి రచయితలు, సాహితీవేత్తలతో చర్చించారు.

## మెప్మా మహిళలకు జీవనోపాధి

# కల్పనపై మున్సిపల్ శాఖ ప్రత్యేక దృష్టి

- టిడ్కో నివాస సముదాయాల్లో మెప్మా మహిళలతో ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు సన్నాహాలు
- రాజమండ్రి, నెల్లూరులో పైలెట్ ప్రాజెక్టుల ఏర్పాటుకు మంత్రి నారాయణ సూచనలు

అమరావతి (చైతన్య రథం): పట్టణ ప్రాంతాల్లోని మెప్మా మహిళా సంఘాల సభ్యులకు మెరుగైన జీవనోపాధి అవకాశాలు కల్పించడంతోపాటు వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. టిడ్కో నివాస సముదాయాల్లో మెప్మా మహిళల భాగస్వామ్యంతో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ అంశంపై మున్సిపల్ మంత్రి పి నారాయణ మెప్మా, టిడ్కో ఉన్నతాధికారులు, ఏలీప్ ప్రతినిధులతో సమావేశమై చర్చించారు. మెప్మా మహిళలకు స్థానికంగా ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేలా ఎంఎస్‌ఎంఈ పార్కులను అభివృద్ధి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

### రాజమహేంద్రవరం, నెల్లూరులో పైలట్ ప్రాజెక్టులు

రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాన్ని అమలు చేయడానికి ముందు రాజమహేంద్రవరం, నెల్లూరు నగరాల్లో



ప్రయోగాత్మకంగా ఎంఎస్‌ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలని మంత్రి నారాయణ అధికారులను సూచించారు. ఈ రెండు ప్రాంతాల్లో చేపట్టే పైలట్ ప్రాజెక్టుల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన మార్పులు, మెరుగుదలలు చేసి రాష్ట్రంలోని ఇతర నగరాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నారు.

### 10 వేలమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10,000 మంది మెప్మా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇప్పటికే కొనసాగుతున్న వివిధ జీవనోపాధి కార్యక్రమాలను మరింత విస్తరించి, వాటిని సూక్ష్మ పరిశ్రమల స్థాయికి తీసుకెళ్లేలా చర్యలు చేపట్టనున్నారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు అవసరమైన శిక్షణ, ఉత్పత్తి సదుపాయాలు, ప్యాకేజింగ్, మార్కెటింగ్ తదితర అంశాల్లో సహకారం అందించే విధంగా సమగ్ర కార్యాచరణ రూపొందించనున్నారు.

### టిడ్కో నివాస సముదాయాల్లో అవసరమైన సదుపాయాలు

మెప్మా మహిళల కోసం ఏర్పాటు చేయనున్న ఎంఎస్‌ఎంఈ పార్కులకు అవసరమైన మౌలిక సదుపాయాలను టిడ్కో సమకూర్చనుంది. టిడ్కో నివాస సముదాయాల్లో అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించి, మహిళా సంఘాల పారిశ్రామిక కార్యకలాపాలకు అనుకూలంగా అభివృద్ధి చేయనున్నారు. పరిశ్రమల నిర్వహణకు అవసరమైన ప్రాథమిక వసతులు, విద్యుత్, నీరు, ఇతర అవసరమైన సదుపాయాలను కల్పించే అంశంపై టిడ్కో అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

### మహిళా గ్రూపులకు కామన్ ఫెసిలిటేషన్ సెంటర్లు

మెప్మా మహిళా సంఘాలు నిర్వహించే సూక్ష్మ పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక, పారిశ్రామిక సదుపాయాలను ఒకేచోట అందించేందుకు ఏలీప్ ఆధ్వర్యంలో కామన్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు అవసరమైన యంత్రాలు, సాంకేతిక సహకారం, ఉత్పత్తి ప్రక్రియకు సంబంధించిన మార్గదర్శకత్వం, శిక్షణ వంటి సదుపాయాలను కామన్ ఫెసిలిటేషన్ సెంటర్ల ద్వారా అందించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. మెప్మా మహిళా సంఘాలను కేవలం స్వయం సహాయక సంఘాల స్థాయిలో కాకుండా ఉత్పత్తి, మార్కెటింగ్, వ్యాపార నిర్వహణలో స్వతంత్రంగా నిలదొక్కుకునే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుంది. టిడ్కో, మెప్మా, ఏలీప్ సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ పైలట్ ప్రాజెక్టులను విజయవంతంగా అమలు చేసి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేలా కార్యాచరణ రూపొందించనున్నాయి.

# వైసీపీ నేతల అక్రమాలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు

- వారసత్వ భూముల కబ్జా, రికార్డుల తారుమారుపై అర్జీలు
- ప్రభుత్వ భూముల ఆక్రమణ, దారి మూసివేతపై ఫిర్యాదులు
- సమస్యలను పరిష్కరించాలని నేతలకు బాధితుల విజ్ఞప్తి

మంగళగిరి (చైతన్య రథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్‌లో పలువురు తమ భూములు, ఆస్తులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, రెవెన్యూ రికార్డుల తారుమారు, దౌర్జన్యాలపై ఫిర్యాదులు చేశారు. శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, ఏపీ ఆర్య వైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ అర్జీలను స్వీకరించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన నర్రా రమేష్ బాబు మాట్లాడుతూ.. 2015లో తాను, నెల్లూరి పార్వతయ్య కలిసి కొనుగోలు చేసిన పొలాన్ని పక్కనే ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు కబ్జా చేశారని ఆరోపించారు. భూమిని విడిచిపెట్టాలని కోరితే బెదిరింపులకు పాల్పడి, తమపై తప్పుడు కేసులు పెట్టడంతోపాటు కోర్టుల్లో కేసులు వేయించి పదేళ్లుగా మానసిక, ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేశారు. మార్కాపురం జిల్లా రాచర్ల మండలం చెర్లపల్లికి చెందిన పాశం రవి.. సర్వే నంబర్ 938/3లోని పూర్వీకుల 1 ఎకరం భూమిని స్థానిక వీఆర్వో సహకారంతో ఇతరుల పేర్లపై ఆన్‌లైన్ రికార్డుల్లోకి ఎక్కించి, మ్యుటేషన్ చేశారని ఆరోపించారు. వీఆర్వో తన బంధువులకు అనుకూలంగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని





పేర్కొంటూ చర్యలు తీసుకోవాలని కోరారు. పోలవరం జిల్లా మారేడుమిల్లి మండలం కూడూరుకు చెందిన కత్తుల రత్నారెడ్డి.. పూర్వీకుల నుంచి వస్తున్న 29.69 ఎకరాల భూమిని వైఎస్సార్‌సీపీకి చెందిన గొల్ల సూర్యప్రకాశ్ రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తన కుటుంబ సభ్యుల పేర్లపై అక్రమంగా రికార్డుల్లోకి ఎక్కించారని ఆరోపించారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని తెలిపారు.

శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టికి చెందిన లక్ష్మీకాంత్ రెడ్డి.. సర్వే నంబర్ 380/2లో తల్లి పేరిట ఉన్న 10 సెంట్ల జిరాయితీ భూమిని ఎరుసు శ్రీనివాసరావు కబ్జా చేసి రేకుల షెడ్ నిర్మించారని ఫిర్యాదు చేశారు. ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. మార్కాపురం జిల్లా పుల్లలచెరువు మండలం కుందంపల్లికి చెందిన బైపునేని కొండయ్య.. సర్వే నంబర్ 199లోని వాగు పోరంబోకు భూమిలో సుమారు 3.50 ఎకరాలు ఆక్రమించి పూర్వీకుల నుంచి వినియోగిస్తున్న దారిని స్థానికులు మూసివేశారని తెలిపారు. అధికారులు గతంలో ఆక్రమణలు తొలగించినా, మళ్లీ ఆక్రమణదారులు పత్తి పంట వేసి దారిని మూసివేశారని, పొలానికి వెళ్లే మార్గం లేక జీవనోపాధి దెబ్బతింటోందని ఫిర్యాదు చేశారు. నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా మండలం తర్తూరుకు చెందిన ఏసన్న.. ఎస్సీ కాలనీలోని 9 అడుగుల ప్రభుత్వ రస్తాను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో అది మూడు అడుగులకు కుంచించుకుపోయిందని తెలిపారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో, చివరకు మృతదేహాలను కూడా బయటకు తీసుకెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల విచారణ జరిగినా స్థానిక నాయకుల ఒత్తిళ్లతో సమస్య పరిష్కారం కాలేదని ఆరోపించారు.

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం బలుసుముడికి చెందిన నాగ సరస్వతి.. ఉండుర్రు గ్రామంలోని వారసత్వ 2.08 ఎకరాల భూమిని రీ-సర్వేలో 1.98 ఎకరాలుగా నమోదు చేసి 10 సెంట్లు తగ్గించారని ఫిర్యాదు చేశారు. పక్కనున్న సర్వే నంబర్లలోకి ఆ భూమిని కలిపేయడంతో సరిహద్దు వివాదాలు ఏర్పడ్డాయని, నీటిని తమ పొలంలోకి మళ్లించడంతో మూడేళ్లుగా పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం మలకపల్లికి చెందిన సత్యసాయిబాబు.. తన సొంత భూమిలో నిర్మించిన శ్రీ అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంపై ఏర్పడిన వివాదంలో కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి తనపై, భార్యాపిల్లలపై దాడి చేశారని ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని తెలిపారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డిగూడేనికి చెందిన నాగేశ్వరరావు నాయక్.. తన పొలం, ఇల్లును కుటుంబ సభ్యులు బలవంతంగా లాక్కొని బయటకు పంపించారని ఫిర్యాదు చేశారు. విజయవాడలోని నిరాశ్రయుల ఇంటికి వెళ్లినా అక్కడ కేర్‌టేకర్, మరో వ్యక్తి వేధింపులకు గురిచేశారని, తన సెల్‌ఫోన్ తీసుకుని తిరిగి ఇవ్వలేదని ఆరోపించారు. వీటితోపాటు పింఛన్లు, రేషన్, ఇళ్ల నిర్మాణం, ఉద్యోగాలు, వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం కోరుతూ పలువురు అర్జీలు సమర్పించారు. ఉద్యోగాల కోసం మరికొందరు రెస్యూమ్‌లు అందజేశారు.



# భక్తుల సౌకర్యాలే ప్రాధాన్యం

- సీజీఎఫ్ నిధులను అత్యవసర పనులకు సమర్థంగా వినియోగించాలి
- గోదావరి పుష్కరాల పనులను వేగవంతం చేయాలి
- డీడీఎన్ఎస్ నిధుల విడుదలలో జాప్యం వద్దు: మంత్రి ఆనం



అమరావతి (చైతన్య రథం): ఆలయాల అభివృద్ధి, భక్తుల సౌకర్యాలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే పనులకు ప్రాధాన్యతనిస్తూ నిధులను సమర్థంగా వినియోగించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. 2027 గోదావరి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే పనులను వేగవంతం చేసి, అన్ని శాఖలతో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. మంజూరైన పనుల్లో జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్), ధూపదీప నైవేద్య పథకం (డీడీఎన్ఎస్), గోదావరి పుష్కరాలు-2027 అభివృద్ధి పనులు, ఆలయాల మౌలిక వసతులు, అర్చకులు, సిబ్బంది వేతనాలు తదితర అంశాలపై సమీక్షించారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబు, కమిషనర్ రామచంద్ర మోహన్, టీటీడీ జేఈఓ శరత్, చీఫ్ ఇంజినీర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**సీజీఎఫ్ పనులకు ప్రాధాన్యం**

సీజీఎఫ్ కింద ప్రస్తుతం 95 పనులకు సంబంధించి రూ.119 కోట్ల అంచనాలను కమిటీ సిఫార్సు చేసింది. ఇందులో రూ.28.86 కోట్ల మాన్యువల్ కాంట్రిబ్యూషన్, రూ.90.11 కోట్ల సీజీఎఫ్ నిధులు అవసరమవుతున్నట్లు అధికారులు తెలిపారు. ఆలయాలకు అత్యవసరమైన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిధులు వృథా కాకుండా సమర్థంగా వినియోగించాలని మంత్రి సూచించారు. ఇప్పటికే సీజీఎఫ్ కింద 466 పనులకు రూ.419.13 కోట్లు మంజూరు కాగా, ఇప్పటివరకు రూ.52.65 కోట్లు విడుదలయ్యాయి. ఇంకా రూ.366.48 కోట్లు విడుదల చేయాల్సి ఉందని అధికారులు వివరించారు. మరో 427 పనులకు రూ.395.53 కోట్ల మేర ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. మంజూరైన పనులను వేగంగా పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు.

**పుష్కరాల పనులకు వేగం**

2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఘాట్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, రహదారులు, పార్కింగ్, భద్రత, ఆలయాలు, ఆలయ పరిసరాల అభివృద్ధి పనులను సమగ్రంగా చేపట్టాలని మంత్రి సూచించారు. పుష్కరాలకు సంబంధించిన 412 పనులకు ఇప్పటికే రూ.104.59 కోట్ల పరిపాలనా, అభివృద్ధి నిధులు మంజూరు కాగా, సుమారు రూ.50 కోట్ల విలువైన పనులు ప్రారంభమయ్యాయి. పనుల మంజూరు, టెండర్లు, నిధుల విడుదలలో శాఖల మధ్య సమన్వయం ఉండాలని, లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

**డీడీఎన్ఎస్ నిధులపై సమీక్ష**

ఆలయాల్లో ధూపదీప నైవేద్య కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగేందుకు ప్రభుత్వం అందిస్తున్న డీడీఎన్ఎస్ సహాయంపై కూడా మంత్రి సమీక్షించారు. ప్రస్తుతం 6,137 ఆలయాలకు నెలకు రూ.10 వేల చొప్పున సహాయం అందుతుండగా, ఈ పథకానికి ఏటా సుమారు రూ.80 కోట్లు అవసరం ఉంటుందని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు రూ.35.66 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. చిన్న ఆలయాల్లో నిత్య పూజా కార్యక్రమాలు సక్రమంగా కొనసాగేందుకు డీడీఎన్ఎస్ నిధులు కీలకమని, అర్హత కలిగిన ఆలయాలకు నిధుల విడుదలలో ఎలాంటి జాప్యం ఉండకూడదని మంత్రి ఆదేశించారు.

**అర్చకులు, సిబ్బంది వేతనాలపై దృష్టి**

అర్చకులు, ఇతర సిబ్బంది వేతనాలకు సంబంధించిన డిఫరెన్షియల్ రెమ్యునరేషన్ కోసం రూ.20 కోట్లు అవసరం కాగా, ఇప్పటివరకు రూ.6.6 కోట్లు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. జీతాలు, రుణాలు, అడ్వాన్సులు, ప్రింటింగ్-స్టేషనరీ, ప్రయాణం, హైర్ ఛార్జీలు, ట్రిబ్యునల్ ఖర్చులు తదితరాలకు రూ.6.10 కోట్లు అవసరం కాగా, రూ.4.11 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. దేవాదాయ శాఖకు అందుబాటులో ఉన్న నిధులను అత్యవసర, భక్తులకు ప్రత్యక్షంగా ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత క్రమంలో కేటాయించాలని మంత్రి సూచించారు. సీజీఎఫ్ నిధులను ఆలయాల అభివృద్ధి, భక్తుల సౌకర్యాలు, అత్యవసర అవసరాలకు సమర్థంగా వినియోగించాలని, మంజూరైన పనులు వేగంగా పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు.

# ఏపీలో సాంకేతిక పర్యాటకానికి పెద్దపీట

- 'నివు ఏఐ'తో 100కు పైగా పర్యాటక ప్రాంతాల్లో స్మార్ట్ సేవలు
- క్యూఆర్ కోడ్‌తో 130కుపైగా భాషల్లో పర్యాటక విశేషాలు
- ప్రపంచ పర్యాటకులకు ఏపీని స్మార్ట్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతాం
- స్పెయిన్ టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్‌లో మంత్రి కందుల దుర్గేష్




స్పెయిన్: ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సాంకేతికతను ప్రవేశపెట్టి ప్రభుత్వం చారిత్రాత్మక అడుగు వేసిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. స్పెయిన్‌లోని సెవిల్లె-ఫిబెస్ వేదికగా జరుగుతున్న అంతర్జాతీయ 'టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్-2026'లో మంత్రి ప్రసంగించారు. 'ఎక్స్‌ప్లర్జర్' సంస్థ రూపొందించిన 'నివు ఏఐ' ప్లాట్‌ఫారమ్ ద్వారా రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల చారిత్రక, సాంస్కృతిక విశేషాలను ప్రపంచ పర్యాటకులకు సులభంగా అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు.

తిరుమల నుంచి అమరావతి బౌద్ధ వారసత్వం, గండికోట, మారేడుమిల్లి, అరకు లోయలు, విశాఖ తీర ప్రాంతం వరకు ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి, ఆధ్యాత్మికత, చరిత్ర, సంస్కృతి, వంటకాలు వంటి అనేక వైవిధ్యాలు ఒకే ప్రయాణంలో ఆస్వాదించే అవకాశం ఉందని మంత్రి వివరించారు. "భారతదేశాన్ని చూసేశామని అనుకుంటే.. ఒకసారి ఆంధ్రప్రదేశ్‌కు రండి.. ఒకే యాత్రలో ఇంతటి వైవిధ్యాన్ని చూసి ఆశ్చర్యపోతారు" అని పర్యాటకులను ఆహ్వానించారు.

'ఎక్స్‌ప్లర్జర్'తో కుదిరిన ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలోని 100కుపైగా ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాల్లో 'ASK AI' క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు దుర్గేష్ తెలిపారు. పర్యాటకులు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ప్రత్యేక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోకుండానే 130కుపైగా భాషల్లో ఆయా ప్రాంతాల చరిత్ర, సంస్కృతి, విశేషాలను తెలుసుకోవచ్చన్నారు. ఈ సేవ పూర్తిగా ఉచితమని తెలిపారు. మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఈ విధానం విజయవంతంగా అమలవుతోందని, తొలి దశలో 30 ప్రధాన గమ్యస్థానాలకు సేవలను విస్తరిస్తామని చెప్పారు.

ఒక స్పెయిన్ పర్యాటకుడు ఏపీలోని చారిత్రక కట్టడం లేదా పవిత్ర స్థలానికి చేరుకుని క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి స్పానిష్‌లోనే సమాచారం పొందగలరని మంత్రి వివరించారు. సంబంధిత ప్రాంతం చరిత్ర, సాంస్కృతిక ప్రాధాన్యతతో పాటు సమీపంలోని ఇతర పర్యాటక ప్రాంతాల వివరాలు కూడా తెలుసుకోవచ్చన్నారు. పర్యాటకుల భాషలు, ప్రాధాన్యతలు, ప్రవర్తనా సరళిపై రియల్‌టైమ్ అనలిటిక్స్ ద్వారా భవిష్యత్ పర్యాటక ప్రణాళికలను రూపొందించుకునే అవకాశం ఏపీటీఏకు లభిస్తుందని తెలిపారు. పర్యాటక రంగంలో సాంకేతికతను తీసుకురావడం అంటే కేవలం డిజిటల్ సమాచారం అందించడం కాదని, పర్యాటకుల ప్రయాణాన్ని ప్రణాళిక దశ నుంచి పర్యటన అనంతరం వరకు సులభతరం చేయడమే లక్ష్యమని దుర్గేష్ చెప్పారు. 'స్మార్ట్ డెస్టినేషన్' అంటే డేటాను సేకరించడం మాత్రమే కాదని, మెరుగైన పర్యాటక అనుభవాలు, స్థానిక ఉపాధి, బాధ్యతాయుతమైన పర్యాటకాన్ని ప్రోత్సహించడమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఏపీని ప్రపంచస్థాయి సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు.

పర్యాటక రంగంలోనూ ట్రావెల్-టెక్ సంస్థలు, స్టార్టప్‌లు, విశ్వవిద్యాలయాలు, టూరిజం ఆపరేటర్లు, పెట్టుబడిదారులు, కంటెంట్ క్రియేటర్లు, గమ్యస్థాన నిపుణులతో భాగస్వామ్యానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. "కేవలం పర్యాటకులుగా కాకుండా భాగస్వాములుగా ఆంధ్రప్రదేశ్‌కు రండి. ఏఐ ఆధారిత పర్యాటక సేవలు, డిజిటల్ సాధనాలు, స్మార్ట్ డెస్టినేషన్ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టండి. సమాజానికి నిజమైన ప్రయోజనం చేకూర్చే ఆవిష్కరణలకు మేం ప్రాధాన్యత ఇస్తాం" అని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు.

# నాణ్యమైన శిక్షణతోనే మెరుగైన ఉపాధి

- శిక్షణ సర్టిఫికెట్‌కే పరిమితం కాకూడదు
- సీడాప్ ఆధ్వర్యంలో ఘనంగా డీడీయూజీకేవై 2.0 వర్క్‌షాప్




విజయవాడ (చైతన్య రథం): గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ అందించి స్థిరమైన ఉపాధి కల్పించడమే దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన-2.0 లక్ష్యమని కేంద్ర, రాష్ట్ర అధికారులు స్పష్టం చేశారు. శిక్షణ నుంచి ఉపాధి, అనంతర పర్యవేక్షణ వరకు నాణ్యత, పారదర్శకత, సాంకేతికతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖకు చెందిన సీడాప్ సహకారంతో బుధవారం విజయవాడలోని హయత్ ప్లేస్‌లో దక్షిణ ప్రాంతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, కేరళ, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, పుదుచ్చేరి, అండమాన్-నికోబార్ దీవుల నుంచి 52 మంది అధికారులు, 80మంది శిక్షణ అమలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ ఎన్ఆర్టీ అధ్యక్షులు రవికుమార్ పి వేమూరి మాట్లాడుతూ.. శిక్షణ కేవలం ధ్రువపత్రాలకే పరిమితం కాకుండా ఉద్యోగం, ఆదాయం, స్థిరమైన జీవనోపాధికి దోహదపడాలని అన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ చీఫ్ కంట్రోలర్ ఆఫ్ అకౌంట్స్ అఖిలేష్ ఝా మాట్లాడుతూ.. నాణ్యమైన శిక్షణ, మూల్యాంకనం, ఉపాధి ధ్రువీకరణ, అనంతర పర్యవేక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ జి. గణేష్ కుమార్ మాట్లాడుతూ.. డిజిటల్ విధానాలతో శిక్షణ, మూల్యాంకనం, ఉపాధి కల్పనను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

సీడాప్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పాలడుగు నారాయణస్వామి మాట్లాడుతూ.. సీసీ కెమెరాల అనుసంధానం, మూడు దశల ఉపాధి ధ్రువీకరణ, క్యూఆర్ కోడ్ ఆధారిత అభ్యర్థుల సమీకరణ వంటి చర్యలపై వర్క్‌షాప్‌లో వివరించారు. వర్క్‌షాప్‌లో అభ్యర్థుల ఎంపిక, శిక్షణ కేంద్రాల మౌలిక వసతులు, శిక్షణ, మూల్యాంకనం, ధ్రువీకరణ, ఉపాధి, అనంతర పర్యవేక్షణ, నిధుల విడుదలపై చర్చించారు. వివిధ రాష్ట్రాల ప్రతినిధులు తమ అనుభవాలు, సవాళ్లను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సీడాప్ కార్యనిర్వాహక సంచాలకులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్, రాష్ట్ర ప్రాజెక్ట్ మేనేజర్లు, జిల్లా ఉద్యోగ నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక రంగానికి పూర్వవైభవం

# కూటమి ప్రభుత్వ చలవే..

**-ఏపీ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్**

అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఆధ్యాత్మిక రంగానికి పూర్వవైభవం తీసుకువస్తోందని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నేడు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో ఉత్సవాల నిర్వహణపై ఆంక్షలు, వేధింపులు ఉండేవని, కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని తొలగించిందని ఆయన చెప్పారు. ఇటీవలి వినాయక చవితి వేడుకలను కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ప్రజలు స్వేచ్ఛగా, భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజల ఆధ్యాత్మిక, ధార్మిక మనోభావాలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమతూకంతో ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు.

### ఆలయాల్లో పారదర్శకత, భక్తులకు సౌకర్యాలు

దేవాలయ శుద్ధి, పునరుద్ధరణ, పారదర్శకత అనే మూడు సూత్రాలతో ప్రభుత్వం పనిచేస్తోందని రాంప్రసాద్ తెలిపారు. ఆలయాల్లో ప్రసాదాలు, సేవల తయారీకి స్వచ్ఛమైన ఆవు నెయ్యి మాత్రమే వాడుతున్నామని, కల్తీ జరగకుండా ప్రామాణిక నిర్వహణ విధానాలను (ఎస్ఓపీ) కచ్చితంగా అమలు చేస్తున్నామని చెప్పారు. తిరుమలలో స్వచ్ఛమైన నెయ్యితో చేసిన లడ్డూ ప్రసాదాన్ని తిరిగి అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో దేవాలయాలపై దాడులు జరిగాయని, కూటమి ప్రభుత్వం వచ్చాక భక్తుల్లో భరోసా పెరిగిందని అన్నారు. రాష్ట్రంలోని 54 ప్రధాన ఆలయాల్లో భక్తుల రాక 70 శాతం పెరిగిందని వెల్లడించారు. పెద్ద ఆలయాల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను నియంత్రించి, సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. క్యూలైన్లలో వేచి ఉండే సమయాన్ని తగ్గించామని, షెడ్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. పసిపిల్లలకు పాలు, స్నాక్స్, శుద్ధమైన తాగునీరు అందిస్తున్నామని, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. అన్నదానం గురించి వివరిస్తూ, ప్రస్తుతం 65 ప్రధాన ఆలయాల్లో నిరంతర అన్నదానం జరుగుతోందని, దీన్ని మరో 111 ఆలయాలకు విస్తరిస్తున్నామని తెలిపారు. రోజుకు సుమారు 80 వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్నామని, ఇందుకు ప్రభుత్వం ఏటా సుమారు రూ.84 కోట్లు ఖర్చు చేస్తోందని చెప్పారు.

### అర్చకులకు చేయూత, సామాజిక సమరసత

చిన్న ఆలయాల నిర్వహణకు ఉపయోగపడే 'ధూప దీప నైవేద్యం' పథకానికి ప్రభుత్వం భారీ చేయూత ఇచ్చిందని రాంప్రసాద్ చెప్పారు. అర్చకుల గౌరవ వేతనాన్ని రూ.5,000 నుంచి రూ.10,000కు పెంచామని తెలిపారు. ఈ పథకం రాష్ట్రవ్యాప్తంగా 6,137 ఆలయాల్లో అమలవుతోందని, ఇందుకు అదనంగా రూ.73 కోట్లు కేటాయించామని వెల్లడించారు. పదవీ విరమణ పొందిన వృద్ధ వేద పండితులకు నెలకు రూ.3,000 భృతి ఇస్తున్నామని, ఆలయ ట్రస్ట్ బోర్డుల్లో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు చట్టబద్ధమైన ప్రాతినిధ్యం కల్పించామని చెప్పారు.

కొత్త ఆలయాల నిర్మాణం గురించి మాట్లాడుతూ, మొత్తం రూ.750 కోట్లతో నిర్మాణాలు చేపట్టగా ఇప్పటివరకు రూ.267 కోట్లతో 1,270 మందిరాలకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. వీటిని ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వెనుకబడిన వర్గాల ప్రాంతాల్లో నిర్మిస్తున్నామన్నారు. టీటీడీ, శ్రీవాణి ట్రస్ట్ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా 5,000 కొత్త భజన మందిరాలు నిర్మించాలన్నది లక్ష్యమని చెప్పారు. ఆలయ ప్రాంగణాల్లో సుమారు 50 వేల మంది నిరుపేద పిల్లలకు ఉచిత సాక్షరతా శిక్షణ ఇస్తున్నామని, పచ్చదనం పెంపు కోసం మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.



### మొబైల్ సేవలు, బ్లాక్‌చెయిన్‌తో భూముల రక్షణ

సాంకేతికత వినియోగంలో కూడా ప్రభుత్వం ముందడుగు వేసిందని రాంప్రసాద్ చెప్పారు. దర్శనం, వసతి, ప్రసాదాల బుకింగ్‌లు మొబైల్ ఫోన్లలోనే అందుబాటులోకి వచ్చాయన్నారు. బ్లాక్‌చెయిన్ సాంకేతికతతో వేల ఎకరాల దేవాలయ భూముల రికార్డులను డిజిటలైజ్ చేసి కబ్జాల నుంచి కాపాడుతున్నామని తెలిపారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకున్నామని, నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి, ఆత్మగౌరవానికి భరోసా కల్పించామని చెప్పారు.

### విజయవాడ దసరా ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను దేశం గర్వించే స్థాయిలో నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైందని రాంప్రసాద్ తెలిపారు. ఉత్సవాలకు రాష్ట్రపతి, ప్రధానమంత్రి, పలువురు కేంద్ర మంత్రులు, ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించామని చెప్పారు. గతంలో సుమారు 20 లక్షల మంది భక్తులు రాగా, ఈసారి 25 లక్షల మందికి పైగా వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఈ ఏర్పాట్లకు ప్రత్యేక బాధ్యత తీసుకుని క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామని, దేవాదాయ, పర్యాటక, అటవీ శాఖల సమన్వయంతో రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఆలయాల్లో దసరా ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు. ఉత్సవాల సమయంలో గుణదల మేరీమాత చర్చి, స్థానిక మసీదులతో కలిసి సర్వమత సామరస్యాన్ని చాటేలా ప్రభుత్వం దృష్టి పెట్టిందని పేర్కొన్నారు.

### 2027 గోదావరి పుష్కరాలకు ప్రణాళికలు

2027లో జరిగే గోదావరి పుష్కరాలను ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా స్థాయిలో నిర్వహించేందుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలు రచిస్తోందని రాంప్రసాద్ తెలిపారు. వీటిని పర్యావరణహితమైన 'గ్రీన్ పుష్కరాలు'గా నిర్వహించనున్నట్లు చెప్పారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని పేర్కొంటూ, ధర్మ పరిరక్షణ, ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

## తండ్రి పేరు పిల్లల భవిష్యత్తుకు అడ్డంకి కాకూడదు

**- బాలల హక్కులకు అనుకూలంగా ఏకరీతి విధానం అవసరం**

**- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గాంధీబాబు**

విజయవాడ (చైతన్య రథం): తండ్రి పేరు అందుబాటులో లేకపోవడం లేదా వెల్లడించలేని పరిస్థితి కారణంగా ఏ చిన్నారికీ విద్య, గుర్తింపు పత్రాలు, సంక్షేమ ప్రయోజనాలు, ప్రభుత్వ సేవలు నిరాకరించకూడదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు ఉండవల్లి గాంధీబాబు అన్నారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా అమలు చేయగల ఏకరీతి, బాలల హక్కులకు అనుకూలమైన విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. బెంగళూరులో కర్ణాటక రాష్ట్ర న్యాయ సేవా సంస్థ, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి సమావేశంలో గాంధీబాబు మాట్లాడారు. జనన ధ్రువీకరణ పత్రాలు, పాఠశాల రికార్డులు, గుర్తింపు పత్రాలు, ప్రభుత్వ సేవలు పొందే సమయంలో తండ్రి వివరాల కోసం అడుగుతున్న ప్రశ్నలు పిల్లలకు ఇబ్బందిగా మారుతున్నాయని తెలిపారు. తండ్రి ఎవరో తెలియని సందర్భాల్లో లేదా వివరాలు అందుబాటులో లేని పరిస్థితుల్లో పిల్లలు తమ జనన పరిస్థితుల పర్యవసానాలను భరించాల్సిన పరిస్థితి రాకూడదన్నారు. తండ్రి వివరాలు లేవనే కారణంతో పిల్లలు పదేపదే వివక్ష, అవమానం, సామాజిక ముద్రను ఎదుర్కొనే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యభిచార వృత్తిలో ఉన్న మహిళలకు జన్మించిన పిల్లలు, వివాహానికి ముందే గర్భం దాల్చిన మహిళల పిల్లలు, ప్రత్యేక సామాజిక పరిస్థితుల్లో ఉన్న తల్లుల పిల్లలు ఈ సమస్యను ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు.

రాజ్యాంగ సూత్రాలు, న్యాయస్థానాల తీర్పులు, విద్యా హక్కు చట్టం స్ఫూర్తికి అనుగుణంగా పరిపాలనా విధానాలు పిల్లల ప్రాథమిక హక్కులకు అడ్డంకిగా మారకూడదన్నారు. కేవలం పత్రాలు పూర్తి చేసేందుకు తప్పుడు లేదా కల్పిత తండ్రి పేరును నమోదు చేయడం భవిష్యత్తులో పిల్లలకు మరిన్ని గుర్తింపు సమస్యలు, సామాజిక వివక్షకు దారితీయవచ్చని హెచ్చరించారు. తండ్రి వివరాలు అందుబాటులో లేని పిల్లలు తప్పుడు సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేకుండా విద్య, గుర్తింపు, సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ సేవలు పొందేలా స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వాలను కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం జిల్లాలో గిరిజన మహిళలు, వారి పిల్లలు ఎదుర్కొన్న ఇలాంటి సమస్యలను గాంధీబాబు సమావేశంలో ప్రస్తావించారు. కొన్ని సందర్భాల్లో బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు గిరిజన మహిళలతో సంబంధాలు ఏర్పరచుకుని, అనంతరం వారిని వదిలివెళ్లడంతో సుమారు 270 మంది యువతులు, వారి పిల్లలు సామాజిక సమస్యలను ఎదుర్కొన్నారని తెలిపారు. తన అగ్రికల్చర్ అండ్ సోషల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ద్వారా వారికి న్యాయ సహాయం అందించినట్లు చెప్పారు.

"ఒక చిన్నారి భవిష్యత్తు ఆ చిన్నారి తండ్రి పేరు చెప్పగలదా లేదా అనే అంశంపై ఆధారపడకూడదు. పిల్లలు తమ జనన పరిస్థితులకు సంబంధించిన సామాజిక పరిణామాలను మోయాల్సిన పరిస్థితి రాకూడదు" అని గాంధీబాబు అన్నారు. ప్రతి చిన్నారికి విద్య, గుర్తింపు, రక్షణ, సమాన అవకాశాలు అందేలా బాలల హక్కుల ఆధారిత వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

# మనమిత్ర ద్వారా కుల ధృవీకరణ పత్రాలు

- **మొబైల్ ఫోన్ ద్వారానే డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం**
- **రీ-ఇష్యూయెన్స్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ సేవ అందుబాటులో ఉందన్న ఆర్టీజీఎస్**

అమరావతి (చైతన్య రథం): మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులు తమ కుల ధృవీకరణ పత్రాలు పొందే సదుపాయాన్ని కల్పించినట్లు రియల్ టైమ్ గవర్నెన్స్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పౌరులు తమ కుల ధృవీకరణ పత్రాలను తమకు కావాల్సినప్పుడు ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లనవసరం లేకుండా, తామున్న చోటనుంచే మొబైల్ ఫోన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆర్టీజీఎస్ తెలిపింది.

మనమిత్రలోని రెవెన్యూ సేవల విభాగంలో పౌరులు రీ-ఇష్యూయెన్స్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్స్ విభాగాన్ని ఎంపిక చేసుకుని, అందులో తమ ఆధార్ నంబర్ పొందుపరిచి ఓటీపీ పొందాలి. ఈ ఓటీపీని అందులో నమోదు చేసిన తర్వాత కొన్ని వివరాలను నింపాలి. తర్వాత కుల ధృవీకరణ పత్రం పొందడానికి కావాల్సిన రూ.40 రుసుమును వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే చెల్లించవచ్చు. ఒకసారి చెల్లింపు అయిన తర్వాత వాట్సాప్‌లో మీ కుల ధృవీకరణ పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇప్పటికే కుల ధృవీకరణ పత్రాలు జారీ అయిన వారు తమ కుల ధృవీకరణ పత్రాలను వాట్సాప్ ద్వారా తమకు కావాల్సిన సమయంలో, కావాల్సిన చోట డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రతిసారీ కుల ధృవీకరణ పత్రం కోసం రెవెన్యూ కార్యాలయాలు, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాలు, మీ సేవా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఈ సదుపాయాన్ని ఇప్పటికే కుల ధృవీకరణ పత్రాలు పొందిన వారికి కల్పిస్తున్నామని, త్వరలో మనమిత్ర ద్వారా కొత్తగా కుల ధృవీకరణకు దరఖాస్తు చేసుకుని పొందే సదుపాయం కూడా కల్పించనున్నట్లు ఆర్టీజీఎస్ అధికారులు తెలిపారు.

**ఇలా ఉపయోగించాలి**

1. **మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 9552300009కు 'హాయ్' అని మెసేజ్ పంపాలి.**
2. **'సేవను ఎంచుకోండి' అనే ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి.**
3. **'రెవెన్యూ సేవలు' ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి.**
4. **'రీ-ఇష్యూయెన్స్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్స్' ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి.**
5. **మీ ఆధార్ నంబర్ టైప్ చేయాలి.**
6. **మీ మొబైల్‌కు వచ్చిన ఓటీపీని ఓటీపీ అడిగిన చోట టైప్ చేయాలి.**
7. **'ఆధార్ డెమోగ్రాఫిక్స్ రివ్యూ'లో అడిగిన వివరాలు పొందుపరచాలి.**




8. **కుల ధృవీకరణ పత్రం పొందడానికి రూ.40 రుసుము చెల్లించాలి.**
9. **ఈ డబ్బు చెల్లించడానికి ఉన్న పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాలి.**
10. **మీ కుల ధృవీకరణ పత్రం పీడీఎఫ్ డౌన్‌లోడ్ అవుతుంది.**
11. **దాన్ని మీరు ప్రింట్ లేదా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.**

# ‘వికసిత్ భారత్.. బంగారు బందరు’

## ఇదే మా లక్ష్యం: మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం (చైతన్య రథం): రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సాధికారతే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బందరులో ఇంటింటి పర్యటన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసాన్ని కూటమి ప్రభుత్వం సరిదిద్దుతోందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో అన్ని రంగాల్లో దేశంతో పోటీ పడుతున్నామని తెలిపారు.



**హామీల అమలు**

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశామని మంత్రి చెప్పారు. మెగా డీఎస్సీ ద్వారా దాదాపు 16 వేల మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు, దాదాపు 8 వేల మందికి పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు కల్పించామన్నారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నామని, పెద్ద ఎత్తున పెట్టుబడులు తెస్తూ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. బందరు మున్సిపాలిటీలో అమృత్ పథకం, 15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రధాన సమస్యగా ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించామని తెలిపారు.

**బందరు పోర్టు, గోవా షిప్‌యార్డ్**

బందరు పోర్టును గోగులేరుకు తరలించేందుకు పేర్ని నాని వంటి వారు స్వార్థ రాజకీయాల కోసం ప్రయత్నించారని మంత్రి ఆరోపించారు. బందరు ప్రజల సహకారంతో పోర్టును సాధించుకున్నామని చెప్పారు. గత ఐదేళ్లలో పోర్టు పనులను పూర్తిగా వెనక్కి నెట్టారని, కూటమి ప్రభుత్వ కృషితో వచ్చే మార్చిలో పోర్టును ప్రారంభించబోతున్నామని తెలిపారు. పోర్టు వల్ల అనేక పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని, స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయని చెప్పారు. పోర్టు ప్రారంభానికి ముందే రూ.8,000 కోట్ల పెట్టుబడితో గోవా షిప్‌యార్డ్ మచిలీపట్నానికి వచ్చిందని, దీని ద్వారా దాదాపు 10,000 మందికి ఉద్యోగాలు లభిస్తాయని మంత్రి చెప్పారు. ఇక్కడ యుద్ధ నౌకలు తయారవుతాయని, దీనికి అనుబంధంగా మరిన్ని పరిశ్రమలు వస్తాయని, అవి భవిష్యత్తులో యువతకు ఉద్యోగాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. రాబోయే కాలంలో రూ.10–15 వేల కోట్ల పెట్టుబడులతో సంస్థలు బందరులో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయని తెలిపారు.

**పర్యాటక అభివృద్ధి**

పర్యాటకాభివృద్ధిలో భాగంగా మంగినపూడి తీరంలో గతంలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించామని, ఇటీవల 63 అడుగుల వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి దేశం దృష్టిని ఆకర్షించామని మంత్రి చెప్పారు. సముద్ర తీరంలో ఇంత ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం దేశంలోనే తొలిసారని ఆయన పేర్కొన్నారు.

**‘బంగారు బందరు’ నినాదం**

బందరు అభివృద్ధికి ప్రజలందరి సహకారం అవసరమని, భవిష్యత్ తరాలు బాగుపడాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని మంత్రి అన్నారు. మచిలీపట్నం రోజురోజుకూ వికసిస్తోందని, ఆ ఫలాలు స్థానికులకే అందాలనే ఉద్దేశంతో ‘బంగారు బందరు’ నినాదాన్ని తీసుకున్నామని చెప్పారు. పర్యటనలో ప్రజలతో ఆ నినాదాన్ని పలికించారు. బందరు అభివృద్ధి కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు.

# రాయలసీమపై వైసీపీకి మాట్లాడే అర్హత లేదు

- **సీమ అభివృద్ధికి పునాది వేసింది ఎన్టీఆర్**
- **ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఉపాధిపై బహిరంగ చర్చకు సిద్ధం**
- **టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్**

అమరావతి: రాయలసీమ అభివృద్ధికి నిజమైన పునాది వేసింది స్వర్గీయ ఎన్టీఆరేనని, ఇప్పుడు సీమపై ప్రేమ చూపిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నేడు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**ఎన్టీఆర్ చొరవతోనే సీమకు ప్రాజెక్టులు**

ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రాకముందే రాయలసీమలో భయంకరమైన కరువు వచ్చిందని, తాగునీరు, తిండి లేక ఆకలి చావులు సంభవించాయని సూర్యప్రకాష్ గుర్తు చేశారు. ఆ సమయంలో సినీ నటుడిగా ఉన్న ఎన్టీఆర్ స్వయంగా జోలె పట్టి విరాళాలు సేకరించి సీమను ఆదుకునేందుకు ప్రయత్నించారని, ఆనాటి పాలకుల కళ్లు తెరిపించేలా సీమ కరువును ప్రపంచానికి చాటారని తెలిపారు. అధికారంలోకి వచ్చాక సీమను శాశ్వతంగా సస్యశ్యామలం చేయాలని సంకల్పించి, తెలుగు గంగ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులకు రూపకల్పన చేసి పనులు ప్రారంభించారని చెప్పారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి "మిగులు జలాలతో ప్రాజెక్టులు కడతారా?" అంటూ కోర్టులకు వెళ్లి అడ్డంకులు సృష్టించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆ ప్రాజెక్టులు ఆగిపోయి ఉంటే ఈరోజు సీమలో గుక్కెడు నీళ్లయినా మిగిలేవా అని నిలదీశారు. సీమ ప్రజల గుండెల్లో నిలిచేది ప్రాజెక్టులు తెచ్చిన ఎన్టీఆరేనని స్పష్టం చేశారు.

**డ్రిప్ ఇరిగేషన్, శాంతిభద్రతలు, హార్టికల్చర్ హబ్**

ఎన్టీఆర్ ప్రారంభించిన ప్రాజెక్టులను చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక వేగవంతం చేశారని సూర్యప్రకాష్ అన్నారు. 2000 సంవత్సరంలో నీటి ఎద్దడి నుంచి రైతులను కాపాడేందుకు డ్రిప్ ఇరిగేషన్‌కు శ్రీకారం చుట్టారని, 200 ఎకరాలతో మొదలైన ఈ పథకం 2019 నాటికి 11 లక్షల హెక్టార్లకు విస్తరించిందని చెప్పారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో సీమలో ఒక్క ఎకరాకైనా డ్రిప్ ఇరిగేషన్ అందలేదని, 2024లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం వచ్చాకే అది పునఃప్రారంభమైందని తెలిపారు. పల్లెల్లో కక్షలు ఉండకూడదనే లక్ష్యంతో చంద్రబాబు నాడు ఫ్యాక్షన్‌ను ఉక్కుపాదంతో అణిచివేశారని, ఆ శాంతిభద్రతల వల్లే సీమ ప్రజలు పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోగలుగుతున్నారని పేర్కొన్నారు.

నారా లోకేష్ పాదయాత్రలో 45 నియోజకవర్గాల్లో పర్యటించి, కడప వేదికగా ‘మిషన్ రాయలసీమ’ డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. ఆ హామీ మేరకు పూర్వోదయ పథకం కింద రూ.40 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ రూ.30 వేల కోట్లు, ప్రైవేట్ పెట్టుబడులు రూ.60 వేల కోట్లతో కలిపి లక్ష కోట్లకు పైగా పెట్టుబడితో మదనపల్లెలో మెగా హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. హైదరాబాద్‌కు హైటెక్ సిటీ ఎలా గేమ్ ఛేంజర్ అయ్యిందో, సీమకు ఈ హబ్ అలా అవుతుందన్నారు. గతంలో హైదరాబాద్‌కు ఐఎస్‌బీ తెస్తే వైఎస్సార్ సహా కాంగ్రెస్ నేతలు ఎద్దేవా చేశారని, ఇప్పుడు సీమకు ‘ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్’ తెస్తుంటే వైసీపీ నేతలు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. సీమ ప్రాజెక్టులపై బహిరంగ చర్చకు తాము సిద్ధమన్నారు. వేదిక, సమయం వైసీపీ నేతలే నిర్ణయించవచ్చని చెప్పారు. 2019–24 మధ్య ప్రాజెక్టులపై ఎంత ఖర్చు చేశారు, 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వం ఎంత ఖర్చు చేసింది, 2024 నుంచి కూటమి ప్రభుత్వం ఎంత ఖర్చు చేసింది అనే వివరాలపై చర్చిద్దామన్నారు. ఐదేళ్లలో అదనంగా ఒక్క ఎకరానికైనా ఆయకట్టు నీరిచ్చారా, వరదల్లో కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టుకు కనీసం ఒక్క పునాది రాయి వేశారా, వరద బాధితులకు ఒక్క ఇల్లయినా కట్టించారా అని ప్రశ్నించారు.

**పరిశ్రమలు, కర్నూలు హైకోర్టు బెంచ్, పంటల బీమా**

రాయలసీమకు పరిశ్రమలు, ఉపాధి తెచ్చిన చరిత్ర టీడీపీదేనని సూర్యప్రకాష్ అన్నారు. అమరరాజా కంపెనీని వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు వేధించి రాష్ట్ర సరిహద్దులు దాటించిందని ఆరోపించారు. కొత్త కంపెనీని తేలేకపోగా ఉన్నవాటిని తరిమేశారన్నారు. చంద్రబాబు కియా పరిశ్రమను తెచ్చి "కరువు సీమలో కార్లు కూడా పండించవచ్చని" నిరూపించారని, కియాతో పాటు పుట్టపర్తిలో ఫైటర్ జెట్ల పరిశ్రమ, రాయల్ ఎన్‌ఫీల్డ్, రిలయన్స్, క్యారియర్, ఎల్‌జీ వంటి సంస్థలను తెచ్చి సీమను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దారని చెప్పారు. కియా యాజమాన్యాన్ని వైసీపీకి చెందిన ఓ ఎంపీ బెదిరించడం వల్ల, దానికి అనుబంధంగా రావాల్సిన 19 పరిశ్రమలు అనంతపురం నుంచి బెంగళూరుకు తరలిపోయాయని ఆరోపించారు. జమ్మలమడుగులో రాయలసీమ స్టీల్ ప్లాంట్‌కు 2021లో ఒకసారి, 2023లో మరోసారి శంకుస్థాపన చేసిన జగన్, ఐదేళ్లలో కనీసం ఒక్క కాంపౌండ్ వాల్ అయినా పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. వైఎస్సార్ ప్రారంభించిన బ్రాహ్మణి స్టీల్స్‌లో ఇప్పటికీ ఉత్పత్తి మొదలు కాలేదన్నారు. వైసీపీ వేసిన పునాది రాళ్లు సమాధి రాళ్లుగా మిగిలిపోతే, టీడీపీ వేసినవి పరిశ్రమలుగా మారి ఉత్పత్తి ప్రారంభించాయని చెప్పారు. కర్నూలులో న్యాయ రాజధాని పెడతానంటూ 2019 డిసెంబర్‌లో మూడు రాజధానుల పేరుతో జగన్ నాటకమాడారని, 2019–24 మధ్య హైకోర్టు కోసం ఒక్క ఇటుక కూడా పెట్టలేదని అన్నారు. ఎన్నికలకు ముందు లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం, మరో మూడు నాలుగు నెలల్లో కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తున్నామని ప్రకటించారు. కేంద్రం మంజూరు చేసిన అమరావతి–అనంతపూర్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేను రద్దు చేయించిన జగన్‌కు సీమ పేరు ఎత్తే నైతిక అర్హత లేదన్నారు.



పంటల బీమా విషయంలోనూ వైసీపీ ప్రభుత్వం రైతులను గాలికొదిలేసిందని సూర్యప్రకాష్ ఆరోపించారు. పీఎంఎఫ్‌బీవై పథకాన్ని రద్దు చేసి సొంత పథకంగా ప్రచారం చేసుకుని, రూ.1,900 కోట్ల ప్రీమియం బకాయిలను రైతులపై వదిలేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఆ బకాయిలను క్లియర్ చేసిందని, కేంద్రంతో చర్చించి 2026–27లో రూ.500 కోట్లు, 2027–28లో రూ.1,000 కోట్లు, 2028–29లో రూ.1,500 కోట్లు చెల్లించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు.

**వివేకా హత్య కేసుపై ప్రశ్నలు**

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును ప్రస్తావిస్తూ, ఆ పార్టీ నేతలకు నీతులు చెప్పే అర్హత లేదని సూర్యప్రకాష్ విమర్శించారు. ఈ కేసులో రూ.40 కోట్ల సుపారీ, మనీ లాండరింగ్ మూలాలను ఈడీ దర్యాప్తు వెలికితీసిందని ఆయన పేర్కొన్నారు. గతంలో అసెంబ్లీలో జగన్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, దీనికి ఆయన ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. అవినాష్ రెడ్డిని అరెస్ట్ చేసేందుకు సీబీఐ వచ్చినప్పుడు కర్నూలు ఆస్పత్రి వద్ద అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. హత్య జరిగిన రోజు ఉదయమే సమాచారం తెలిసినా జగన్ సాయంత్రం వరకు ఘటనా స్థలానికి ఎందుకు వెళ్లలేదని, గొడ్డలిపోటును గుండెపోటుగా ప్రచారం చేశారని, ఎన్నికల ముందు సీబీఐ దర్యాప్తు కోరిన జగన్ ముఖ్యమంత్రి అయ్యాక అదే కోర్టులో వద్దని పిటిషన్ వేశారని విమర్శించారు. వివేకా కుమార్తె సునీత, సతీమణి సౌభాగ్యమ్మ న్యాయం కోసం ఏళ్లుగా పోరాడుతున్నారని, వారి ప్రశ్నలకు జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**మాజీ మంత్రి రోజా విమర్శలకు సమాధానం**

చంద్రబాబుపై మాజీ మంత్రి రోజా చేసిన విమర్శలను సూర్యప్రకాష్ తిప్పికొట్టారు. సీమ అభివృద్ధిపై లెక్కలు, గణాంకాలతో చర్చకు రావాలని, ఆరోపణలు మాని ఆధారాలు చూపాలని సవాల్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏడు రోజుల్లో తొమ్మిది భారీ కార్యక్రమాలు చేపట్టి, రూ.1.80 లక్షల కోట్లకు పైగా విలువైన అభివృద్ధి, సంక్షేమ పనులకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్వయంగా వచ్చి ప్రాజెక్టులు ప్రకటించడం, అనంత్ అంబానీ సీమలో పరిశ్రమలు పెడతామనడం డ్రామాలా కనిపిస్తోందా అని ప్రశ్నించారు. కూటమి గ్రాఫ్ పడిపోయిందన్న రోజా వ్యాఖ్యలపై స్పందిస్తూ, 2024లో వైసీపీకి వచ్చిన 40 శాతం ఓట్లు ఇప్పుడు 35 శాతానికి తగ్గాయని సర్వేలు చెబుతున్నాయన్నారు. రోజా నగరిలో 45 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారని గుర్తు చేశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ విషయంలో టీడీపీపై రోజా చేసిన ఆరోపణలు అవాస్తవమని సూర్యప్రకాష్ అన్నారు. జగన్ అధికారంలో ఉన్న 2020లోనే తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్జీటీ నుంచి స్టే తెచ్చిందని హరీశ్ రావు స్వయంగా చెప్పారని గుర్తు చేశారు. కుప్పానికి నీళ్లిచ్చామని వైసీపీ ప్రచారం చేసుకున్నా, మరుసటి రోజే గేట్లను ఎత్తుకెళ్లారని ఆరోపించారు. ఈవీఎంలపై వైసీపీ ఆరోపణలను ప్రస్తావిస్తూ, ఆ పార్టీ హయాంలో బ్యాలెట్ పేపర్లతో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ప్రజలు టీడీపీ అభ్యర్థులనే గెలిపించారన్నారు. రాయలసీమ ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, వైసీపీ నేతలు సినిమా డైలాగులు ఆపి లెక్కలతో బహిరంగ చర్చకు రావాలని సూర్యప్రకాష్ హెచ్చరించారు.

# స్త్రీశక్తి సూపర్‌హిట్

- 100 కోట్ల ఉచిత ప్రయాణాలు రికార్డ్
- మహిళలపై భారం లేకుండా భరోసా
- కుటుంబాలకు ఆర్థికంగా ప్రయోజనం

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకం మరో కీలక మైలురాయిని దాటింది. మహిళలకు ప్రజా రవాణాను మరింత చేరువ చేయడంతో పాటు వారి ప్రయాణ ఖర్చు భారాన్ని తగ్గించా లనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు ఉచితంగా జారీ చేసిన టికెట్ల సంఖ్య ఏకంగా 100 కోట్ల మార్కు ను దాటింది. ఇంత భారీసంఖ్యలో మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకోవడం.. ఇది కేవలం ప్రభుత్వ పథకంగా కాకుం డా మహిళల రోజువారీ జీవితంలో ఒక అవసరంగా మారుతున్న తీరుకు అద్దం పడుతోంది. ఒక పథకం ప్రారంభించిన తర్వాత దాని ప్రభావాన్ని అంచనా వేయడానికి లబ్ధిదారుల సంఖ్య ఒక్కటే కొలమానం కాదు. దాన్ని ప్రజలు ఎంతగా వినియోగించుకుంటు న్నారు? వారి జీవితంలో అది ఎలాంటి మార్పు తీసుకొస్తోంది? అనే అంశాలూ ముఖ్యమే. స్త్రీ శక్తి విషయంలో 100 కోట్ల ఉచిత ప్రయాణాలు ఆ పథకం వినియోగం ఏ స్థాయిలో ఉందో చెప్పే ప్రధాన సూచికగా నిలుస్తున్నాయి.

### మారుతున్న మహిళల ప్రయాణ చిత్రం

రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు, విద్యార్థినులు, ఉద్యోగినులు స్త్రీ శక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అంటే రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలకు రోజువారీ ప్రయాణం విషయంలో ఒక ఆర్థిక ఊరట అందుతోంది. మహిళల ప్రయాణం అనేది కేవలం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లడంగా చూడలేం. విద్య కోసం కళాశాలకు వెళ్లడం కావచ్చు.. ఉద్యోగం కోసం పట్టణానికి చేరుకోవడం కావచ్చు.. ఆసుపత్రికి వెళ్లడం కావచ్చు.. కుటుంబ అవసరాల కోసం మార్కెట్‌కు వెళ్లడం కావచ్చు.. ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లడం కావచ్చు. అవసరం ఏదైనా ప్రయాణం తప్పనిసరి. అలాంటి ప్రతి ప్రయాణంలో ఖర్చు తగ్గడం కుటుంబానికి ఒక ప్రయోజనమే. ఒకసారి ఆదా అయిన మొత్తం చిన్నదిగా కనిపించినా.. రోజులు, నెలలు, ఏడాది చొప్పున లెక్కిస్తే దాని ప్రభావం గణనీయంగా ఉంటుంది. అందుకే స్త్రీ శక్తి పథకం ప్రభావాన్ని 100 కోట్ల ఉచిత టికెట్ల సంఖ్యతోపాటు.. మహిళల కుటుంబాలపై తగ్గిన ప్రయాణ వ్యయంతోనూ చూడాల్సి ఉంటుంది.

### రూ.3,500 కోట్ల ఆదా.. కుటుంబ బడ్జెట్‌కు ఊరట

ఉచిత టికెట్ల ద్వారా రాష్ట్రంలోని మహిళలకు ఇప్పటివరకు సుమారు రూ.3,500 కోట్ల మేర ప్రయాణ వ్యయం ఆదా అయింది. ఈ సంఖ్యను కేవలం ప్రభుత్వ గణాంకంగా చూడటం కంటే.. మహిళల కుటుంబాల చేతుల్లో మిగిలిన డబ్బుగా చూడటం సముచితం. కుటుంబ బడ్జెట్‌లో ప్రయాణ ఖర్చు కూడా ఒక ముఖ్యమైన భాగమే. ముఖ్యంగా ప్రతిరోజూ ఉద్యోగానికి, చదువుకు లేదా ఇతర అవసరాలకు వెళ్లే వారికి ఈ ఖర్చు నిరం తరం ఉంటుంది.

ఇప్పుడు ఆ మొత్తంలో గణనీయమైన భాగం ఆదా అవుతుండటంతో ఆ డబ్బును కుటుంబంలోని మరో అవసరానికి ఉపయోగించుకునే అవకాశం ఏర్పడుతోంది. పిల్లల చదువు, ఇంటి అవసరాలు, వైద్యం, ఇతర అత్యవసర ఖర్చులు.. ఇలా కుటుంబానికి అవసరమైన చోట ఆ మొత్తాన్ని మళ్లించ వచ్చు. అంటే ఒకవైపు మహిళకు ఉచిత ప్రయాణం అందుతుంటే.. మరోవైపు అదే కుటుంబానికి పరోక్షంగా ఆర్థిక వెసులుబాటు కూడా లభిస్తోంది.




**కరెంట్ అనాలిసిస్**
తెలుసుకుందాం | విశ్లేషిద్దాం | సిద్ధమవుదాం

- జమ్ము సాయికల్యాణ్, అనలిస్ట్, తెలుగుదేశం పార్టీ నాలెడ్జ్ సెంటర్.

### 40 శాతం నుంచి 62 శాతానికి మహిళల వాటా

స్త్రీ శక్తి పథకం తీసుకొచ్చిన మరో ముఖ్యమైన మార్పు ఆర్టీసీ ప్రయాణికుల్లో మహిళల వాటా పెరగడం. ఈ పథకం రాక ముందు బస్సుల్లో మహిళా ప్రయాణికుల వాటా సుమారు 40 శాతంగా ఉండగా.. ప్రస్తుతం అది 62 శాతానికి పైగా పెరిగింది. ఈ మార్పు వెనుక ఉన్న ప్రధాన అంశం మహిళలకు ప్రజా రవా ణా మరింత అందుబాటులోకి రావడమే. ప్రయాణం అవసరం ఉన్నా ఖర్చు కారణంగా కొంత వెనుకడుగు వేసే పరిస్థితి ఉంటే.. ఉచిత ప్రయాణ సదుపాయం ఆ అడ్డంకిని తొలగిస్తుంది.దీంతో మహిళలు బస్సు ప్రయాణాన్ని మరింత విస్తృతంగా వినియోగించు కుంటున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల వాటా పెరగడం.. ప్రజా రవాణా వ్యవస్థ మహిళల రోజువారీ జీవితంలో ఎంత ముఖ్యమైన పాత్ర పోషిస్తుందో కూడా తెలియజేస్తోంది.

### మహిళకు ప్రయాణం అంటే.. ఒక అవకాశం

ప్రయాణం సులభమైనప్పుడు అవకాశాల పరిధి కూడా పెరు గుతుంది. ఇంటికి దగ్గరలో ఉన్న ఉద్యోగం మాత్రమే కాకుండా కొంత దూరంలో ఉన్న ఉద్యోగాన్ని కూడా మహిళ ఆలోచించ గలుగుతుంది. ఇంటి పరిధిలో ఉన్న విద్యాసంస్థ మాత్రమే కాకుండా మరింత దూరంలోని కళాశాలను కూడా ఎంచుకునే అవకాశం ఉంటుంది. అదేవిధంగా వైద్యం, మార్కెట్, ప్రభుత్వ సేవలు వంటి అవసరాలకు కూడా ప్రయాణం చేయడం సులభమవుతుంది. ఈ కోణంలో చూస్తే స్త్రీశక్తి పథకం మహిళల ప్రయాణ ఖర్చును తగ్గించడంతో పాటు.. వారి కదలికకు ఉన్న ఒక ఆర్థిక అడ్డంకిని కూడా తగ్గిస్తోంది. మహిళ బయటకు వెళ్లే ప్రతి ప్రయాణం వెనుక ఒక అవసరం ఉంటుంది. ఆ అవసరాన్ని తీర్చుకునేందుకు ప్రయాణం చేయాల్సిన పరిస్థితిలో రవాణా ఖర్చు భారం కాకపోవడం ఒక ముఖ్యమైన వెసులుబాటు.

### గ్రామీణ మహిళలకు మరింత ఉపయోగకరం

స్త్రీశక్తి పథకం ప్రభావం గ్రామీణ ప్రాంతాల్లో మరింత స్పష్టంగా కనిపించే అవకాశం ఉంది. పట్టణాల్లో ప్రయాణానికి అనేక ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉండొచ్చు. కానీ గ్రామీ ణ ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులే ప్రధాన ప్రజా రవాణా సాధనం. గ్రామం నుంచి మండల కేంద్రానికి, అక్కడి నుంచి జిల్లా కేంద్రాని కి లేదా సమీప పట్టణానికి వెళ్లాల్సిన సందర్భాలు తరచూ ఉంటా యి. చదువు, వైద్యం, ఉద్యోగం, మార్కెట్ అవసరాల కోసం మహిళలు ప్రయాణించాల్సి వస్తుంది. ఇలాంటి సందర్భాల్లో బస్సు ప్రయాణం ఉచితంగా అందుబాటులో ఉండటం కుటుంబానికి ఆర్థికంగా ఊరట కలిగిస్తుంది. ముఖ్యంగా తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలకు ప్రయాణ ఖర్చు కూడా ఒక లెక్కే. ఆ ఖర్చు తగ్గితే ఇతర అవసరాలకు డబ్బును వినియోగించుకునే అవకాశం ఉంటుంది. అందుకే స్త్రీ శక్తి పథకాన్ని మహిళలతో పాటు వారి కుటుంబాల ఆర్థిక స్థితితోనూ అనుసంధానించి చూడాల్సి ఉంటుంది.

### ఆర్టీసీకి ప్రభుత్వం అండగా నిలవడం కీలకం

మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తున్న నేపథ్యంలో ఆర్టీసీపై ఆర్థిక ప్రభావం పడటం సహజం. అయితే ఈ పథకం వల్ల సంస్థపై భారం పడకుండా ప్రభుత్వం ఆర్టీసీకి సకాలంలో రీయింబర్స్‌మెంట్ చేస్తోంది. దీంతో ఒకవైపు మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కొనసాగుతుండగా.. మరోవైపు ఆర్టీసీకి ఆర్థికంగా ఇబ్బంది రాకుండా ప్రభుత్వం అండగా నిలుస్తోంది. సంక్షేమ పథకం విజయవంతంగా అమలవ్వాలంటే లబ్ధిదారులకు ప్రయోజనం అందించడం మాత్రమే కాదు.. ఆ పథకాన్ని అమలు చేసే వ్యవస్థ కూడా బలంగా ఉండాలి. స్త్రీ శక్తి విషయంలో ఆర్టీసీకి అవసరమైన నిధులను అందించడం, పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సర్వీసులను విస్తరించడం అందులో భాగమే.

### ఉచిత ప్రయాణం.. ఆర్థిక సాధికారతకు ఒక అడుగు

మహిళా సాధికారత అంటే కేవలం మహిళలకు ఆర్థిక సహాయం అందించడం మాత్రమే కాదు. ఆమెకు అందుబాటులో ఉన్న అవకాశాలను ఉపయోగించుకునే పరిస్థితులు కల్పించడం కూడా అందులో భాగమే. ఉద్యోగానికి వెళ్లాలంటే ప్రయాణం చేయాలి. విద్య కోసం ప్రయాణం చేయాలి. వ్యాపారం చేయాలన్నా మార్కెట్‌కు చేరుకోవాలి. వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లాలి. అంటే మహిళల జీవితంలో దాదాపు ప్రతి రంగానికీ రవాణా అనుసంధా నమై ఉంటుంది. ఆ ప్రయాణంలో ఆర్థికంగా అయ్యే ఖర్చు తగ్గి తన అవసరాన్ని మరింత స్వేచ్ఛగా తీర్చుకునే అవకాశం ఉంటుం ది. అందుకే స్త్రీ శక్తి పథకాన్ని కేవలం ఉచిత బస్సు ప్రయాణ పథకంగా కాకుండా మహిళల సామాజిక, ఆర్థిక చలనశీలతకు తోడ్పడే చర్యగా కూడా చూడవచ్చు.

### ఆత్మగౌరవంతో ముందుకు వెళ్లే అవకాశం

స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు లభిస్తున్న ప్రయోజనంలో మరో ముఖ్యమైన అంశం ఆత్మగౌరవం. ఒక చిన్న ప్రయాణం కోసం కూడా ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గడం.. అవసరమైనప్పుడు తాను స్వయంగా ప్రయాణించగలగడం.. మహిళకు ఒక రకమైన స్వేచ్ఛను అందిస్తుంది. ఈ మార్పు బయటికి కనిపించే గణాంకాల్లో పూర్తిగా కనిపించకపోవచ్చు. కానీ కుటుంబంలోనూ, సమాజంలోనూ మహిళ కదలిక పెరిగినప్పుడు దాని ప్రభావం క్రమంగా కనిపిస్తుంది. ఒకప్పుడు ప్రయాణ ఖర్చు గురించి ఆలోచించి వాయిదా వేసిన పని ఇప్పుడు సులభంగా పూర్తవుతుంటే.. ఆ మార్పు చిన్నదేమీ కాదు. అందుకే ఉచిత టికె ట్ విలువను దాని ధరతో మాత్రమే కాకుండా అది మహిళకు అందించే అవకాశంతో కూడా కొలవాలి.

### స్త్రీశక్తి పథకానికి 100 కోట్ల మైలురాయి ఒక సంకేతం

100 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తవడం ఒక గణాంక మైలురాయి. అయితే దాని కంటే ముఖ్యమైనది.. ఈ సంఖ్య వెనుక మహిళల నుంచి వచ్చిన స్పందన. రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారంటే.. పథకం వారి అవసరాలకు ఎంత దగ్గరగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అదే సమయంలో పథకం విస్తరిస్తున్న కొద్దీ ప్రభుత్వం ముందున్న బాధ్యత కూడా పెరుగుతుంది. పెరిగిన ప్రయాణికుల సంఖ్యకు తగ్గట్టుగా బస్సుల సంఖ్య పెరగాలి. సేవల నాణ్యత మెరుగుపడాలి. రద్దీ తగ్గాలి. మహిళలకు సౌకర్యవంత మైన, సురక్షితమైన ప్రయాణం అందాలి. గ్రామీణ ప్రాంతాల్లోనూ సర్వీసులు మరింత అందుబాటులోకి రావాలి. అప్పుడే 100 కోట్ల ప్రయాణాల మైలురాయి కేవలం ఒక రికార్డుగా మిగలకుండా.. మహిళల జీవితాల్లో దీర్ఘకాలిక మార్పుకు బలమైన పునాదిగా మారుతుంది.

### మహిళల ప్రయాణానికి భరోసా.. కుటుంబాలకు ఆర్థిక ఊరట

స్త్రీశక్తి పథకంలో అసలు విజయం 100 కోట్ల టికెట్ల సంఖ్యలో మాత్రమే లేదు. ఆ టికెట్ ద్వారా ఒక మహిళ చేరుకున్న ప్రతి గమ్యంలో ఉంది. ఆమె ఆదా చేసిన ప్రతి రూపాయిలో ఉంది. ఆమెకు లభించిన ప్రతి కొత్త అవకాశంలో ఉంది. మహిళల ప్రయాణ ఖర్చును తగ్గిస్తూ.. వారి కదలికకు మరింత స్వేచ్ఛని స్తూ.. కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తూ సాగుతున్న ఈ పథకం 100 కోట్ల మైలురాయిని దాటడం రాష్ట్ర ప్రజా రవాణా చరిత్రలోనూ, మహిళా సంక్షేమ కార్యక్రమాల్లోనూ గుర్తించదగిన పరిణామమే.

# విజయవాడ ఉత్సవ్ 2.0 వైభవాల వెల్లువ!



కృష్ణమ్మ ఒడిలో కొలువైన కనకదుర్గమ్మ కొండ. ఆధ్యాత్మికతను చాటే ఇంద్రకీలాద్రి. చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన వీధులు.కళలకు, సాహిత్యానికి, వ్యాపారానికి చిరునామాగా నిలిచిన బెజవాడ. ఇవన్నీ కలిసిన చోట పండుగ మొదలైతే ఆ సందడి మాటల్లో చెప్పలేనిది. మైసూరు దసరా ఉత్సవాల స్ఫూర్తితో విజయవాడలో ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. విజయవాడ ఉత్సవ్ 2.0 అక్టోబరు 11-20 వరకు, పున్నమి ఘాట్, మాకినేని బసవపున్నయ్య స్టేడియం, సిద్ధార్థ కళాశాల ప్రాంగణాల్లో 10 రోజులు పాటు జరగనుంది. ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్ 2.0' అక్షరాలా రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి దర్పణం పట్టనుంది. గత ఏడాది విజయవంతమైన ప్రయోగానికి కొనసాగింపుగా, ఈ ఏడాది మరింత విస్తృత స్థాయిలో మైసూర్ దసరా వేడుకల స్ఫూర్తితో ఈ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతోపాటు పలువురు ప్రముఖులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ ఉత్సవాలు, కనకదుర్గమ్మ దర్శనానికి హాజరుకానున్నారు. చరిత్రకు, రాజకీయాలకు, కళలకు పుట్టినిల్లయిన బెజవాడ మరోసారి చారిత్రక వేడుకకు ముస్తాబవుతోంది. కృష్ణా తరంగాలపై ప్రతిబింబించే దీపాల వెలుగులు. నగర వీధుల్లో మారుమోగే కళాకారుల ప్రదర్శనలు.. ఆంధ్ర రుచులను పరిచయం చేసే వంటకాల పరిమళాలు. సంప్రదాయాన్ని ప్రతిబింబించే హస్తకళలు..యువత ఉత్సాహం.. కుటుంబాల సందడి ఇవన్నీ ఒక్కచోట చేరితే అదే విజయవాడ ఉత్సవ్ 2.0. గతంలో ఉత్సవాలకు పరిమితమైన బెజవాడ.. ఇప్పుడు ఉత్సవాల ద్వారా తన ప్రత్యేకతను ప్రపంచానికి చాటుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఈ ఉత్స వాలు కేవలం 10 రోజుల వేడుక మాత్రమే కాదు.. ఆంధ్రప్రదేశ్ పర్యాటకరంగానికి, సంస్కృతికి ఇదొక సరికొత్త దిశానిర్దేశం.బెజవాడ కీర్తి కిరీటంలో మరో కలికితు రాయిగా నిలవనున్న ఈ మహోత్సవాన్ని ప్రతిఒక్కరూ ఆస్వాదిస్తూ విజయవంతం చేయాలి. కృష్ణమ్మ సాక్షిగా, దుర్గమ్మ చల్లని దీవెనలతో జరగ బోతున్న విజయవాడ ఉత్సవ్ 2.0' కేవలం ఒక ఉత్సవంగా ముగిసిపోకూడదు. ఇది విజయవాడ నగరాన్ని ఒక అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానం గా నిలబెట్టే దిశగా ఒక శాశ్వతమైన మైలురాయిగా నిలవాలి. ఈ వేడుకల విజయవంతం కోసం ప్రభుత్వం, అధికార యంత్రాంగం, స్థానిక ప్రజా ప్రతినిధులు, నగర ప్రజలు అందరూ సమన్వయం తో ముందుకు సాగితేనే బెజవాడ కీర్తి పతాక విశ్వవ్యాప్తం కాగలదు.

## 600 నుంచి 650 స్టాళ్లలో ఉత్పత్తులను విక్రయించేలా ఏర్పాట్లు

విజయవాడ ఉత్సవ్ 2.0తో వైభవాల వెల్లువ ఆవిష్కరించ బోతున్న సరికొత్త దృశ్యం. 10 రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలు కేవలం వినోద కార్యక్రమాల సమాహారం కాదు. ఒక నగర చరిత్రను ప్రపంచానికి పరిచయం చేసే ప్రయత్నం. తెలుగు సంస్కృతిని నలుదిశలా చాటే అవకాశం. కళాకారుల ప్రతిభకు పట్టం కట్టే వేదిక. ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి కొత్త ఊపిరి పోసే మహత్తర ఆలోచన. ఒకప్పుడు నదుల ఒడ్డున నాగరికతలు వికసించాయి. దేవాలయాల చుట్టూ సంస్కృతులు పరిఢవిల్లాయి. వ్యాపార మార్గాల వెంట నగరాలు అభివృద్ధి చెందాయి. ఇప్పుడు అదే చరిత్రను ఆధునిక ఆర్థిక అవకాశాలతో అనుసంధానించే కాలం ఇది. విజయవాడ ఉత్సవ్ 2.0 ఆ దిశగా వేసే ఒక కీలక అడుగుగా నిలవనున్నది. విశాల దృక్పథంతో విజయవాడ ఉత్స వాన్ని పరిశీలించినప్పుడే దాని అసలైన ప్రాధాన్యం అర్థమవు తుంది. కృష్ణా నది తీరంలోని పున్నమి ఘాట్ ప్రధాన వేదికగా విరాజిల్లనుంది. ఇక్కడ జరిగే శాస్త్రీయ, జానపద నృత్యాలు, సంగీత విభావరిలు, కవిసమ్మేళనాలు రాష్ట్రంలోని సాహిత్య, కళా రంగాల గొప్పతనాన్ని భావితరాలకు చాటి చెప్పనున్నాయి. గ్రామీణ మహిళా సాధికారతకు అద్దం పట్టేలా జాతీయ స్థాయి సరస్ మేళాను ఏర్పాటు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న స్వయం సహాయక సంఘాల డ్వాక్రా మహిళలు తయారు చేసిన అద్భుత మైన చేనేత వస్త్రాలు, హస్తకళలు, ఆర్గానిక్ ఉత్పత్తుల ప్రదర్శన మరియు విక్రయాల కోసం వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 600 నుంచి 650 స్టాళ్లలో ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించే ఏర్పా ట్లు చేస్తున్నట్లు సమాచారం. హస్తకళలు, చేనేత, ఆహార పదార్థాలు, గ్రామీణ ఉత్పత్తులు ఈ మేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఇది స్థానిక మార్కెట్‌కు, చేతివృత్తుల వారికి జీవనోపాధిని ఇస్తుంది. స్థానిక ప్రతిభను వెలికితీసేలా టాలెంట్ షోలు, దాండియా నైట్స్, రుచికరమైన స్థానిక వంటకాలతో ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహించడం ద్వారా అన్ని వర్గాల ప్రజలను ఈ ఉత్సవాలు ఆకట్టుకోనున్నాయి.

## చంద్రబాబు అభివృద్ధి దృక్పథంలో పర్యాటకానికి ప్రాధాన్యం!

ఒకప్పుడు బెజవాడ అంటే వ్యాపార నగరం. ఆ తర్వాత విద్య, వైద్యం, రాజకీయ కార్యకలాపాలకు కేంద్రంగా ఎదిగింది. ఇప్పుడు అమరావతి రాజధాని ప్రాంతానికి గుండెకాయగా, రాష్ట్ర అభివృద్ధికి కీలక నగరంగా కొత్త పాత్ర పోషిస్తోంది.నగర ఉత్సవం కాదు, విజయవాడ బ్రాండ్‌ను ప్రపంచానికి పరిచయం చేసే వేదిక. విజయవాడ పేరు వినగానే తెలుగువారికి ముందుగా గుర్తుకొచ్చేది కనకదుర్గమ్మ. ఇంద్రకీలాద్రిపై అమ్మవారి దర్శనం. నవరాత్రుల్లో వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చే జగన్మాత,భక్తజన సందోహం,కృష్ణానదిలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలు. ఇవన్నీ విజయవాడ దసరాకు ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చాయి.దసరా ఉత్సవాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తారు. ఆలయ దర్శనంతో పాటు నగరాన్ని, పరిసర ప్రాంతాలను సందర్శిస్తారు. ఈ సమయంలో విజయవాడ ఉత్సవ్ వంటి కార్యక్ర మాలు అందుబాటులో ఉంటే పర్యాటకుల అనుభవం మరింత విస్తృతమవుతుంది. భక్తి యాత్రతో పాటు సాంస్కృతిక అనుభూతి.. దేవీ దర్శనంతో పాటు కళా ప్రదర్శన.. కుటుంబసమేతంగా గడిపే సమయంతోపాటు స్థానిక ఆహార రుచులు. ఇలా విజయవాడ సందర్శనను సంపూర్ణ పర్యాటక అనుభవంగా తీర్చిదిద్దవచ్చు. కృష్ణానది విజయవాడకు ప్రకృతి ప్రసాదించిన అపురూపమైన వరం. నదీ తీరంలోని ప్రశాంతత, ప్రకాశం బ్యారేజీ నిర్మాణ వైభవం, పున్నమి ఘాట్ పరిసరాల సౌందర్యం నగరానికి ప్రత్యేక మైన ఆకర్షణగా నిలుస్తున్నాయి.. హస్తకళలు, చేనేత, ఆహార పదార్థాలు, గ్రామీణ ఉత్పత్తులు ఈ మేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. సీయం చంద్రబాబు అభివృద్ధి దృక్పథంలో పర్యాటకానికి ప్రాధాన్యం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి గురించి చర్చించే టప్పుడు సాధారణంగా పరిశ్రమలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఐటీ, వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడుతుంటారు. కానీ పర్యాటక రంగం కూడా ఉపాధి, వ్యాపార అవకాశాలు, ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడగల కీలక రంగం. సీయం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విజయవాడ ఉత్సవ్ 2.0ను మరింత విస్తృతంగా నిర్వహించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల కళా వైవిధ్యాన్ని ఒకే వేదికపై పరి చయం చేయనుంది.

## విజయవాడ నగరాన్ని అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా!

ఈ ఉత్సవాల అసలు ప్రత్యేకత కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాదు. కూటమి ప్రభుత్వం చేపట్టిన ఈ చొరవ వెనుక స్పష్టమైన ఆర్థిక దృక్పథం ఉంది. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా ఆదాయ వనరులను పెంచడం, స్థానిక చిరు వ్యాపారులు, ఆటో కార్మికులు, కళాకారులకు ఉపాధి అవకాశాలను సృష్టించడం ఈ ఉత్సవాల ప్రధాన లక్ష్యం. నాలుగు వేల మందికి పైగా కళాకారుల ప్రదర్శనలు, యువతను ఉత్సాహపరిచే ఫ్లాష్ మాబ్‌లు బెజవాడ వీధులను ఒక నూతన శక్తితో ఉరకలేయనున్నాయి. విజయవాడ ఉత్సవ్ 2.0కు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, పలువురు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రముఖులు, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. విజయవాడ ఉత్సవ్ ఒక రాష్ట్ర పండుగ నుంచి జాతీయ సాంస్కృతిక వేదికగా ఎదుగుతుంది. విజయవాడ పేరు లోనే విజయం ఉంది. కృష్ణమ్మ ప్రవాహంలా నిరంతర చైతన్యం ఉంది. కనకదుర్గమ్మ ఆశీస్సులా ఆధ్యాత్మిక శక్తి ఉంది. ప్రకాశం బ్యారేజీలా అభివృద్ధి దృక్పథం ఉంది. వ్యాపార నగరంగా శ్రమ ఉంది. కళాకారుల నగరంగా సృజన ఉంది. ఇవన్నీ కలిసే విజయవాడ ఉత్సవ్. విజయవాడ ఉత్సవ్ 2.0' కేవలం ఒక ఉత్సవంగా ముగిసిపోకూడదు. ఇది విజయవాడ నగరాన్ని ఒక అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా నిలబెట్టే దిశగా ఒక శాశ్వతమైన మైలురాయిగా నిలవాలి.

- నీరుకొండప్రసాద్

## 'వన్ సిటీ, వన్ సెలబ్రేషన్' అనే నినాదం!

చరిత్ర పుటల్లో నిలిచిన బెజవాడ నేల కేవలం రాజకీయ, వ్యాపార కేంద్రమే కాదు, అదొక అపురూప సాంస్కృతిక ఖజానా. ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన జగన్మాత కనకదుర్గమ్మ దివ్య కటాక్షాలు, పశ్చిమ దిశ నుంచి పరవళ్లు తొక్కుతూ వచ్చే కృష్ణమ్మ పవిత్ర జలాల సవ్వడి ఈ నగరానికి ప్రత్యేక ఆభరణాలు. ఇలాంటి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉన్న విజయవాడ నగరంలో కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'విజయవాడ ఉత్సవ్ 2.0' వేడుకలు కేవలం పండుగ సంబరాలకు మాత్రమే పరిమితం కాలేదు. ఇది నగర బ్రాండ్ ఇమేజ్‌ను పునరుజ్జీవింపజేస్తూ రాష్ట్ర పర్యాటక రంగానికి, స్థానిక ఆర్థిక వ్యవస్థకు సరికొత్త ఊతమిచ్చే ఒక అద్భుతమైన సామాజిక-సాంస్కృతిక పునరుద్ధరణ యజ్ఞం అని చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పర్యాటకశాఖ, స్థానిక యంత్రాంగం సంయుక్తంగా చేపట్టిన ఈ మహా సంబరాలు నగర ప్రజలకే కాక, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే పర్యాటకులకు కనువిందు చేయనున్నాయి.గత కొన్ని సంవత్సరాలుగా వెనుకబడిన పర్యాటక రంగాన్ని గాడిలో పెట్టాలనే సంకల్పంతో, 'వన్ సిటీ, వన్ సెలబ్రేషన్' అనే నినాదంతో ఈ ఉత్సవాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. నగరంలోని అన్ని వర్గాలను కలుపుకుంటూ ప్రతి ఒక్కరూ ఈ వేడుకల్లో భాగస్వామ్యులు కావాలనే ఉద్దేశంతో రూపొందించడం అభినందనీయం.

విజయవాడకు ఒక ప్రత్యేకమైన చరిత్ర ఉంది. వాణిజ్యానికి కేంద్రంగా, ఆధ్యాత్మికతకు నిలయంగా, రాజకీయ-సాంస్కృతిక కార్యకలాపాలకు వేదికగా ఈ నగరం దశాబ్దాలుగా తన ప్రత్యేకతను చాటుకుంటోంది. ఒకవైపు ఇంద్ర కీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ, మరోవైపు కృష్ణమ్మ పరవళ్లు, మధ్యలో ఆధునికతతో విస్తరిస్తున్న మహానగరం.

# సీఐఐ ఎగ్జిబిషన్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు




ఆనందపురం (చైతన్యరథం): గంభీరం ఐఐఎంలో బుధవారం నిర్వహించిన సీఐఐ రీజినల్ సమ్మిట్లో భాగంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషనన్ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు సందర్శించారు. రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్రెడ్డితో కలిసి వివిధ స్టాళ్లను పరిశీలించి, ఉత్పత్తులు, సాంకేతికతలు, ఆవిష్కరణల వివరాలను ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఎగ్జిబిషన్ వివిధ రంగాలకు చెందిన 25 సంస్థలు భాగస్వామ్యమయ్యాయి. హైడ్రాలిక్స్, మెటలర్జీ, తయారీ సాంకేతికత, ఆరోగ్య సంరక్షణ, డెంటల్ సొల్యూషన్స్, అగ్రిటెక్, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం తదితర రంగాల ఉత్పత్తులను ప్రదర్శించారు. అరకు కాఫీ, పొందూరు ఖాదీ, మాడుగుల హల్వా, ఆంధ్ర వుడెన్ టాయ్స్ వంటి ఉత్తరాంధ్ర ప్రత్యేక ఉత్పత్తులకు కూడా చోటు కల్పించారు. స్థానిక ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలను విస్తరించడంతో పాటు పరిశ్రమలు, పెట్టుబడిదారుల మధ్య అనుసంధానానికి ఎగ్జిబిషన్ వేదికగా నిలిచింది. జామి హైడ్రాలిక్స్, జూహి మెటలర్జికల్ ల్యాబ్, డెంటలిజెంట్ డెంటల్ సొల్యూషన్స్, పీబీ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ, అక్రివిస్ హెల్త్కేర్, పీలూన్ అగ్రిఫ్రెష్, మన మన్యం ప్రొడ్యూసర్స్ కంపెనీ తదితర సంస్థలు పాల్గొన్నాయి.

# నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న సీఎంఆర్‌ఎఫ్ : స్పీకర్ అయ్యన్న



నర్సీపట్నం (చైతన్యరథం): తీవ్రమైన అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని ఏడుగురికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.12.39 లక్షల చెక్కులను బుధవారం స్పీకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో 333 మందికి సీఎంఆర్ఎఫ్ కింద రూ.2.90 కోట్ల ఆర్థిక సాయం అందజేశామన్నారు. ఆపదలో ఉన్న ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి సూర్యచంద్ర పాల్గొన్నారు.

# అంగన్వాడీల బలోపేతంతో భావిభారతవానికి నాంది

**●9వ జాతీయ పోషణ మాసోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**



రంపచోడవరం (చైతన్యరథం): అంగన్వాడీలు అంటే భావి భారత పౌరుల తయారీకి నిలయాలు అని రాష్ట్ర శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటి చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రంపచోడవరం ఆదివాసీ వర్తక కేంద్రం సమీపంలో ICDS పథక సంచాలకులు ఉమా అధ్యక్షతన బుధవారం 9వ జాతీయ పోషణామాసోత్స వంలో భాగంగా మన అంగన్వాడీ -మన పోషణ పాఠశాల కార్యక్రమాన్ని ICDS శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమెకు ICDS సిబ్బంది సాదర స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల బలోపేతంలో సామాజిక భాగస్వామ్యం పెంపొందాలన్నారు. మన అంగన్వాడీ - మన బాధ్యత అనే నినాదంతో ప్రత్యేకశ్రద్ధతో ప్రజలు వ్యవహరించాలన్నారు. ఇలాంటి ప్రత్యేక దినోత్సవాల ప్రధాన ఉద్దేశ్యం చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో భాగంగా నిర్వహణ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అంగన్వాడీలు కేవలం ఒక చిన్నారులకే కాకుండా గర్భిణులు, బాలింతలు మరియు పిల్లల్లో పోషకాహార లోపాన్ని నిర్మూ లించడంలో కీలకంగా వ్యవ హరిస్తున్నట్లు పేర్కొన్నారు.

# యానిమేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఎమ్మెల్యే తోయక



పార్వతీపురం (చైతన్యరథం): మన్యం జిల్లా కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన యానిమేటర్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యానిమేటర్లు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, వేతనాలను యానిమేటర్ల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయాలని కోరారు. అలాగే యానిమేటర్లకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, విధుల్లో వినియోగిస్తున్న యాప్‌ల సంఖ్యను తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లి సమస్యలు పరిష్కారమయ్యే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేని యానిమేటర్లు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... యానిమేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటిని పరిష్కరించే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు.

# తీవ్ర వర్షాభావంలోనూ సిరులు కురిపిస్తున్న పట్టిసీమ : మాజీ మంత్రి దేవినేని



విజయవాడ (చైతన్యరథం): తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లోనూ కృష్ణా డెల్టాను పచ్చని పంటలను బ్రతికించిన పట్టిసీమ రైతులను ఆదుకున్నదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గన్నవరం మండలం చికినాల గ్రామంలో పట్టిసీమ నీటితో సాగవుతున్న పంటలను పరిశీలించిన మాజీ మంత్రి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా దేవినేని ఉమ మాట్లాడుతూ.. ఒక నాయకుడి దూరదృష్టి, ముందుచూపు ప్రజలకు ఏ విధంగా మేలు చేస్తుందో చెప్పడానికి పట్టిసీమే ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అకుంఠిత దీక్ష, దార్శనికతకు పట్టిసీమ ప్రాజెక్టు నిదర్శనమని కొనియాడారు. ఇప్పటివరకు పట్టిసీమ ద్వారా సుమారు 500 టీఎంసీల గోదావరి జలాలు కృష్ణా డెల్టాకు చేరాయని తెలిపారు. పట్టిసీమ దండగ.. పంపులు పీకేస్తామని నాడు ప్రకటించిన జగన్ ఇప్పుడు ప్రజలకు ఏం సమాధానం చెబుతారు? అని దేవినేని ఉమ ప్రశ్నించారు. పట్టిసీమపై అసెంబ్లీ సాక్షిగా తమపై ఇష్టారాజ్యంగా విమర్శలు చేసిన వారు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగే ముందు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# విశాఖలో తెలుగింటి ఆడపడుచులకు ఘనంగా శ్రీమంతాలు



విశాఖపట్నం దక్షిణ (చైతన్యరథం): నియోజకవర్గం పరిధిలోని నూతన 32వ వార్డులోని తాడివీధి వీధి కమ్యూనిటీ హాల్‌లో తెలుగుదేశం పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ సీతంరాజు సుధాకర్ సారథ్యంలో, 32వ వార్డు మాజీ కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం అధ్యక్షతన టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు అంగరంగ వైభవంగా శ్రీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ... కులమతాలకు అతీతంగా గర్భిణీ స్త్రీలలో ఆనందాన్ని నింపేలా ప్రతి ఏడాది ఇటువంటి శ్రీమంతాల కార్యక్రమాలను నిర్వహిస్తూ, వారికి అండగా నిలవడం అభినందనీయమని తెలిపారు. గర్భిణీ స్త్రీలకు ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలు ఎదురైనా, వాటిని టీడీపీ నాయకుల ద్వారా సీతంరాజు సుధాకర్ దృష్టికి తీసుకువస్తే, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ వేడుకలో పాల్గొన్న సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ... గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లలకు పౌష్టికాహారం అందేలా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలకు ప్రతి నెల ఉచితంగా సంపూర్ణ పౌష్టికాహార కిట్ (టేక్ హోమ్ రేషన్) అందిస్తున్నట్లు తెలిపారు. కాబోయే తల్లులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గర్భిణీ స్త్రీలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

# పేదలకు పట్టాభిషేకం - మీ చేతికే మీ భూమి

**● విశాఖ పశ్చిమలో 250 మందికి శాశ్వత ఆస్తి పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గణబాబు**



విశాఖ పశ్చిమ (చైతన్యరథం): విశాఖపట్నం పశ్చిమ పరిధిలోని ములగాడ మండలంలోని 58,59,60,61,62,63 వార్డుల్లో సుమారు 250 మంది లబ్ధిదారులకు శాశ్వత రిజిస్ట్రేషన్ ఆస్తి పత్రాలను నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు అందజేశారు. "పేదలకు పట్టాభిషేకం - బాబు హామీ, మీ చేతికే మీ భూమి" కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గంలోని ములగాడ మండలం 58,59,60,61,62,63 వార్డు లబ్ధిదారులకు శాశ్వత రిజిస్టర్డ్ ఆస్తి పత్రాల పంపిణీ కార్యక్రమం ములగాడ ఎంఆర్వో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాఖపట్నం పశ్చిమ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు లబ్ధిదారులకు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ అధికారిక ముద్రతో కూడిన శాశ్వత ఆస్తి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం పేదలకు సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పించేలా పూర్తి స్థాయి రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తోందని తెలిపారు. తాతలు, తండ్రుల కాలం నుంచి భూములపై హక్కుల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో శాశ్వత భరోసా లభించిందన్నారు. నగరంలో పెరుగుతున్న భూముల విలువ వల్ల కలిగే ప్రయోజనం పేద కుటుంబాలకూ అందాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అధికారిక ఆస్తి పత్రాల ఆధారంగా అర్హతలు, నిబంధనల మేరకు బ్యాంకు రుణాలు పొందే అవకాశం ఉంటుందని, పిల్లల ఉన్నత చదువులు, కుటుంబ అవసరాలు, ఆర్థిక పురోగతికి ఇవి తోడ్పడతాయని వివరించారు. పత్రాల తయారీ, పంపిణీ ప్రక్రియలో శ్రమించిన ములగాడ తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలను గణబాబు ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రజా సంక్షేమానికి పెద్దపీట : ఎంపీ శ్రీభరత్



విశాఖపట్నం (చైతన్యరథం): రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని విశాఖ ఎంపీ భరత్ అన్నారు. జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్లో రూ.98 లక్షల ప్రజాధనంతో నిర్మించిన సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే పి. గణబాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. విశాఖ మహానగర పరిధిలో వాహనాల పార్కింగ్, హాల్తో సామాన్యులకు ఉపయోగపడేలా ఈ భవనాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు. శు భకార్యాలకు, సమావేశాలకు అనుకూలంగా నిర్మించారని, ఈ భవనాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొండప్రాంత వాసులందరికీ అందుబాటులో ఉండే విధంగా ఈ భవనాన్ని నిర్మించినట్లు ఎమ్మెల్యే పి గణబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ వర్క్స్ విభాగం ఉన్నతాధికారులు, మాజీ వార్డు కార్పొరేటర్ చిన్నా తదితరులు పాల్గొన్నారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

# ముమ్మిడివరంలో ఘనంగా సేవా జ్యోతి యాత్ర

● ప్రధాని నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజాసేవా ప్రస్థానానికి అభినందనలు



ముమ్మిడివరం (చైతన్యరథం): నియోజకవర్గం మురమళ్లలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వాధినేతగా 25 సంవత్సరాల ప్రజా సేవా ప్రస్థానాన్ని పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) ఆధ్వర్యంలో "సేవా జ్యోతి యాత్ర" ఘనంగా నిర్వహించారు. మురమళ్ల క్యాంపు కార్యాలయం నుంచి మార్కెట్ సెంటర్ వరకు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ర్యాలీగా పాల్గొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అభినందనలు తెలిపారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ... ప్రజా జీవితంలోకి ప్రవేశించి సుమారు 25 సంవత్సరాలుగా దేశ ప్రజలకు విశేష సేవలు అందిస్తున్న నరేంద్ర మోదీ నాయకత్వం దేశానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ దేశ అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ఆయన విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందిస్తున్న సహాయ సహకారాలు ఎంతో కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని, ముమ్మిడివరం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

# భారత్‌ను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలన్నదే ప్రధాని మోదీ ధ్యేయం

● ప్రతి ఒక్కరూ ఆయనకు మద్దతు ఇవ్వాలి : ఎమ్మెల్యే బడేటి చంటి



ఏలూరు (చైతన్యరథం): భారత్‌ను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలనే ధ్యేయంతో ముందుకెళ్తోన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ప్రతిఒక్కరూ సంపూర్ణ మద్దతివ్వాలని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పిలుపునిచ్చారు. దేశాన్ని విశ్వగురువుగా నిలపాలనే లక్ష్యంతో అలుపెరగకుండా శ్రమిస్తోన్న ప్రధాని మోదీ నాయకత్వాన్ని మరింత బలపర్చాలంటూ ఆయన సూచించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ 25 సంవత్సరాల రాజకీయ ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఏలూరు అశోక్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయ ఆవరణలో బుధవారం సేవా సంకల్ప సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, బీజేపీ జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి విక్రమ్ కిషోర్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత వారికి ఆత్మీయ స్వాగతం లభించింది. అనంతరం అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్ ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని తిలకించారు. ప్రసంగం ముగిసిన అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ... ప్రజా సేవలో పాతికేళ్ళ ప్రస్థానాన్ని పూర్తిచేసుకున్న ప్రధాని మోదీ సంకల్పంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అత్యంత సుదీర్ఘకాలం పాటూ ప్రజాసేవకు అంకితమైన ప్రధాని, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆ రాష్ట్రాన్ని ఉన్నత స్థితికి తీసుకెళ్ళిన సందర్భాన్ని ఎమ్మెల్యే గుర్తుచేశారు.

# పేదలకు అండగా నిలుస్తున్న సీఎంఆర్ఎఫ్ : బొండా ఉమా



విజయవాడ (చైతన్యరథం): సెంట్రల్ నియోజకవర్గం 63వ, డివిజన్ రాజీవ్‌నగర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం సమీప గ్రౌండ్ నందు 7 కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.3.20 లక్షల చెక్కులను ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయ నిధి అనే పేరు కూడా పెద్దగా వినిపించేది కాదని, 2024లో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించిన తర్వాత పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సుమారు రూ.9 కోట్ల వరకు ఎల్ఓసీలు, చెక్కులను అందజేశారు. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతోంది. ప్రజలు తమ సమస్యలతో ఎమ్మెల్యే కార్యాలయాన్ని ఆశ్రయించినప్పుడు ప్రతి అర్జీని పరిశీలించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చెక్కులు మంజూరు చేయించి, తిరిగి డివిజన్ స్థాయిలో ప్రజలకు గౌరవప్రదంగా అందజేస్తున్నాం, దీనివల్ల అనేక కుటుంబాల్లో సంతోషం నెలకొంటోందని ఎమ్మెల్యే బొండా ఉమా పేర్కొన్నారు.

# చింతమనేని సమక్షంలో టీడీపీలో చేరిన 50 వైసీపీ కుటుంబాలు

●పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



దెందులూరు (చైతన్యరథం): దెందులూరు నియోజకవర్గంలో వైసీపీకి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక సంక్షేమ పాలన, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ నాయకత్వంలో జరుగుతున్న గ్రామీణాభివృద్ధిని చూసి ఆకర్షితులైన దెందులూరు మండలం దోసపాడు గ్రామానికి చెందిన దాదాపు 50 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. బుధవారం దోసపాడు గ్రామంలో నిర్వహించిన చేరికల సభలో శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ స్వయంగా పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీలో చేరిన ప్రతి కుటుంబం మాకు ఎంతో కీలకమని, పార్టీలో పాత-కొత్త అనే తారతమ్యాలు లేకుండా అందరినీ సొంత కుటుంబ సభ్యుల్లా గౌరవించి సముచిత స్థానం కల్పిస్తామని స్పష్టం చేశారు. గతంలో తవ్వకాలు జరిపి అర్ధాంతరంగా నిలిచిపోయిన దోసపాడు నుంచి గుండుగొలను వరకు ఉన్న రోడ్డును వెడల్పు చేసి, పూర్తిస్థాయిలో డబుల్ రోడ్డుగా నిర్మించి ప్రజల రుణం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వ హయాంలో, తాను ఎమ్మెల్యేగా ఉండగానే ఈ రహదారి పనులను నూటికి నూరు శాతం పూర్తి చేసి ప్రజలకుఅంకితం చేస్తానని తెలిపారు. గ్రామంలో రాబోయే రోజుల్లో మంజూరయ్యే నూతన పింఛన్లను ఎటువంటి రాజకీయ పక్షపాతం లేకుండా, ఐకమత్యంతో నిరుపేదలు, అర్హులైన వారికే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి ఆదుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

# పల్లె పండుగ 3.0తో గ్రామాలకు కొత్త రహదారులు: గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గుడివాడ (చైతన్యరథం): గుడివాడ నియోజకవర్గంలోని గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి పల్లె పండుగ 3.0 కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. గుడివాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పండుగ 3.0 నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శంకుస్థాపన చేశారు. సైదేపూడి గ్రామంలో రూ.55 లక్షలతో చేపట్టనున్న మోటారు--సైదేపూడి బీటీ రోడ్డు, గుంటాకోడూరు గ్రామంలో రూ.44 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు అభివృద్ధి పనులను గ్రామస్తులతో కలిసి భూమిపూజ చేసి ప్రారంభించారు. దశాబ్దాలుగా రహదారుల సమస్యతో ఇబ్బందులు పడుతున్న తమ గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించినందుకు కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే రాముకు కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి పనుల శంకుస్థాపన అనంతరం ఆయా గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే రాము స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైదేపూడి గ్రామంలో పంచాయతీ చెరువు సమస్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన గ్రామస్తులతో కలిసి ద్విచక్ర వాహనంపై చెరువును స్వయంగా పరిశీలించారు.

# విజయవాడ ఉత్సవ్ 2.0 ప్రచారానికి రవాణా రంగం అండ

●కృష్ణా జిల్లా, ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్లకు ఎంపీ కేశినేని చిన్ని అభినందనలు



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ ఉత్సవ్ 2.0ను మరింత విస్తృత స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్లు చేస్తున్న ప్రచార కార్యక్రమాలను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) లారీ ఓనర్స్ అసోసియేషన్ వారి కార్యాలయం వేదికగా జరిగిన సమావేశము లో అభినందించారు.విజయవాడ ఉత్సవ్ 2.0 ప్రచారంలో భాగంగా ప్రతి రవాణా వాహనంపై ఉత్సవ్ ప్రచార స్టిక్కర్లను ప్రదర్శిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు లారీ యజమానులు చేస్తున్న కృషి అభినందనీయమని ఎంపీ చిన్ని పేర్కొన్నారు. రవాణా వాహనాలు నగరంతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తుండటంతో, వాటిపై ఉత్సవ్ ప్రచార స్టిక్కర్లు ఏర్పాటు చేయడం ద్వారా విజయవాడ ఉత్సవ్ సందేశం మరింత విస్తృతంగా ప్రజల్లోకి చేరుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని స్వయంగా ఆర్టీసీ బస్సుపై విజయవాడ ఉత్సవ్ 2.0 ప్రచార స్టిక్కర్‌ను అంటించారు. విజయవాడ ఉత్సవ్‌ను ప్రజలందరి పండుగగా తీర్చిదిద్దేందుకు వివిధ వర్గాలు స్వచ్ఛందంగా ముందుకు రావడం సంతోషకరమన్నారు. "విజయవాడ ఉత్సవ్ 2.0ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లడంలో రవాణా రంగం భాగస్వామ్యం ఎంతో కీలకం. ప్రతి వాహనంపై ఉత్సవ్ ప్రచార స్టిక్కర్‌ను ప్రదర్శిస్తూ వారు చేస్తున్న ప్రచారం ద్వారా విజయవాడ సంస్కృతి, ఆధ్యాత్మిక వైభవం, ఉత్సవాల సందేశం రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లోకి వెళ్తుంది. ఈ కృషి చేస్తున్న కృష్ణా జిల్లా, ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్లకు ప్రత్యేకంగా అభినందనలు" అని ఎంపీ చిన్ని తెలిపారు.విజయవాడ ఉత్సవ్ 2.0ను విజయవంతం చేయడంలో వ్యాపార, రవాణా, పారిశ్రామిక, విద్యా, సాంస్కృతిక రంగాలతో పాటు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీ చిన్ని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో విజయవాడ ఉత్సవ్ 2.0ను రాష్ట్రంలోనే ఒక ప్రత్యేక సాంస్కృతిక ఉత్సవంగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.

# ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): ప్రస్తుత ఆహారపు అలవాట్ల కారణంగా క్యాన్సర్ మహమ్మారి ప్రజలకు ముప్పుగా పరిణమించిందని, దీనికి ఉచితంగా పరీక్షలు నిర్వహించడం సంతోషకరమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం స్థానిక అంజుమన్ పాఠశాలలో కిమ్స్ శిఖర హాస్పిటల్ వారి సహకారంతో ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ... క్యాన్సర్ ప్రమాదకారి అని, ముందుగా గుర్తించకపోతే ఇబ్బందిగా మారుతుందని చెప్పారు. సుమారు రూ.7 వేల వరకు ఖర్చయ్యే పరీక్షలను ఉచితంగా నిర్వహించారన్నారు. వైద్య శిబిరంలో సుమారు 120 మంది వరకు వైద్య సేవలు పొందారని తెలిపారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో అత్యాధునిక వైద్య సేవలను పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.

## సేవాజ్యోతి యాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

●గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయం వద్ద నుండి బైక్ ర్యాలీ ప్రారంభం



గుంటూరు (చైతన్యరథం): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన 'సేవాజ్యోతి యాత్ర' బైక్ ర్యాలీని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి బుధవారం ఘనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను గుర్తు చేస్తూ చేపట్టిన కార్యక్రమం తెలుగుయువత, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బైక్ ర్యాలీని శ్రీనివాసరావుపేటలోని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే గళ్ళా మాధవి సేవాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం యువతతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ నగరంలోని ప్రధాన వీధుల గుండా లక్ష్మీపురంలోని మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వానికి మద్దతు తెలుపుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... దేశాభివృద్ధి, సుపరిపాలన, సేవా తత్వానికి ప్రతీకగా నిలిచిన ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, దేశాన్ని అభివృద్ధి చెందిన భారతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

## గుడివాడకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే నా లక్ష్యం :ఎమ్మెల్యే రాము



గుడివాడ (చైతన్యరథం): మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి, వారి ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం ద్వారా ఆర్థికంగా మరింత బలోపేతం చేయాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడివాడ ప్రజావేదిక కార్యాలయంలో పట్టణ పరిధిలోని మున్సిపల్ ఆర్పీలు, సమైక్యాల కమిటీ సభ్యులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సమైక్య ప్రతినిధులతో ఎమ్మెల్యే రాము ముఖాముఖిగా మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రస్తుతం చేపడుతున్న కార్యకలాపాలు, ఉత్పత్తుల తయారీ, విక్రయాలపై వివరాలు తెలుసుకున్నారు. మహిళల ఆర్థిక ప్రగతికి అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా అవసరమైన సహకారం అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. మహిళా సంఘాల అభ్యున్నతికి తన నుంచి ఎలాంటి సహాయం అవసరమో స్పష్టంగా తెలియజేయాలని కోరారు. సమైక్య ప్రతినిధులు పలువురు స్వయం సహాయక సంఘాల సభ్యులు సాధించిన విజయాలను ఎమ్మెల్యేకు వివరించారు. సభ్యులు స్వయంగా తయారు చేసిన వివిధ ఉత్పత్తులను ఎమ్మెల్యే పరిశీలించి, వారి కృషిని అభినందించారు. ఉత్పత్తుల నాణ్యత, ప్యాకేజింగ్, మార్కెటింగ్ విధానాలపై కూడా చర్చించారు. మహిళా సంఘాల ఉత్పత్తులను మరింత విస్తృత మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు పక్కా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వారం రోజుల్లో మరో సమావేశం నిర్వహించి, అప్పటికి ఉత్పత్తులు, తయారీ సామర్థ్యం, మార్కెటింగ్ అవకాశాలు, అవసరమైన యంత్రాలు, శిక్షణ తదితర అంశాలపై సమగ్ర ప్రణాళికతో రావాలని సమైక్య ప్రతినిధులకు సూచించారు. ఈ సందర్భంగా మెప్మా ఆర్పీలు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే రాముకు అందజేశారు.

## సేవా జ్యోతి యాత్ర చేపట్టిన ఎమ్మెల్యే బూర్ల రామంజనేయులు

● ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అభినందనలు



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు 47వ డివిజన్ గోరంట్ల నందు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం నందు ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అభినందనలు తెలియజేస్తూ నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం "సేవా జ్యోతి యాత్ర"లో ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే జ్యోతిని వెలిగించి సేవా సంకల్పాన్ని చాటారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నుండి చిల్లీస్ సెంటర్ వద్ద నందమూరి తారక రామారావు విగ్రహం వరకు సేవా జ్యోతి యాత్ర నిర్వహించారు. అనంతరం మహనీయులు ఎన్టీఆర్, వంగవీటి రంగా, బి.పి మండల విగ్రహాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ... భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. దేశ ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు, ప్రపంచ స్థాయిలో భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులు, అభివృద్ధి అవకాశాలు రావడంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివని బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు.

## అన్ స్టాపబుల్ ప్రధాని మోదీకి అభినందనలు : మంత్రి కొలుసు పార్థసారథి



నూజివీడు (చైతన్యరథం): గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నేటికి పాతికేళ్లు పూర్తిచేసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. బీజేపీలో అతి సామాన్యంగా మొదలైన ఆయన రాజకీయ ప్రయాణంలో అంచెలంచెలుగా ఎదిగి భావి భారతీయులకు ఆదర్శప్రాయులుగా నిలిచారని అన్నారు. మీ పట్టుదల, కృషి, క్రమశిక్షణ, ప్రజాసేవ పట్ల అంకితభావం మీ వ్యక్తిత్వానికి నిదర్శనమని, 2001 నుండి 2014 వరకు వరుసగా 4సార్లు హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా మీరు ఎన్నో మైలురాళ్లను దాటారని అన్నారు. అఖండ భారతావనికి ప్రధానమంత్రిగా 2014లో బాధ్యతలు చేపట్టి ఈ దేశంలోనే అత్యధిక సమయం ప్రధానమంత్రిగా సేవలందించిన వారిగా రికార్డు సృష్టించిన ఆయన ప్రయాణం అన్ స్టాపబుల్.... హ్యాట్రిక్ సీఎం, హ్యాట్రిక్ పీఎంగా దేశ చరిత్రలో మీరు చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. వికసిత్ భారత వైపు మన దేశాన్ని నడిపిస్తూ, ఎన్నో అవాంతరాలను అధిగమిస్తూ ఎన్డీయే అంటే మోదీ, మోదీ అంటే ఎన్డీయే అని ఈ దేశ రాజకీయ పటం మీద చెరగని ముద్ర వేశారని మంత్రి కొలుసు పార్థసారథి కొనియాడారు. ఈ దేశానికి మరెన్నో సేవలందించేలా దీవించాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని మంత్రి అన్నారు.

## వినుకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఘనంగా మెగా జాబ్ మేళా : చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చీఫ్ విప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ప్రభుత్వ చీఫ్ విప్, జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. అనంతరం జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఏటా వినుకొండలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తామని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మేళాలో 46 ప్రముఖ కంపెనీలు పాల్గొని అవకాశాలు కల్పించడం అభినందనీయమని పేర్కొంటూ కంపెనీల ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థులకు ఆయన చేతుల మీదుగా ఉద్యోగ ఆఫర్ లెటర్లను అందజేశారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్త సంక్షేమమే మన తొలి ప్రాధాన్యత

● టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు



అమరావతి (చైతన్యరథం): తన మాన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడటానికి ముందుకు వచ్చి మన కోసం, మనలో ఒకడిగా, మన తోనే ఉంటూ మనం గెలిస్తే తను గెలిచినట్లు సంబరాలు జరుపుకునే సగటు కార్యకర్త యొక్క సంక్షేమమే మన తొలి ప్రాధాన్యత కావాలని తెలుగుదేశం పార్టీ, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు తెలిపారు.

**నిబద్ధతకు నిలువుటద్దం టీడీపీ కార్యకర్త**

నందమూరి తారక రామారావు సమున్నత సంకల్పంతో స్థాపించిన తెలుగుదేశం పార్టీకి కార్యకర్త అసలైన అధినేత అని, పార్టీ నాయకత్వం తనకు అప్పగించిన పనిని జై తెలుగుదేశం..... జై జై తెలుగుదేశం అని నినదిస్తూ, క్రమశిక్షణతో పూర్తి చేసి, ప్రజాభిమానం చూరగొనే టిడిపి కార్యకర్త నిబద్ధతకు నిలువుటద్దం అని కొనియాడారు. మన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆనిర్దేశించిన మేరకు ఈరోజు 50, 51, 52, 53 బూతుల పరిధిలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశాన్ని స్థానిక 18 వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు ఆధ్వర్యంలో సుహృద్భావ వాతావరణంలో నిర్వహించడం జరిగింది.

**స్థానిక సంస్థలలో గెలుపే లక్ష్యంగా ముందుకెళదాం**

భారత రాజ్యాంగాన్ని అనుసరించి ఏర్పాటైన గ్రామ పంచాయతీలు మరియు పురపాలక సంఘాలతోనే క్షేత్రస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారు, అటువంటి స్థానిక సంస్థలకు ఎన్నికైన పాలకవర్గాలు లేకపోతే కేంద్ర ప్రభుత్వం నుండి రావలసిన ఆర్థిక సంఘం నిధులు, గ్రాంట్లు నిలిచిపోతాయని, దానివలన అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం కష్టమవుతుంది అని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా సేవకు గుర్తుగా తాడిగడపలో సేవా జ్యోతి యాత్ర : ఎమ్మెల్యే బోడే ప్రసాద్



పెనమలూరు (చైతన్యరథం): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ప్రజా సేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా జ్యోతి యాత్రలో భాగంగా తాడిగడప మున్సిపాలిటీలో పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడేప్రసాద్ ఆధ్వర్యంలో సేవాజ్యోతి యాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడేప్రసాద్ మాట్లాడుతూ... 25 ఏళ్లుగా ప్రజా సేవకు అంకితమైన ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్థానం దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశ అభివృద్ధితో పాటు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం ప్రశంసనీయమన్నారు. పోలవరం ప్రాజెక్టు,రైల్వే ప్రాజెక్టులు, అమరావతి రాజధాని అభివృద్ధి, జాతీయ రహదారులు, వివిధ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రానికి కేంద్రం అందిస్తున్న సహకారం ఎంతో కీలకమని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పేర్కొన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం... రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం... సమన్వయంతో పనిచేస్తూ ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నాయని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతి కుటుంబానికి మరింత చేరువ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# వైసీపీకి ఒక్క స్థానం కూడా దక్కనివ్వొద్దు

**పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు, క్యాంప్ కార్యాలయంలో పార్టీ నేతలతో సమావేశం, ప్రజా దర్బార్, పాఠశాల నూతన కమిటీలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు**



రాప్తాడు (చైతన్యరథం): గతంలో ఒక్క ఛాన్స్ అంటూ వైసీపీ అధికారంలోకి వచ్చి వ్యవస్థలను నాశనం చేసిందని.. అలాంటి పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా రాకూడదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆమె నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల గురించి ప్రధానంగా చర్చించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో మరింత క్రియాశీలకంగా పని చేయాలని సూచించారు. నాయకులంతా విభేదాలు పక్కనబెట్టి కలిసికట్టుగా పనిచేయాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే మన లక్ష్యం కావాలని స్పష్టం చేశారు. అన్ని స్థానాల్లో మన కూటమి జెండా ఎగిరేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు.ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ఎక్కడా నిర్లక్ష్యం వహించవద్దని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. తన క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. ముఖ్యంగా రెవెన్యూ, విద్యుత్, తాగునీరు, గ్రామాల్లోని మౌలిక వసతులకు సంబంధించిన పలు సమస్యలను ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకొస్తూ అర్జీలు సమర్పించారు. ప్రజల ఇబ్బందులను తెలుసుకుంటూ కొన్నింటికి తక్షణమే పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ఎక్కడా రాజీ పడకూడదని, అర్జీ అందిన వెంటనే సానుకూలంగా స్పందించి పరిష్కారం చూపాలని ఆదేశించారు. విధుల్లో ఎక్కడైనా నిర్లక్ష్యం కనిపిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎంపికైన నూతన కమిటీకు ఎమ్మెల్యే పరిటాల సునీత శుభాకాంక్షలు తెలియజేశారు. చైర్మన్ గా ఎన్నికైన మండల బొమ్మయ్య, వైస్ ఛైర్మెన్ జి.లక్ష్మి, అలాగే ఆత్మకూరు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కళాశాల, పాఠశాల కమిటీ చైర్మన్ గా ఎన్నికైన మజ్జిగ లత, వైస్ చైర్మన్ మంజుల లు క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి శాలువాలు కప్పి, మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే సునీత అన్నారు. ఆయన తీసుకొచ్చిన సంస్కరణలకు అనుగుణంగా నూతన కమిటీలు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తుల సహకారంతో ముందుకెళ్లాలన్నారు.

# నెల్లూరు రూరల్లో రూ. 966 కోట్లతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి వెల్లడి



నెల్లూరు రూరల్ (చైతన్యరథం): నియోజకవర్గంలోని 1, 2, 12, 17, డివిజన్లలో 2.50 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ప్రాంతంలో కూడా రోడ్లు, కాలువలు, కరెంట్, మంచినీటి సౌకర్యం, స్మశానాలు, పార్కులు వివిధ అభివృద్ధి పనులు, కేవలం రెండు సంవత్సరాల రెండు నెలల్లో 966 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను మనం సాధించుకున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులు, యువనేత నారా లోకేష్ మంత్రులు అటు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, కలెక్టర్, నగర కమిషనర్ సహాయ సహకారాలతో అభివృద్ధి పనులు చేసుకోగలిగాం. మన్నారు. ఏ మూలకు వెళ్లినా, ఏ వీధికి వెళ్లినా సగర్వంగా తల ఎత్తుకుని ఆత్మవిశ్వాసంతో 'ఈ ప్రాంతానికి ఈ పని చేశాను' అని చెప్పుకునే స్థితిని నాకు కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆ భగవంతుడికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇక సిరులసీమగా రాయలసీమ : ఎమ్మెల్యే సునీత




రాప్తాడు (చైతన్యరథం): కరవు సీమ రాయలసీమను సిరుల సీమగా మార్చే లక్ష్యంతో చేపడుతున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా ఉద్యాన రైతులకు కొత్త అవకాశాలు కల్పించడం, సాగును మరింత లాభసాటిగా మార్చడం, రాయలసీమ పండ్లను ప్రపంచ మార్కెట్‌కు తీసుకెళ్లడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే పరిటాల సునీత వెల్లడించారు. రైతుల భవిష్యత్‌కు అండగా నిలిచే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయడంతో పాటు, ఉద్యాన రైతులకు మేలు చేసే పలు కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు రాప్తాడు నియోజకవర్గం, గంగులకుంట గ్రామ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో రైతులతో సమావేశం నిర్వహించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాయలసీమ రైజింగ్‌లో భాగంగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, రైతులకు అందుబాటులోకి రానున్న అవకాశాలను రైతులకు వివరించారు. రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ రాయలసీమను వ్యవసాయ ఆధారిత ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



# రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం

**అధికారులతో మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు**

మడకశిర (చైతన్యరథం): నియోజకవర్గ ప్రజలకు నిరంతరం పరిశుభ్రమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా చేపట్టిన ఎన్నెస్ఆర్డీడబ్ల్యుఎస్ పథకం పనితీరుపై బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు, టిటిడి బోర్డు మెంబర్, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి బాలల హక్కు పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాస్ మూర్తి ఒక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీ నారాయణ ఇందులో పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు.దపంపులు, పైప్‌లైన్ల పనితీరును మెరుగుపరచి తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ విజయలక్ష్మి, ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, గ్రామీణ నీటి సరఫరా విభాగం సిబ్బంది, ఇతర శాఖల అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.



# ఆదర్శ పాలకుడు ప్రధాని మోదీ : ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు (చైతన్యరథం): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా 'సేవా జ్యోతి యాత్ర'ను నిర్వహిస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. బుధవారం కోవూరులో నిర్వహించిన సేవా జ్యోతి యాత్ర ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. భావి తరాల భవిష్యత్తు, దేశ భవిష్యత్తు కోసం ప్రధాని మోదీ ఎంతో శ్రమిస్తున్నారని తెలిపారు. ఆయనతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని అన్నారు. ప్రజాసేవలో ఎక్కువ కాలం ఉండటం వేరు.. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడం వేరుదేశం కోసం జీవితాన్నే అంకితం చేసిన నాయకులు చాలా మంది ఉన్నారని, వారిలో నరేంద్ర మోదీ ఒకరని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ప్రజా జీవితంలో ఎక్కువ కాలం ఉండటం వేరని, ప్రజల జీవితాల్లో ఎక్కువ మార్పులు తీసుకురావడం వేరని అన్నారు. ఈ రెండింటి మధ్య ఉన్న స్పష్టమైన తేడాను అర్థం చేసుకోవాలంటే మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని తెలిపారు. వంటింట్లో మహిళల కష్టాల నుంచి దేశ సరిహద్దుల్లో శత్రువులపై క్షిపణులతో నిప్పులు కురిపించడం వరకు మోదీ నాయకత్వంలో దేశం అనేక మార్పులను చూసిందని ఎమ్మెల్యే అన్నారు. భారతదేశ మహిళల సింధూరాన్ని కాపాడటం కూడా తెలిసిన నాయకుడు మోదీ అని పేర్కొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

**తిరుపతి జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ నూకసాని**

రైల్వే కోడూరు (చైతన్యరథం): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని, గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతం కంటే ఈ ఎన్నికల్లో కూటమి ఓట్ల శాతాన్ని గణనీయంగా పెంచాలని తిరుపతి జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ పిలుపునిచ్చారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశానికి నూకసాని బాలాజీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ బాబు ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా ఎన్నికల ఇన్‌చార్జిగా నియోజకవర్గాల్లో పర్యటిస్తూ పార్టీ పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు.





### ఏపీ అభివృద్ధి ప్రయాణంలో

# ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలి

- టీమ్‌లతో మూడునెలలకోసారి జూమ్ సమావేశంలో మాట్లాడతా
- మంత్రి నారా లోకేష్‌తో గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడు గురురాజా భేటీ

అమరావతి(చైతన్యరథం): విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌తో ఉండవల్లి నివాసంలో బుధవారం గ్లోబల్ ఎన్నారై టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ పిల్లి గురురాజా భేటీ అయ్యారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు డయాస్పోరాతో అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడంపై వారు చర్చించారు. ఎన్నారైలు తెలుగుదేశం పార్టీతో పాటు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణం లోనూ ముఖ్యమైన భాగమని లోకేష్ పేర్కొన్నారు. ఎన్నారై కమిటీలు, సభ్యత్వాన్ని త్వరగా పూర్తి చేయడం, ప్రవాసాంధ్రులు-ఎమ్మెల్యేలు-పార్టీ మధ్య బలమైన సంస్థాగత నిర్మాణం ఏర్పాటుపై దృష్టి సారించాలని సూచించారు. ఎన్నారై టీడీపీ టీమ్‌లతో మూడునెలలకోసారి తాను జూమ్ సమావేశాల ద్వారా కనెక్ట్ అవుతానని తెలిపారు. పార్టీ ఎమ్మెల్యేలు కూడా ప్రవాసులతో నిరంతరం టచ్‌లో ఉంటూ వారి నియోజకవర్గాలు, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములను చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా విదేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలుగు ప్రజలకు ఎన్నారై టీడీపీ విభాగం అండగా నిలవాలని కోరారు. తెలుగు ప్రజలు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా తమ ప్రజాప్రతినిధులు, రాష్ట్రంతో అనుసంధానమై సమగ్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

### మోదీ 25 ఏళ్ల ప్రస్థానంపై

## వాషింగ్టన్ తెలుగు సమితి ప్రశంసల వర్షం



**అమెరికా:** భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా నాయకత్వ సేవలను పూర్తి చేసుకున్న ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని వాషింగ్టన్ తెలుగు సమితి (డబ్ల్యూఏటీఎస్) తరపున ప్రతినిధులు అభినందనలు తెలిపారు. గడచిన 25 ఏళ్లలో భారతదేశం ముఖ్యంగా మోదీ హయాంలో అనేక రంగాలలో అద్భుతమైన మార్పు లను చూసిందని పేర్కొన్నారు. డిజిటల్ టెక్నాలజీ, నూత న ఆవిష్కరణలు, మౌలికవసతులు, ఆర్థిక వృద్ధి, పౌరుల ను కేంద్రీకరించిన డిజిటల్ సేవలలో గణనీయమైన వృద్ధి సాధించిందని కొనియాడారు. డిజిటల్ ఇండియా, యూపీఐ వంటి కార్యక్రమాలు మరింత అను సంధానించిన, డిజిటల్ పరంగా సాధికారత సాధించిన భారతదేశా న్ని రూపొందించడంలో ఎంతో కీలకమైన పాత్ర పోషించాయని ప్రశంసించారు. ఈ కీలక మైలురాయిని చేరుకు న్న సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయ పూర్వక అభినందనలు తెలియజేశారు. అలాగే ఆయన చేసిన 25 ఏళ్ల ప్రజా సేవలు, నాయకత్వాన్ని ప్రత్యేకంగా అభినందించారు. భారతీయ-అమెరికన్ కమ్యూనిటీ సభ్యులుగా భారతదేశం సాధిస్తున్న నిరంతర అభివృద్ధిని, అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతున్న ప్రాముఖ్యతను చూసి తాము గర్విస్తున్నట్లు తెలిపారు. జ్ఞానం, ఆవిష్కరణలు, సంస్కృతి, సామాజిక భాగస్వామ్యం ద్వారా భారత్-అమెరికా దేశాల మధ్య ఉన్న వారధిని మరింత బలోపేతం చేయడానికి తాము ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు.

### వల్లభ మహాగణపతి టెంపుల్‌లో

## దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

అమెరికా: కాలిఫోర్నియా రాష్ట్రం బే ఏరియాలోని సాన్ మార్టిన్ నగరంలో వల్లభ మహా గణపతి టెంపుల్ (వైదిక విద్యా గణపతి సెంటర్) ఆధ్వర్యంలో అక్టోబరు 20న విజయదశమి నవరాత్రి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ దసరా వేడుకలను భక్తులం దరూ కుటుంబ సమేతంగా వచ్చి తిలకించాలని నిర్వాహ కులు ఆహ్వానించారు. అక్టోబరు 20న సాయంత్రం 7:00 గంటలకు ప్రత్యేక రథయాత్రతో ఈ వేడుకలు ప్రారంభమవుతాయి. రాత్రి 7:30 గంటలకు చిన్నారులచే రామలీల ప్రదర్శన, 7:45 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 8:00 గంటలకు రావణ దహనం నిర్వహించనున్నారు. వివరాలకు జస్వీర్ సింగ్: 408-843-0711, సత్నామ్ సత్తి: 408-726-1053, కుల్బీర్ హండా (చైర్మన్): 408-769-0766ను సంప్రదించవచ్చు.

# లాస్‌ఏంజెల్స్‌లో హిందీ దివస్ వేడుకలు





**అమెరికా:** లాస్ ఏంజెల్స్‌లో ఉన్న భారత కాన్సులేట్ కార్యాలయంలో 'హిందీ దివస్ 2026' వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. కాన్సులేట్ ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు, హిందీ ఉపాధ్యాయులు, భారతీయ-అమెరికన్ కమ్యూనిటీ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తరతరాలుగా సమాజాలను, సంస్కృతులను అనుసంధానించే హిందీ భాష ప్రాముఖ్యతను ఈ వేడుకలు ఘనంగా చాటాయి. అమెరికాలో హిందీ భాషాభివృద్ధికి, దాని అభ్యాసనకు కృషి చేస్తున్న యువ విద్యార్థులు, విద్యా వేత్తలను ఈ వేదికపై ఏకం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాన్సుల్ జనరల్ కె.జె.శ్రీనివాస మాట్లాడుతూ భారతీయ ప్రవాస కుటుంబాలకు చెందిన యువతరాలు హిందీతో పాటు భారతదేశపు సుసంపన్నమైన భాషా, సాంస్కృతిక వారసత్వంతో అనుబంధాన్ని ఎప్పుడూ కొనసాగించాలని ఆయన నొక్కిచెప్పారు.




కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు హిందీ భాష ప్రాముఖ్యతపై తమ అభిప్రాయాలు, అనుభవాలు, దృక్పథాలను వివరిస్తూ కవితలు పఠించారు. అలాగే తమ హిందీ మాట్లాడే నైపుణ్యాలను ప్రదర్శిస్తూ భాషపై ఉన్న మమకారాన్ని చాటుకున్నారు. విద్యార్థులందరికీ కాన్సుల్ జనరల్ ప్రశంసాపత్రాలను అందజేశారు. వారిలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు ప్రత్యేక అవార్డులను బహుకరించారు.

**ఉపాధ్యాయులు, కమ్యూనిటీ నేతల సత్కారం**

అమెరికాలో యువతరానికి హిందీ భాషను నేర్పిస్తూ, దానిని మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి తమ సమయాన్ని వెచ్చిస్తున్న ఉపాధ్యాయుల సేవలను కాన్సులేట్ ప్రత్యేకంగా అభినందించింది. హిందీ భాషా వ్యాప్తికి వారు చేస్తున్న కృషికి గుర్తింపుగా కాన్సుల్ జనరల్ కె.జె.శ్రీనివాస ఉపాధ్యాయులను శాలువాలు కప్పి సర్టిఫికెట్లతో సత్కరించారు. కాన్సులేట్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసిన ప్రముఖ కమ్యూనిటీ నేత సునీల్ అగర్వాల్ తరతరాల మధ్య వారధిగా భాష ప్రాముఖ్యతను వివరించారు. హెచ్ఎస్ఎస్, డీసీఎఫ్, లోటస్ ఫెస్టివల్, ఫ్రెండ్స్ ఆఫ్ ఎంపీ వంటి పలు సంస్థలతో అనుబంధం ఉన్న ఆయన ప్రస్తుతం లాస్‌ఏంజెల్స్ ఇండియన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, చైర్మన్‌గా సేవలందిస్తున్నారు. భారతీయ ప్రవాస పౌరులతో నిరంతరం మమేకమవుతూ, అమెరికాలోని యువతరం భారతీయ భాషలు, సాంస్కృతిక సంప్రదాయాలను అభ్యసించేలా, గౌరవించేలా కాన్సులేట్ తరపున చేస్తున్న నిరంతర కృషికి ఈ హిందీ దివస్ వేడుకలు అద్దం పట్టాయి.




### దీపావళి రోజు పంచముఖ హనుమాన్‌కు

# 11 అడుగుల ముత్యాల అలంకరణ

**- స్పాన్సర్‌షిప్‌లో భాగస్వామ్యానికి భక్తులకు ప్రత్యేక ఆహ్వానం**

అమెరికా: కాలిఫోర్నియా రాష్ట్రం టొరెన్స్ నగరంలో వెలసిన పంచముఖ హనుమాన్ టెంపుల్ అండ్ రిలీజివస్ అకాడమీ ఆధ్వర్యంలో రాబోయే దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని అత్యంత అద్భుతమైన దీపావళి పెరల్ అలంకారం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ పవిత్ర దీపావళి పర్వదినం సందర్భంగా దివ్య భవ్య పంచముఖ హనుమాన్ స్వామివారికి అద్భుతమైన 11 అడుగుల ఎత్తయిన ముత్యాల అలంకరణను సమర్పించనున్నారు. దీపావళి పవిత్ర రోజున స్వామివారికి సమర్పించనున్న ఈ సుందరమైన 11 అడుగుల ముత్యాల అలంకరణ కోసం భక్తులు స్పాన్సర్‌షిప్ రూపంలో భాగస్వాములు కావచ్చని నిర్వాహకులు తెలిపారు. హనుమాన్ స్వామివారి కమల చరణాల వద్ద భక్తులు తమ భక్తిపూర్వక సమర్పణ చేసుకోవడానికి ఇదొక అరుదైన అవకాశం అని పేర్కొన్నారు. గ్రాండ్ స్పాన్సర్: $2,001. ఈ విభాగంలో సహకరించే వారి పేరు ప్రత్యేక స్పాన్సర్‌గా నమోదు చేస్తారు. ఇతర స్పాన్సర్‌షిప్‌లు: $1,001, $501. భక్తులు తమ మనసుకి నచ్చిన ఎంత మొత్తమైనా విరాళంగా అందించి దీపావళి వేడుకల విజయవంతంలో భాగస్వాములు కావచ్చునని పంచముఖ హనుమాన్ ఆలయ నిర్వాహకులు కోరారు.

**సంప్రదించాల్సిన వివరాలు**

శ్రీ పంచముఖ హనుమాన్ టెంపుల్ అండ్ రిలిజియస్ అకాడమీ, 23805 హాతోర్న్ బ్లేవ్‌వార్డ్, టొరెన్స్, CA 90505 ఈ పవిత్ర సేవకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం ఆచార్యజీని కాల్ లేదా వాట్సాప్ (+310) 971-1388 నెంబర్ ద్వారా సంప్రదించవచ్చు. అలాగే శిరీష చెరుకుపల్లిని (+405) 326-3598 నెంబర్ ద్వారా లేదా టెంపుల్ కార్యాలయం (+310) 561-8082 నెంబర్ ద్వారా సంప్రదించవచ్చని నిర్వాహకులు వెల్లడించారు. అదనపు వివరాల కోసం www.hanumantemplela.org వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా info@hanumantemplela.org ఈ మెయిల్ ద్వారా సంప్రదించవచ్చు.

# మనం సాధిస్తాం.. మోదీ కొత్త నినాదం!



## 25 ఏళ్ల పాలనపై ప్రధాని ప్రసంగం

దేశ అభివృద్ధి లక్ష్యాలకు మరింత ఊపునిచ్చేలా ప్రధాని నరేంద్ర మోదీ కొత్త నినాదాన్ని ఇచ్చారు. 'మనం సాధిస్తాం' అనే సంకల్పంతో భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. తన 25 ఏళ్ల ప్రజా సేవ పూర్తయిన సందర్భంగా బుధవారం న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలు, భారత్ లక్ష్యాలను ఆయన ప్రస్తావించారు. దేశం చిన్న లక్ష్యాలతో సంతృప్తి చెందకూడదని, భారీ ఆశయాలతో ముందుకు సాగాల్సిన సమయం ఇదేనని ప్రధాని మోదీ అన్నారు. ఈ మేరకు ఐదు కీలక లక్ష్యాలను ప్రకటించారు. ప్రపంచంలోని టాప్-3 ఆర్థిక వ్యవస్థల్లో భారత్‌ను నిలపడం, ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మించడం, ప్రపంచ తయారీ కేంద్రంగా ఎదగడం, ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడం, అంతరిక్షంలో మానవుడిని అడుగుపెట్టించడం తమ ప్రధాన సంకల్పాలని ప్రధాని తెలిపారు. మోదీ ఒక్కో లక్ష్యాన్ని ప్రస్తావించిన ప్రతిసారీ సభలోని ప్రజలు, కార్యకర్తలు 'మనం సాధిస్తాం' అంటూ ఉత్సాహంగా స్పందించారు. కాగా, ఈ ఉత్సాహం దేశ ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచిందని మోదీ పేర్కొన్నారు. కరోనా మహమ్మారి, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్య సంక్షోభం వంటి ప్రపంచ సవాళ్ల మధ్య భారత్ ఆర్థికంగా స్థిరంగా ముందుకు సాగిందని ప్రధాని చెప్పారు. గతంలో సంక్షోభం వస్తే భారత ఆర్థిక వ్యవస్థపై ఆందోళన ఉండేదని, ఇప్పుడు భారత్ స్థైర్యం గురించి ప్రపంచం మాట్లాడుతోందన్నారు. మరోవైపు, తయారీ రంగాన్ని బలోపేతం చేసి, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ ఆర్థిక శక్తిని పెంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఐదు లక్ష్యాల ద్వారా 2047 నాటికి వికసిత్ భారత్ సాధించడమే అంతిమ లక్ష్యమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

## మహేశ్ కక్డేను రామానుజన్ ప్రైజ్

భారతీయ యువ గణిత శాస్త్రవేత్త మహేశ్ కక్డేను రామానుజన్ ప్రైజ్ వరించింది. అభివృద్ధి చెందుతున్న దేశాల యువ గణితశాస్త్రజ్ఞులకు ఈ అవార్డును ఇస్తారు. ప్రస్తుతం మహేశ్ కక్డే ఐఐఎస్‌సీలో (బెంగళూరు) ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు. నంబర్ థియరీలో విశేష కృషి చేసిన ఆయనను ఈ అవార్డు వరించింది. ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ థియరిటికల్ ఫిజిక్స్, ఇంటర్నేషనల్ మేథమెటికల్ యూనియన్ సంయుక్తంగా ఈ అవార్డును 45 ఏళ్ల లోపు ప్రతిభావంతులకు ప్రదానం చేస్తాయి. నంబర్ థియరీలో ముఖ్యభాగమైన ఆల్జీబ్రాయిక్ నంబర్ థియరీలోని పలు సమస్యలకు పరిష్కారం కనుగొన్న కక్డే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. అంకెలు, ఈక్వేషన్లు, ఇతర సంక్లిష్ట గణిత నిర్మాణాల మధ్య సంబంధాన్ని వెలికితీసేందుకు కక్డే కృషి చేశారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టాటిస్టిక్స్‌లో కక్డే బ్యాచిలర్ ఆఫ్ మేథమెటిక్స్ డిగ్రీ పూర్తి చేశారు. ఆ తరువాత కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్, కింగ్స్ కాలేజ్ లండన్‌లో కూడా కొంతకాలం అధ్యాపకుడిగా పనిచేశారు. అనంతరం 2019లో ఐఐఎస్‌సీలో ప్రొఫెసర్‌గా చేరారు. 2022లో ఆయనను ఇన్ఫోసిస్ ప్రైజ్ ఇన్ మేథమెటికల్ సైన్సెస్ వరించింది. 2023లో ఆసియా టాప్ 100 శాస్త్రవేత్తల్లో ఒకరిగా నిలిచారు. ఇక రామానుజన్ ప్రైజ్ గ్రహీతలకు 10 వేల డాలర్ల నగదు బహుమతి కూడా ఇస్తారు.



# విషవాయువు పీల్చి నలుగురు విద్యార్థులు మృతి

## ఒకరికి అస్వస్థత ఉత్తర్‌ప్రదేశ్‌లోని బృందావన్‌లో తీవ్ర విషాదం

ఉత్తర్‌ప్రదేశ్‌లోని బృందావన్‌లో బుధవారం తీవ్ర విషాదం చోటు చేసుకుంది. వాటర్ ట్యాంక్ శుభ్రం చేస్తుండగా విషవాయువు పీల్చి నలుగురు విద్యార్థులు మృతి చెందారు. మరో విద్యార్థి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వాటర్ ట్యాంక్‌లోకి దిగిన విద్యార్థులు విషవాయువు కారణంగా ఊపిరాడక అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లు పోలీసులు వెల్లడించారు. వివరాల ప్రకారం.. బృందావన్‌లోని చైతన్య విహార్‌లో ఓ సంస్కృత పాఠశాల (గురుకులం) ఉంది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆశిష్ కుమార్ శర్మ ఈ గురుకులాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడ సుమారు 200 మంది విద్యార్థులు చదువుతుండగా దాదాపు 100 మంది క్యాంపస్‌లోని హాస్టళ్లలో ఉంటున్నారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో గురుకులంలోని భూగర్భ వాటర్ ట్యాంక్ నుంచి దుర్వాసన రావడాన్ని విద్యార్థులు గుర్తించారు. దీంతో ట్యాంక్‌ను శుభ్రం చేయాలని నిర్ణయించుకున్నారు. సుమారు 12 నుంచి 14 అడుగుల లోతులో ఉన్న ట్యాంక్‌లోని నీటిని తొలుత మోటార్ సాయంతో బయటకు పంపించారు. అయితే కొంత నీరు మిగిలిపోవడంతో శుభ్రం చేసేందుకు ఓ విద్యార్థి ట్యాంక్‌లోకి దిగాడు. లోపలికి వెళ్లిన కొద్దిసేపటికే విషవాయువు ప్రభావంతో అతడు స్పృహ కోల్పోయినట్లు జిల్లా కలెక్టర్ చంద్ర ప్రకాశ్ సింగ్ తెలిపారు. అతడిని బయటకు తీసుకొచ్చేందుకు మరో నలుగురు విద్యార్థులు కూడా ఒక్కొక్కరుగా ట్యాంక్‌లోకి దిగారు. అయితే వారంతా విషవాయువును పీల్చడంతో స్పృహ కోల్పోయారు. మొత్తం ఐదుగురిని ట్యాంక్ నుంచి బయటకు తీసి వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో నలుగురు విద్యార్థులు మృతిచెందారు. రుద్ర అనే విద్యార్థి ప్రాణాలతో బయటపడ్డాడు. అతడికి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మృతిచెందిన నలుగురు విద్యార్థుల వయసు 17 నుంచి 20 ఏళ్ల మధ్య ఉంటుందని సమాచారం. మృతదేహాలను మార్చురీకి తరలించి.. వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

# ఢిల్లీలో ఘోర ప్రమాదం



## కుప్పకూలిన ఐదంతస్తుల భవనం

దేశ రాజధాని ఢిల్లీలోని సీమాపురి ప్రాంతంలో ఇవాళ బుధవారం చోటుచేసుకుంది. ఓ ఐదు అంతస్తుల భవనం ప్రమాదవశాత్తూ ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో పలువురు శిథిలాల కింద చిక్కుకున్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న ఢిల్లీ ఫైర్ సర్వీస్, పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మరోవైపు, భవనం వద్దకు పెద్దఎత్తున స్థానికులు చేరుకున్నారు. కూలిపోయిన భవనంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక సిబ్బందితో కలిసి తీవ్రంగా శ్రమిస్తున్నారు. భారీ రాళ్లు, కాంక్రీట్ శ్లాబ్‌లను తొలగిస్తూ బాధితులను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీమాపురి గోల్‌చక్కర్, డీఎల్ఎఫ్ భోపురా తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అయితే, బాధితులను కాపాడేందుకు అంబులెన్స్‌లు, రెస్క్యూ వాహనాలు ఘటనాస్థలికి వేగంగా చేరుకునేలా పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు.

# భిన్నతీర్పులపై పరిశీలించి నిర్ణయం



## సీజేఐ సూర్యకాంత్ వెల్లడి

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామకాలపై సెప్టెంబర్ 23న వెలువడిన భిన్న తీర్పులను పరిశీలించేందుకు సుప్రీం కోర్టు బుధవారం అంగీకరించింది. సీఈసీ, ఈసీల నియామకాలకు సంబంధించిన 2023 నాటి చట్టంపై కోర్టులో దాఖలైన పిటిషన్లపై ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం విచారణ జరపాలా.. వద్దా? అనే విషయంపై గత నెల 23న జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం విచారించాలని జస్టిస్ దీపాంకర్ దత్తా అభిప్రాయపడితే, దీనిపై ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం విచారణ జరపాలని జస్టిస్ శర్మ అభిప్రాయపడ్డారు. భిన్న తీర్పుల నేపథ్యంలో తగిన ధర్మాసనం ఏర్పాటు కోసం పిటిషనర్లు సీజేఐ దగ్గరకు వెళ్లారు. ఈ సందర్భంగా పిటిషన్‌ను పరిశీలించి, సరైన నిర్ణయం తీసుకుంటామని సీజేఐ సూర్యకాంత్ వెల్లడించారు.



# బారికేడ్లను దాటుకుని.. సీఈసీ కార్యాలయం వైపు దూసుకెళ్లి..!

## నిరసనలో చెలరేగిన రాహుల్

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ అంశంపై ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు ప్రతిపక్ష ఎంపీలు చేపట్టిన మార్చ్‌ను ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. ప్రతిపక్ష ఎంపీలను అరెస్ట్ చేసి తీసుకెళ్లిపోతే నిరసన అక్కడితో ముగిసిపోతుందని భావించారు. అయితే ఆ సమయంలో రాహుల్ గాంధీ అనూహ్యంగా వ్యవహరించారు. దీంతో సాధారణ మార్చ్ కాస్తా గంటల తరబడి సాగిన ధర్నాగా మారింది. మొదట రాహుల్ గాంధీతో పాటు ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వైపు మార్చ్ ప్రారంభించారు. పోలీసులు మార్గమధ్యంలో భారీ బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని అడ్డుకున్నారు. పలువురు ప్రతిపక్ష నేతలను అదుపులోకి తీసుకుని బస్సులోకి ఎక్కించారు. ప్రియాంక కూడా బస్సు ఎక్కి కూర్చున్నారు. అయితే రాహుల్ గాంధీ అక్కడితో నిరసనను ఆపెయ్యాలని అనుకోలేదు. బారికేడ్ ఎక్కి ఎన్నికల సంఘం కార్యాలయానికి సమీపంలోని ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోకి వెళ్లారు. రాహుల్ సూచన మేరకు ప్రియాంక కూడా అక్కడికి వచ్చారు. ఆ తర్వాత మిగిలిన ఎంపీలు కూడా అక్కడకు చేరుకున్నారు. ఆ ప్రదేశం ఎన్నికల సంఘం కార్యాలయానికి సుమారు 200 మీటర్ల దూరంలో ఉంది. ప్రతిపక్ష ఎంపీలు అక్కడే నిరసన కొనసాగించారు. రాహుల్ అనూహ్య నిర్ణయంతో ఒక సాధారణ మార్చ్ కాస్తా ఎనిమిది నుంచి తొమ్మిది గంటలపాటు కొనసాగిన స్టాండ్‌ఆఫ్‌గా మారింది. దాదాపు తొమ్మిది గంటల తర్వాత పోలీసులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలను అక్కడి నుంచి తొలగించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని విడుదల చేశారు.

# ఓటర్ల ప్రధాన సమస్యలేంటో నాకు తెలియదు: ట్రంప్



అమెరికా: అమెరికాలో మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్.. తనకు ఓటర్ల ప్రధాన సమస్య ఏమిటనే విషయమై తనకు స్పష్టత లేదన్నారు. వైట్‌హౌస్ వెలుపల ఇటీవల విలేకరులు ఈ ప్రశ్న అడగ్గా.. 'నాకు కచ్చితంగా తెలియదు' అంటూ సమాధానమివ్వడంలో తడబడ్డారు. కానీ తన హయాంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ మాత్రం పటిష్ఠంగా ఉందంటూ ప్రభుత్వ విజయాలను వివరించారు. అమెరికాలో భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, రికార్డు స్థాయిలో ఉద్యోగాలు ఉన్నాయని ఈ సందర్భంగా ట్రంప్ పేర్కొన్నారు. దేశంలో పేదరికం అత్యల్ప స్థాయికి చేరిందని, ఆయా వర్గాల ప్రజలు ఆదాయాలు గణనీయంగా పెరిగాయని చెప్పుకొచ్చారు. అయితే.. అక్కడ నిర్వహించిన తాజా సర్వేలు మాత్రం ఓటర్ల ఆందోళనకు భిన్నమైన చిత్రాన్ని చూపుతున్నాయి. ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, జీవన వ్యయం తమ ఓటును ప్రభావితం చేసే ప్రధాన అంశాలని పలువురు అమెరికన్లు చెబుతున్నారు. యూఎస్‌లో ద్రవ్యోల్బణం, ధరలే అత్యంత ప్రధాన సమస్య అని 37 శాతం మంది తెలిపినట్లు ఓ సర్వే పేర్కొంది. మరోవైపు అమెరికా ఆర్థిక వ్యవస్థ పరిస్థితి ఏ మాత్రం బాగోలేదని 47 శాతం మంది అభిప్రాయపడినట్లు వెల్లడించింది. కాగా.. అమెరి కాలో గ్యాసోలిన్, డీజిల్ ధరలు పెరగడం కూడా రిపబ్లికన్లకు రాజకీయంగా ఇబ్బందిగా మారుతోంది. ఈ నేపథ్యంలో ఫెడరల్ గ్యాసోలిన్ పన్నును తాత్కాలికంగా నిలిపివేసే అంశంపై దృష్టి సారిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. నవంబరు 3న జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో కాంగ్రెస్(అమెరికన్ పార్లమెంట్)పై పట్టు నిలబెట్టుకోవాలంటే రిపబ్లికన్లకు ఆర్థిక అంశాలు అత్యంత కీలకం కానున్నాయి. ఉద్యోగాలు, పెట్టుబడులపై ట్రంప్ చెబుతున్న విజయగాథకు.. ధరల భారంపై ఓటర్ల అసంతృప్తికి మధ్య ఉన్న వ్యత్యాసమే ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశముంది.

## రసాయన శాస్త్రంలో ఇద్దరికి నోబెల్ పురస్కారం




నార్వే: రసాయన శాస్త్రంలో నోబెల్ కెమిస్ట్రీ పురస్కారం-2026 ఫ్రాన్స్‌కు చెందిన హెన్రీ బి.కగాన్, జపాన్‌కు చెందిన కెన్సో సోయైలకు దక్కింది. అసిమెట్రిక్ ఆర్గానిక్ సింథసిస్‌లో నాన్‌లీనియర్ ఎఫెక్ట్, ఆటోకాటలిసిస్‌పై చేసిన కీలక పరిశోధనల కు గానూ రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వారిని ఎంపిక చేసింది. జీవరసాయనంలో శతాబ్దానికి పైగా మిస్టరీగా ఉన్న 'హోమోచిరాలిటీ' ఎలా ఏర్పడుతుందో అర్థం చేసుకోవడంలో వారిద్దరి పరిశోధనలు కీలకంగా మారాయి. దీంతో కగాన్, సోయైలకు అవార్డు ప్రకటించారు. కాగా, రసాయన శాస్త్రంలో 1901 నుంచి 2025 వరకు 117 సార్లు నోబెల్‌ను ప్రకటించారు. ఇప్పటివరకూ 198 మంది అవార్డును అందుకోగా.. 35 ఏళ్ల వయసులో నోబెల్ అందుకున్న అతిపిన్న వయస్కుడిగా ఫ్రెడెరిక్ జోలియట్ రికార్డు సృష్టించారు. అలాగే 97 ఏళ్ల వయసులో కెమిస్ట్రీలో పురస్కారం అందుకున్న వ్యక్తిగా జాన్.బి గుడ్‌ఎనఫ్ నిలిచారు. రసాయన శాస్త్రంలో రెండుసార్లు నోబెల్ అందుకున్న ఘనతను ఫ్రెడరిక్ సాంగర్, బ్యారీ షార్ప్‌లెస్ సాధించారు.

## న్యూట్రినోల అన్వేషణకు నోబెల్

**భౌతికశాస్త్రంలో ఫ్రాన్సిస్ హాల్జెన్‌కు పురస్కారం**



స్టాక్‌హోమ్: ప్రముఖ శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ హాల్జెన్‌కు ఈ ఏడాది భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి దక్కింది. ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ కేంద్రం ఏర్పాటుకు కృషి చేసి అత్యంత శక్తివంతమైన ఖగోళ న్యూట్రినో(ఆస్ట్రోఫిజికల్ న్యూట్రినో)లను గుర్తించినం దుకు స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ 82 ఏళ్ల హాల్జెన్‌కు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని ప్రకటించింది. "ఫ్రాన్సిస్ హాల్జెన్ నేతృత్వంలోని అంతర్జాతీయ శాస్త్రవేత్తలు, ఇంజ నీర్ల బృందం మనకు అద్భుతమైన పరికరాన్ని అందించింది. ఆయన పట్టుదల, శాస్త్రీయ దృక్పథం కొత్తరకమైన ఖగోళశాస్త్రానికి మార్గం సుగమం చేశాయి" అని భౌతికశాస్త్ర నోబెల్ కమిటీ ఛైర్మన్ మార్క్ పియర్స్ తెలిపారు. ఫ్రాన్సిస్ హాల్జెన్ బెల్జియంలో జన్మించారు.

**మంచు పొరల్లో గుర్తింపు**

న్యూట్రినోలు అత్యంత సూక్ష్మ కణాలు. వీటిని ఘోస్ట్ పార్టికల్స్ (భూత కణాలు)గా భావిస్తుంటారు. విశ్వం నుంచి నిరంతరం భూమిపైకి దూసుకొచ్చే ఈ కణాలు మన కంటికి కనిపించవు. వాటి రహస్యాన్ని ఛేదించేందుకు దక్షిణ ధ్రువంలోని మంచునే ఒక భారీ పరిశోధనా కేంద్రంగా మార్చిన ఫ్రాన్సిస్ హాల్జెన్ ఖగోళ మూలాల నుంచి దూసుకొచ్చే అత్యంత శక్తివంతమైన న్యూట్రినోల ను గుర్తించగలిగారు. వీటిని గుర్తించేందుకు అంటార్కిటికాలోని దక్షిణ ధ్రువం వద్ద ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ కేంద్రాన్ని ఏర్పాటుకు ఆయన కృషి చేశారు. ఇక్కడ భారీ మంచు పొరలో లోతుగా వేలాది కాంతి పరికరాలను అమర్చి ఈ వ్యవస్థను నిర్మించారు. న్యూట్రినో మంచులోని అణువుతో ఢీకొట్టినప్పుడు ఏర్పడే సూక్ష్మమైన కాంతి సంకేతాలను ఈ పరికరాలు గుర్తిస్తాయి. ఆ సంకేతాలను విశ్లేషించడం ద్వారా న్యూట్రినోలు వచ్చిన దిశ, దాని శక్తి వంటి వివరాలను శాస్త్రవేత్తలు తెలుసుకుంటారు. విశ్వం లో అత్యంత శక్తివంతమైన ఘటనలను అధ్యయనం చేసేందుకు కొత్త మార్గాన్ని చూపిన హాల్జెన్ కృషికి నోబెల్ దక్కింది. దీంతో పాటు ఆయనకు సుమారు రూ.11.5 కోట్ల నగదు దక్కనుంది.

## కెప్టెన్ కళ్లు మూసుకోవద్దు...

- **ఫ్లైదుబాయ్ ఉదంతంలో ఆ 45 నిమిషాలు**
- **ఘటనను గుర్తుచేసుకున్న ఇజ్రాయెల్ డెంటిస్ట్**
- **అందరినీ కాపాడినందుకు స్మిత్‌కు ధన్యవాదాలు**




ఇజ్రాయెల్: ఫ్లైదుబాయ్ ఉదంతంలో కోపైలట్ దాడిలో తీవ్రంగా గాయపడ్డ కెప్టెన్ స్మిత్ మచ్చార్ ప్రాణాలను కాపాడేం దుకు విమానంలోని ఓ డెంటిస్ట్ విశ్వప్రయత్నం చేశారు. 45 నిమిషాల పాటు శ్రమించి ఆయన ప్రాణాలను కాపాడారు. అసలు ఆ రోజున ఏం జరిగిందనే విషయాన్ని తాజాగా ఆయన కళ్లకు కట్టినట్లు వివరించారు. విమానాన్ని హైజాక్ చేసి ఇజ్రాయెల్‌లో కూల్చేందుకు కోపైలట్ హమ్మామ్ ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కెప్టెన్ మచ్చార్‌పై అతడు దాడి చేశాడు. ఈలోపు స్మిత్ కాక్‌పిట్ తలుపులు తెరవడంతో లోపలికి వచ్చిన ప్రయాణికులు నిందితుడిని నిలువరించి ప్లేన్‌ను సురక్షితంగా ల్యాండ్ చేశారు. తీవ్రగాయాల పాలైన మచ్చార్‌ను ఇజ్రాయెలీ డెంటిస్టు డాక్టర్ షుతా మూసాయేవ కాపాడారు.

**ఒంటిపై లోతైన గాయాలు.. తీవ్ర రక్తస్రావం**

ఆ సమయంలో విమానంలో ఉన్న డాక్టర్ తానొక్కడినేనని ఇజ్రాయెలీ డెంటిస్టు తెలిపారు. 'ఈ సమయంలో నేను ఏం చేయా లనే దానిపై తీవ్రంగా ఆలోచించాను. మచ్చార్ ఒంటిపై లోతైన గాయాలు ఉన్నాయి. తీవ్రంగా రక్తస్రావం అయింది. టీషర్టు అడ్డుపెట్టి రక్తస్రావాన్ని ఆపే ప్రయత్నం చేశాము. ఐస్ ప్యాకెట్లను కూడా వినియోగించాము. రక్తస్రావానికి అడ్డుకట్ట వేసేందుకు దాదాపు 45 నిమిషాల పాటు శ్రమించాను. ఆయనను మెలకువ గా ఉంచేందుకు నేను.. కళ్లు మూయవద్దు. నిద్రలోకి జారుకోవద్దు అంటూ పదే పదే చెప్పాను. మీరు మాకు కావాలి అంటూ ధైర్యం నింపే ప్రయత్నం చేశాను. త్వరలో కుటుంబం చెంతకు చేరుకుం టారని నమ్మకం కలిగించే ప్రయత్నం చేశాను. తనకు సాయం చేయాలని స్మిత్ పలుమార్లు కోరారు. రక్తస్రావం కారణంగా ఒకానక దశలో ఆయన పల్స్ ప్రమాదకర స్థాయిలో పడిపోయిం ది. పెదవులు నీలంగా మారాయి. దీంతో విమానాన్ని వెంటనే ల్యాండ్ చేయాలని చెప్పాను. ఆయనకు ఎక్కువ సమయం లేదని అప్రమత్తం చేశాను' అని చెప్పారు.

**పైలట్‌ను కదపకుండా.. పెయిన్ కిల్లర్స్ ఇవ్వకుండా..**

'ఆయన వెల్లకిలా పడుకుని ఉన్నారు. కదిపితే రక్తస్రావం ఎక్కువ అవుతుందనే ఉద్దేశంతో నేను ఆయనను లేపే ప్రయత్నం చేయలేదు. ఆయనకు పెయిన్ కిల్లర్స్ ఇవ్వాలని విమానంలోని సిబ్బంది సూచించారు. రక్తస్రావం పెరగవచ్చనే భయంతో నేను వద్దని చెప్పాను. ఆయన మాట్లాడుతున్నారా? స్పృహ తప్పిపోతు న్నారా? నాడి అందుతోందా? పెదాలు నీలి రంగులోకి మారుతు న్నాయా అనే విషయాల్ని రెప్పవేయకుండా గమనిస్తూ నా శక్తి మేరకు ఆయనను కాపాడే ప్రయత్నం చేశాను' అని చెప్పారు. 'స్మిత్ మాకు హీరో. నా కుటుంబాన్ని, ఇతర ప్రయాణికులను కాపాడినందుకు ఆయనకు ధన్యవాదాలు చెబుతున్నారు. ఆయన మా ప్రాణాలను కాపాడారు. మేము ఆయనను రక్షించాము. ఇదంతా విధి రాత' అని ఆయన వ్యాఖ్యానించారు.

## రష్యాలో ప్లేగు వ్యాధి భయం.. స్పందించిన ట్రంప్



అమెరికా: సైబీరియా (రష్యా) ల్యాబ్ నుంచి ప్లేగు వ్యాధి సూక్ష్మక్రిమి బయటపడిందన్న భయాలు ప్రస్తుతం స్థానికంగా కలకలం రేపుతున్నాయి. నిమోనియా లక్షణాలు ఉన్న వారితో పాటు ల్యాబ్ పరిసర ప్రాంతాల్లోని వారిని రష్యా అధికారులు ఇప్పటికే క్వారంటైన్ చేశారు. 'ప్లేగు వ్యాధి నిజంగానే వ్యాపిస్తోం దా?' అనే అంశంపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్పందించారు. 'ప్లేగు వ్యాధిని ఒకప్పుడు మనం నియంత్రణలోకి తెచ్చాము. కానీ ఈ సూక్ష్మక్రిములు రానురాను మరింత శక్తివంతంగా మారుతు న్నాయి. తెలివి మీరిపోతున్నాయి. సైన్యంలా దాడులు చేస్తున్నాయి' అని వ్యాఖ్యానించారు. ఈ విషయమై త్వరలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మాట్లాడతానని కూడా ట్రంప్ చెప్పారు. రష్యాతో ప్రస్తుతం సుదీర్ఘ చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. అమెరికా నిఘా వర్గాలకు త్వరలో మరింత సమాచారం లభిస్తుం దని కూడా అన్నారు. సైబీరియాలోని ఇర్కుట్స్క్ ప్రాంతంలోగల ప్లేగు వ్యాధి పరిశోధన సంస్థలో ఓ మహిళా వర్కర్ నిమోనియాతో మరణించారు. అయితే, ఆమె నిమోనియా వ్యాధి బారినపడటానికి కారణం మాత్రం ఇంకా తెలియరాలేదు. ఘటనపై ఇప్పటికే అక్కడి ఆరోగ్య శాఖ విచారణ ప్రారంభించింది. అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో కూడా ఈ ఘటనపై స్పందించారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని చెప్పారు. ఘటనకు సంబంధించి రష్యా తమ వద్ద ఉన్న సమాచారాన్ని అంతర్జాతీయ సమాజంతో పంచుకోవాలని సూచించారు. అవసరమైతే రష్యాకు సాయం చేసేందుకు అమెరికా వద్ద సాధనాసంపత్తి ఉందని కూడా ఉన్నారు. ఈ విషయంలో ఏ నిర్ణయం తీసుకోవాలన్నా తమకు మరింత సమాచారం కావాలని చెప్పారు. ప్లేగు అనేది చాలా సంక్లిష్టమైన వ్యాధి అని ట్రంప్ సోమవారం కూడా వ్యాఖ్యానిం చారు. ప్లేగు వ్యాధి రష్యా నుంచి ఇతర దేశాలకు విస్తరించే అవకాశం తక్కువని ప్రపంచఆరోగ్య సంస్థ అంచనా వేసింది. పరిస్థితి అదుపులోనే ఉందని దేశ ప్రజలకు రష్యా అధికారులు భరోసా కల్పించే ప్రయత్నం చేశారు. ల్యాబ్ వర్కర్‌తో గతంలో టచ్‌లో ఉన్న వారెవరిలోనూ ప్లేగు వ్యాధి నిర్ధారణ కాలేదని దేశ వైద్యనియంత్రణ సంస్థ పేర్కొంది.

# తన్మయ్ బలోడా ప్రపంచ రికార్డ్



భారత్ అండర్-19 జట్టు 2-0 తేడాతో ఆస్ట్రేలియాపై సిరీస్ క్లీన్ స్వీప్ చేసింది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన రెండో యూత్ టెస్ట్‌లో టీమిండియా 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా స్పిన్నర్ తన్మయ్ బలోడా అద్భుత మైన ప్రదర్శన కనబరిచాడు. ఆఖరి నిమిషంలో రోహిత్ యాదవ్ స్థానంలో జట్టులో చోటు దక్కించుకున్న తన్మయ్ తన స్పిన్ మాయాజాలంతో ఓ ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. యూత్ టెస్టు చరిత్రలోనే అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన ప్లేయర్‌గా బలోడా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆరు, రెండో ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు.. మొత్తంగా రెండు ఇన్నింగ్స్‌లు కలిపి 14 వికెట్లతో ఈ యువ స్పిన్నర్ సత్తాచాటాడు. గతంలో రికార్డు న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ టిమ్ సౌథీ పేరిట ఉండేది. 2007లో భారత్ అండర్-19 జట్టుతో జరిగిన మ్యాచ్‌లో సౌథీ రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 92 పరుగులిచ్చి 12 వికెట్లు పడగొట్టాడు. తాజాగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో తన్మయ్ కేవలం 73 పరుగులిచ్చి 14 వికెట్లు పడగొట్టి.. 19 ఏళ్ల సౌథీ రికార్డును బద్దలు కొట్టాడు. ఇక మ్యాచ్ విషయానికివస్తే... ఆస్ట్రేలియా బ్యాటర్లు దారుణ ప్రదర్శన కనబరిచారు. తొలి ఇన్నింగ్స్‌లో 174 పరుగులు చేసిన కంగారు జట్టు.. రెండో ఇన్నింగ్స్‌లోనూ 151 పరుగులు మాత్రమే చేసింది. దీంతో భారత్ ముందు కేవలం 11 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని మాత్రమే ఉంచింది. తొలి ఓవర్‌లోనే రెండు బౌండరీలు బాదిన భారత బ్యాటర్లు విజయాన్ని అందుకు న్నారు. అంతకుముందు భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 315 పరుగుల భారీ స్కోర్ సాధించింది.

# అజిత్ అగార్కర్‌కు గంభీర్ భావోద్వేగ వీడ్కోలు




టీమిండియా చీఫ్ సెలక్టర్‌గా మాజీ క్రికెటర్ అజిత్ అగార్కర్ పదవీకాలం అక్టోబర్ 4తో ముగిసింది. ఈ క్రమంలో ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ సోషల్ మీడియా వేదికగా.. అగార్కర్ సేవలను ప్రశంసిస్తూ భావోద్వేగపూరిత పోస్టు పెట్టాడు. ప్రస్తుతం తాత్కాలిక చీఫ్ సెలక్టర్ గా ప్రజ్ఞా ఓజా ఉన్నారు. మరోవైపు ఇప్పటికే బీసీసీఐ కొత్త సెలక్టర్ పదవి కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. 'ప్రియమైన.. అజిత్ భాయ్.. మీతో కలిసి పనిచేయడం గొప్ప గౌరవం భావిస్తున్నాను. ఈ ఆధ్వర్యంలో టీమిండియా ఈ మూడు ఐసీసీ ట్రోఫీలు గెలిచింది. ఇదే మీ దృఢమైన విశ్వాసానికి నిదర్శ నం. మీరు ఎప్పుడూ జట్టుకే తొలి ప్రాధాన్యం ఇస్తారు. చరిత్ర మిమ్మల్ని మర్చిపోదు. అలానే ఎప్పటికీ గుర్తుపెట్టుకొని గౌరవిస్తుం ది. జట్టు ఎంపిక సమయంలో మీపై వచ్చిన విమర్శలకూ భయప డలేదు.

మీ భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉండాలని కోరుకుం టున్నాను' అని గంభీర్ పేర్కొన్నాడు. 2023 జూలైలో బాధ్యతలు స్వీకరించిన అగార్కర్ పర్యవేక్షణలో భారత్ ఒక స్వర్ణయుగాన్ని చూసింది. ఆ సమయంలో భారత్ 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు చేరడమే కాకుండా 2024 టీ20 ప్రపంచ కప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ, 2026 టీ20 ప్రపంచ కప్‌లను కూడా కైవసం చేసుకుంది. ప్రస్తుతం వెస్టిండీస్‌తో జరుగుతున్న వైట్-బాల్ సిరీస్ కోసం జట్టును ఎంపిక చేయడం అగార్కర్ చివరి బాధ్యత కావడం విశేషం.

# నా కల నిజమైంది: శ్రేయస్ అయ్యర్




వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20లో భారత్ ఘన విజయం సాధించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(102) అజేయ సెంచరీతో చెలరేగాడు. ఆసియా గేమ్స్ తర్వాత భారత జట్టు ఆడిన తొలి టీ20 ఇదే. జపాన్ నుంచి నేరుగా రావడం, ప్రయాణం, అలసట.. ఇవన్నీ ఉన్నప్పటికీ టీమిండియా ప్లేయర్లు అదరగొట్టారు. ఈ క్రమంలో మ్యాచ్ అనంతరం తన మెయిడెన్ సెంచరీ, జట్టు విజయంపై శ్రేయస్ అయ్యర్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'సుదీర్ఘ ప్రయాణం తర్వాత నేను ఎక్కడ ఉన్నానో కూడా అర్థం కాలేదు. ప్రతిరోజూ ఇలాగే ఉదయిస్తే ఎంత బాగుంటుంది కదా! అయితే మేము ప్రయాణాలు, అలసటను సాకుగా చూపాలని అనుకోలేదు. తొలుత బౌలింగ్ చేయడం మాకు కలిసొచ్చింది. వన్డేల్లో భారత్-వెస్టిండీస్ మ్యాచ్‌లకు లభించిన ఆదరణ, ఉత్సాహాన్ని చూశాం. అదే ఊపులో మా ప్రాక్టీస్‌పై దృష్టి పెట్టి.. ప్రణాళికలన్నీ పక్కాగా అమలు చేశాం. ఫలితం అనుకూలంగా వచ్చింది. నా తొలి శతకం గురించి ఇంకా ఆలోచిస్తున్నాను. కలలు కనాలి.. వాటి సాకారం కోసం ప్రయత్నిస్తూ ఉండాలి. ఈరోజు నా కల నిజమైంది. మొత్తంగా ఇది జట్టు సమష్టి ప్రదర్శన. ఇదే ఆలోచనా విధానాన్ని కొనసాగిస్తే టీ20 క్రికెట్‌లో అత్యంత విధ్వంసకర జట్లలో ఒకటిగా మారతాం' అని అయ్యర్ వివరించాడు.



## స్మృతి.. కొత్త నాయకి

## జింబాబ్వే సిరీస్‌తో బాధ్యతలు

- వైస్ కెప్టెన్లుగా షఫాలీ, దీప్తి
- రెండు జట్లలోనూ శ్రీ చరణికి చోటు
- టీ20ల్లో పేసర్ అరుంధతి

కెప్టెన్సీ నుంచి హర్మన్ వైదొలగిన కొన్ని గంటల్లోనే ఆమె స్థానంలో మంధానకు బాధ్యతలు అప్పగించారు. త్వరలో స్వదేశంలో జింబాబ్వేతో జరిగే సిరీస్‌తో జట్టు కొత్త కెప్టెన్‌గా మంధాన వ్యవహరిస్తుందని బోర్డు ప్రకటించింది. ఈనెల 16 నుంచి జింబాబ్వేతో మూడు టీ20లు, మూడు వన్డేల్లో భారత జట్టు తలపడనుంది. ఈ సిరీస్‌కుగానూ మంధాన సారథ్యంలో రెండు జట్లను సెలెక్టర్లు ప్రకటించారు. ఈ జట్లలో వన్డేలకు సీనియర్ దీప్తి శర్మను, టీ20లకు ఓపెనర్ షఫాలీ వర్మను వైస్ కెప్టెన్లుగా కూడా నియమించారు. హర్మన్ సారథ్య బాధ్యతల నుంచి వైదొలగినా, రెండు జట్లకు ఆమెను ఎంపిక చేశారు. ఇక, తెలుగమ్మాయిలు శ్రీచరణి రెండు జట్లలోనూ చోటు దక్కించుకోగా, అరుంధతి రెడ్డి టీ20లకు మాత్రమే ఎంపికైంది. జింబాబ్వేతో మూడు టీ20లు ఈనెల 16, 18, 20వ తేదీల్లో రాయ్‌పూర్ వేదికగా జరగనుండగా.. ఈనెల 23, 25, 28 తేదీల్లో జరిగే మూడు వన్డేలకు వడోదర ఆతిథ్యమివ్వనుంది. కాగా, జట్టులో కొత్తగా అసోంకు చెందిన 22 ఏళ్ల జింటిమణి కలితకు జట్టులో చోటు దక్కడం విశేషం.

**టీ20 జట్టు:** స్మృతి మంధాన (కెప్టెన్), షఫాలీ వర్మ (వైస్ కెప్టెన్), నికీ ప్రసాద్, హర్మన్‌ప్రీత్, అనుష్క శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), కమలిని (వికెట్ కీపర్), దీప్తి శర్మ, ప్రేమా రావత్, శ్రీచరణి, నందని శర్మ, క్రాంతి గౌడ, అరుంధతి, జింటిమణి కలిత, మిన్ను మణి.

**వన్డే జట్టు:** స్మృతి మంధాన (కెప్టెన్), షఫాలీ, ప్రతికా రావల్, హర్మన్‌ప్రీత్, హార్లీన్, తేజల్ హసబ్నిస్, దీప్తి శర్మ (వైస్ కెప్టెన్), రిచా ఘోష్ (వికెట్ కీపర్), యాస్తికా భాటియా (వికెట్ కీపర్), వైష్ణవి శర్మ, నందని శర్మ, శ్రీచరణి, క్రాంతి గౌడ, సయాలీ సత్ఘారె, రేణుకా సింగ్.

# ఇకపై సెలక్షన్ కమిటీ భేటీలకు లక్ష్మణ్: బీసీసీఐ



భారత క్రికెట్‌లో కీలక మార్పు చోటుచేసుకుంది. మాజీ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ నిష్క్రమణ తర్వాత బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై టీమిండియా సీనియర్ సెలక్షన్ కమిటీ సమావేశాలన్నింటికీ బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ హాజరు కానున్నారు. సెలక్టర్లు, సీఓఈ మధ్య సమన్వయంలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. 'క్రికెట్ వ్యవహారాల అధిపతిగా, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్‌గా ఉన్న వీవీఎస్ లక్ష్మణ్ ఇకపై అన్ని సీనియర్ సెలక్షన్ కమిటీ సమావేశాలకు హాజరవుతారు. సెలక్టర్లు, సీఓఈ మధ్య ఎలాంటి అపార్థాలు, కమ్యూనికేషన్ లోపాలు లేకుండా చూడటమే ఈ నిర్ణయం ఉద్దేశం. ఆటగాళ్ల పరిస్థితిపై సెలక్టర్లకు కచ్చితమైన సమాచారం అందితేనే సరైన నిర్ణయాలు తీసుకోగలరు' అని దేవజిత్ సైకియా వెల్లడించారు. ఇప్పటివరకు వీవీఎస్ లక్ష్మణ్, మాజీ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ మధ్య సరైన కమ్యూనికేషన్ లేదనే అభిప్రాయాలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. ముఖ్యంగా గాయపడిన ఆటగాళ్ల ఫిట్‌నెస్, రీఎంట్రీపై సీఓఈ నుంచి స్పష్టమైన సమాచారం సెలక్టర్లకు చేరడంలో ఆలస్యం జరిగిన సందర్భాలు ఉన్నాయి. దీంతో కొన్ని సందర్భాల్లో ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయని బీసీసీఐ వర్గాల్లో చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో ఇకపై సెలక్షన్ సమావేశాల్లో లక్ష్మణ్ కూడా పాల్గొనేలా నిర్ణయించారు. ఇప్పటికే గువాహటిలో జరిగిన టీ20, ఇండియా 'ఏ' జట్ల ఎంపిక సమావేశానికి ఆయన హాజరయ్యారు.

**అగార్కర్ తర్వాత తొలి జట్టు**

అజిత్ అగార్కర్ చీఫ్ సెలక్టర్ పదవి నుంచి తప్పుకున్న తర్వాత ప్రకటించిన తొలి భారత జట్టు ఇదే. ప్రస్తుతం ప్రజ్ఞాన్ ఓజా తాత్కాలిక చైర్మన్‌గా సెలక్షన్ కమిటీని నడిపిస్తున్నాడు. ఈ జట్టులో వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌కు దాదాపు నాలుగేళ్ల తర్వాత టీమిండియాలో చోటు దక్కింది. న్యూజిలాండ్‌తో జరగనున్న ఐదు టీ20ల సిరీస్‌కు అతడిని ఎంపిక చేశారు. మరోవైపు ఆసియా క్రీడలకు గాయం కారణంగా దూరమైన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కూడా తిరిగి జట్టులోకి వచ్చాడు.

# మెస్సీకి ఘన వీడ్కోలు



లియోనెల్ మెస్సి.. ఫుట్‌బాల్ ప్రపంచానికి పరిచయం అక్కర్లేని పేరు. అర్జెంటీనా జాతీయ జట్టు కోసం దాదాపు రెండు దశాబ్దాలుగా ఎన్నో అద్భుతాలు చేసిన ఈ దిగ్గజం.. చివరిసారిగా జాతీయ జెర్సీలో మైదానంలోకి దిగాడు. బెనిన్‌తో జరిగిన స్నేహపూర్వక మ్యాచ్‌లో అర్జెంటీనా 3-0తో ఘన విజయం సాధించింది. ఇటీవలే మెస్సి అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. బ్యూనస్ ఎయిర్స్‌లోని ఎస్టాడియో మోన్యుమెంటల్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్.. ఓ ఫుట్‌బాల్ మ్యాచ్‌లా కాకుండా మెస్సికి ఘన వీడ్కోలు వేడుకగా మారిపోయింది. అర్జెంటీనా జాతీయ జట్టుకు మెస్సి అందించిన మరపురాని విజయాలను గుర్తు చేసుకుంటూ అభిమానులు కన్నీళ్లతో తమ హీరోకు వీడ్కోలు పలికారు. మ్యాచ్ ప్రారంభానికి ముందే మెస్సి వీడ్కోలు కార్యక్రమాలు మొదలయ్యాయి. మోన్యుమెంటల్ స్టేడియంలో నంబర్-10 భారీ జెర్సీని ఏర్పాటు చేశారు. దానిపై 'గ్రేసియాస్' (ధన్యవాదాలు) అని రాసి ఉంది. మెస్సికి అభిమాను లు చెప్పాలనుకున్న మాటను ఆ ఒక్క పదమే చెప్పేసింది. మెస్సి తన ముగ్గురు కుమారులు థియాగో, మాటియో, సిరోతో కలిసి మైదానంలోకి అడుగుపెట్టాడు. జాతీయ గీతం ఆలపిస్తున్న సమయంలో బాణసంచా వెలుగులతో స్టేడియం మెరిసిపోయింది. గీతం కొనసాగుతున్న సమయంలో మెస్సి తీవ్ర భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నాడు. కోచ్ లియోనెల్ స్కలోనీ కూడా భావోద్వేగాన్ని ఆపుకోలేకపోయాడు.

చైతన్య రథం
సినిమా
గురువారం 8 అక్టోబరు 2026 X

## 'కామ్రేడ్ కళ్యాణ్' ట్రైలర్‌పై
# బాలయ్య ఫ్యాన్స్ కినుక!



శ్రీవిష్ణు తాజా చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్'. వినోద ప్రధానంగా తెరకెక్కిన ఈ సినిమా ఇదే నెల 9న జనం ముందుకురాబోతోంది. తాజాగా మూవీ నుంచి మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో హీరో తల్లి పాత్ర పోషించిన రాధిక బాలకృష్ణకు వీరాభిమాని.బాలకృష్ణ సినిమా రిలీజ్ అయితే చాలు థియేటర్ బయట తోటి అభిమానులతో కలిసి జై బాలయ్య అంటూ హంగామా చేస్తుంటుంది. 'కామ్రేడ్ కళ్యాణ్'లోని రాధిక పాత్ర గురించి మేకర్స్ కొద్దిరోజుల క్రితం రివీల్ చేయగానే బాలకృష్ణ అభిమానులు తెగ ఆనందపడ్డారు. ఎందుకంటే బాలకృష్ణ అంటే నిజ జీవితంలో కూడా రాధికకు ఎంతో అభిమానం. వారిద్దరి మధ్య స్పెషల్ బాండింగ్ ఉంది. అయితే లేటెస్ట్‌గా విడుదలైన 'కామ్రేడ్ కళ్యాణ్' ట్రైలర్‌లో రాధికతో చెప్పించిన డైలాగ్స్ మాత్రం బాలయ్య అభిమానులకు కాస్తంత అసహనాన్ని కలిగించాయి. దాంతో 'కామ్రేడ్ కళ్యాణ్' మూవీని ట్రోల్ చేయడం మొదలు పెట్టారు. ఇంతకూ విషయం ఏమిటంటే... ఈ ట్రైలర్‌లో రాధిక 'టాప్ హీరో' మూవీ రిలీజైనప్పుడు థియేటర్ దగ్గర హడావుడి చేస్తుంటుంది. 'బాలయ్య బాబు బొమ్మ సూపర్ హిట్' అని అనగానే, పక్కన ఒకడు 'సినిమా ఏవరేజ్ అంట కదా' అంటాడు. దాంతో కోపంగా సీసాతో వాడి తల పగలగొడుతుంది. కట్ చేస్తే పోలీస్ స్టేషన్‌లో ఎస్.ఐ బ్రహ్మాజీ 'ఎటెమ్ట్ మర్డర్ కేసు... ఏడేళ్ళు జైల్లో ఉండాల్సిందే' అని బెదిరిస్తాడు. వెంటనే రాధిక ఆందోళనగా 'మూడు నెలల్లో 'బొబ్బిలి సింహం'... ఆ తర్వాత 'భైరవద్వీపం' అవన్నీ నేను చూడలేను కద సార్' అంటుంది. ఇదిగో ఈ డైలాగే బాలయ్య బాబు అభిమానులను అసహనానికి గురిచేసింది. ఎందుకంటే... బాలయ్యబాబు అభిమానులకు ఈ సినిమాలు వేటి తర్వాత ఏవి విడుదల అయ్యాయనేది తెలుసు. కానీ ఈ ట్రైలర్‌లో వాటిని పూర్తిగా తారుమారు చేసి చూపించారు. 'టాప్ హీరో' సినిమా డిసెంబర్ 9, 1994లో విడుదలైంది. దానికంటే ముందే అదే ఏడాది 'భైరవ ద్వీపం,'బొబ్బిలి సింహం' సినిమాలు వచ్చాయి. ఘన విజయం సాధించాయి. మరి 'టాప్ హీరో' సినిమా తర్వాత ఆ రెండు సినిమాలు రాబోతున్నాయని రాధికతో దర్శకుడు ఎలా చెప్పించాడో అర్థం కావడం లేదంటున్నారు బాలయ్య అభిమానులు. ఏదో ఒక క్యారెక్టర్‌తో మామూలుగా చెప్పిస్తే పెద్దంత పట్టించుకునే వాళ్లం కాదని... కానీ ఇందులో రాధికను బాలయ్య బాబు వీరాభిమానిగా చూపించి, ఇలా సినిమాలను అటూ ఇటూ ఎలా చేసేస్తారని వాపోతున్నారు. వాస్తవానికి 'టాప్ హీరో' తర్వాత వచ్చిన సినిమా 'మాతో పెట్టుకోకు, వంశానికి ఒక్కడు'. అయితే వాటి విడుదలచాలా గ్యాప్ తర్వాత జరిగింది. తమకు అనుకూలంగా ఇలా డైలాగ్స్ రాసేసుకుని, ఇష్టం వచ్చినట్టు రాధిక పాత్రతో చెప్పించడం సబబుగా లేదని వారు అంటున్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమా మేకర్స్‌కు బాలకృష్ణతో మంచి అనుబంధం ఉందని, వీరంతా ఆయన అభిమానులే నని కొందరంటున్నారు. ఇలాంటివి చేయడం వల్ల సినిమాకు ట్రోలింగ్ రూపంలో ఫ్రీ పబ్లిసిటీ వస్తుందనే ఉద్దేశ్యంతో కావాలనే ఇలా చేశారని సోషల్ మీడియాలో కొందరు కామెంట్స్ పెడుతున్నారు.

# ప్రమోషన్స్ చాలు... సినిమా రిలీజ్ చేయండి!




కొన్ని సినిమాలు థియేటర్లలో కంటే యూట్యూబ్‌లో ఎక్కువ కాలం ఆడుతుంటాయి. సినిమా విడుదల తేదీ ప్రకటించకుండా... ఇదిగో వస్తున్నాం... అదిగో వస్తున్నాం... అంటూ హంగామా చేస్తూ టీజర్, ట్రైలర్, సాంగ్స్ రిలీజ్‌తో కాలయాపన చేస్తుంటారు. గత కొంత కాలంగా 'సమ్మర్ హాలిడేస్' మూవీ విషయంలోనూ అదే జరుగుతోంది. సినిమా పూర్తి కాకనో, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ఆలస్యం కావడం వల్లనే సినిమా విడుదల వాయిదా పడిందంటే అనుకోవచ్చు. కానీ అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైన మూవీ విషయంలోనూ తాత్సారం చేస్తూ పోతే... దాని మీద ఉన్న కొద్ది పాటి క్రేజ్ కూడా తగ్గిపోతుంది. మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబీ ఖుషీ కీలక పాత్రలు పోషించిన 'సమ్మర్ హాలిడేస్' మూవీని మే 1న విడుదల చేయబోతున్నట్టు తొలుత నిర్మాత ధీరజ్ మొగిలినేని ప్రకటించారు. అయితే అనుకున్న సమయానికి ఆ సినిమా విడుదల కాలేదు. దాంతో టైటిల్ జస్టిఫికేషన్‌గా సమ్మర్‌లో విడుదల కావాల్సిన ఈ సినిమా వాయిదా పడిపోయింది. ఓ మంచి తేదీ చూసి మూవీని రిలీజ్ చేస్తామని ధీరజ్ మొగిలినేని అప్పట్లో చెప్పారు. చూస్తుండగానే ఐదు నెలలు గడిచిపోయాయి. మంచి రోజు మాత్రం ఇంకా వచ్చినట్టుగా లేదు. మే 1నుంచి ఈ సినిమాలోని ఒక్కో పాటనూ విడుదల చేస్తున్నారు కానీ రిలీజ్ డేట్‌ను మాత్రం ప్రకటించడం లేదు. నిజానికి ఇవాళ్టి రోజుల్లో పిల్లలపై సినిమా తీయడమే ఒక పెద్ద సాహసం. దానిని దర్శకుడు శ్రీకర్ సమర్థవంతంగా నిర్వహించాడని ఈ సినిమా ప్రమోషన్స్ సమయంలో సినిమా రంగానికి చెందిన వారు తెలిపారు. మరి అంత హార్ట్ టచ్చింగ్‌గా ఉన్న ఈ సినిమాను ఇంకా ఇంకా వాయిదా వేయడం వెనుక ఆంతర్యం ఏమిటో బోధపడటం లేదని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. ఇదిలా ఉంటే... 'సమ్మర్ హాలిడేస్' మూవీ నుంచి తాజాగా 'ఫ్రెండ్ షిప్' సాంగ్‌ను రిలీజ్‌చేశారు. ఈ సినిమాలో జయసుధ, రాజీవ్ కనకాల, వాసుకి, హర్షిణి, హర్షవర్ధన్ తదితరులు ఇతర కీలక పాత్రలను పోషించారు.

# 'ఆదర్శ కుటుంబం' రిలీజ్ డేట్ లీక్



విక్టరీ వెంకటేష్,మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్.. ఈ కాంబినేషన్ పేరు వింటేనే తెలుగు ప్రేక్షకుల్లో ఒక రకమైన మ్యాజిక్ క్రియేట్ అవుతుంది. గతంలో వెంకీ మామ నటించిన 'నువ్వు నాకు నచ్చావ్','మల్లీశ్వరి' వంటి బ్లాక్ బస్టర్ సినిమాలకు త్రివిక్రమ్ అందించిన మాటలు, కామెడీ ఇప్పటికీ ప్రతి ఇంట్లో మారుమోగుతూనే ఉంటాయి. అలాంటిది, తొలిసారి వెంకటేష్‌ను త్రివిక్రమ్ డైరెక్ట్ చేస్తుండటంతో ఆదర్శ కుటుంబం ప్రాజెక్ట్ ప్రకటించిన క్షణం నుంచే అంచనాలు ఆకాశాన్ని తాకాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తుండగా, నివేతా పేతురాజ్, నారా రోహిత్ కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ గ్లింప్సెస్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అయితే ఈ నెల 9వ తేదీన విడుదల కావాల్సిన ఈ చిత్రం వాయిదా పడింది. పోస్ట్-ప్రొడక్షన్, టెక్నికల్ వర్క్స్ పూర్తి కాకపోవడం వల్లే సినిమాను వాయిదా వేస్తున్నామని చిత్ర బృందం తెలిపింది. అయితే, కొత్త రిలీజ్ డేట్ ఏంటనేది మాత్రం మేకర్స్ ఇప్పటి వరకు అధికారి కంగా ప్రకటించలేదు. దీంతో వెంకీ ఫ్యాన్స్ కాస్త నిరాశ చెందారు. సరిగ్గా ఇలాంటి సమయంలోనే మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సోషల్ మీడియాలో ఇచ్చిన ఒక చిన్న అప్‌డేట్ ఇప్పుడు నెట్టింట చర్చనీయాంశమైంది. ఈ చిత్ర రీ-రికార్డింగ్ పనుల గురించి చెబుతూ థమన్ తన 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ పెట్టారు.

'వెంకీ సర్.. త్రివిక్ సర్.. ఇది సిక్సర్ సర్' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. అయితే, ఆ పోస్ట్‌లో థమన్ కొత్త రిలీజ్ డేట్‌గా అక్టోబ రు 30 అని పేర్కొన్నారు. ఆ తర్వాత వెంటనే అప్రమత్తమైన థమన్ ఆ పోస్ట్‌ను ఎడిట్ చేసి తేదీని తొలగించారు. కానీ, అప్పటికే జరగాల్సిన రచ్చ జరిగిపోయింది. నెటిజన్లు ఆ పోస్ట్‌ను స్క్రీన్‌షాట్లు తీసి సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే 'ఆదర్శ కుటుంబం' వాయిదా వెనుక కేవలం పోస్ట్ ప్రొడక్షన్ పనులే కాకుండా మరికొన్ని బలమైన కార ణాలు ఉన్నాయని ఫిలింనగర్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనా థమన్ లీక్ చేసినట్టుగా 'ఆదర్శ కుటుంబం' అక్టోబర్ 30నే థియేటర్లలోకి వస్తుందా? లేక మేకర్స్ మరేదైనా కొత్త తేదీని ప్రకటిస్తారా? అనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వరకు వేచి చూడాల్సిందే.

# గాయని పి.సుశీలకు పౌర సన్మానం

త్యాగరాయ గానసభలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆదర్శ ఫౌండేషన్, ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ పి.సుశీలకు పౌర సన్మానం గాయనీ గాయకుల ఆనందోత్సాహాల మధ్యజరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ మాట్లాడుతూ సుశీల తెలుగు జాతి సంపద అని, రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఆమె పాటలు భవిష్యత్ తరాలకు అందేలా చేయాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన సమాచార హక్కు చట్టం మాజీ ముఖ్య కమిషనర్ పి.విజయబాబు మాట్లాడుతూ, సప్తస్వరాలు సుశీల గానంలో పలుకుతాయన్నారు. గాయని ఆమనిపై ఉన్న అభిమానంతో పదహారు సార్లు ఆమె కార్యక్రమాలకు రావటం విశేషమన్నారు. అనంతరం గాయని సుశీల మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న సంగీత కళాకారులకు వేరే ఉపాధి లేదని, వారి కోసం ట్రస్ట్ ప్రారంభించామన్నారు. అయితే, ఆర్థిక వనరులులేక మూసివేతలో ఉన్న ట్రస్టును ఆమని తిరిగి తెరిపించే ప్రయత్నంలో ప్రభుత్వ ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వస్తున్నదని తెలిసి ఆనందం వ్యక్తంచేశారు. వేదికపై కుసుమ భోగరాజు, బీవీఎస్పీవీఎస్ మూర్తి, వెంకటేష్ గుప్తా తది తరులు పాల్గొన్నారు.



# సినిమాలకు ప్రాంతీయ ముద్రలు ఎందుకు?

## గరివిడి లక్ష్మి ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నరేష్

'గరివిడి లక్ష్మి' సినిమాట్రైలర్ బాగుంది. వేడుకలో నిర్వహించిన కళా ప్రదర్శన నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. ఇక్కడ ఆ పాటలు వింటుంటే నాకు నా బాల్యం గుర్తుకొచ్చింది. నేను వైజాగ్‌లోనే పెరిగాను. ట్రైలర్ చూసిన తర్వాత ఆనందితో కలిసి నటించాలి అనిపించింది' అని హీరో అడవి శేష్ అన్నారు. ఆనంది (Anandhi) లీడ్ రోల్‌లో గౌరి నాయుడు తెరకెక్కించిన చిత్రం 'గరివిడి లక్ష్మి'. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. సినిమా ఈనెల 17న విడుదలవుతున్న సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో అడివి శేష్, దర్శకులు బాబీ కొల్లి,హరీష్‌శంకర్, మారుతి పాల్గొన్నారు. గౌరీ నాయుడు మాట్లాడుతూ'ఆనంది స్టేజ్ ఎక్కితే నాకు పూనకం వచ్చేసేది. ఈ సినిమాను తను ఆడిస్తుంది, పాడిస్తుంది, మిమ్మల్ని ఏడిపిస్తుంది' అని అన్నారు. ఆనంది మాట్లాడుతూ 'రెండేళ్లుగా ఈ సినిమా కోసం పనిచేస్తున్నాను. గరివిడి లక్ష్మి పాత్ర నాకు దేవుడిచ్చిన వరం' అని అన్నారు. టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'మా వైపు నుంచి అన్నీ మంచి సినిమాలే ఇవ్వడానికి ప్రయత్నిస్తాం. అది 'గరివిడి లక్ష్మి'తో మొదలు కాబోతోంది' అని అన్నారు.

### సినిమాలకు ప్రాంతీయ సరిహద్దులు ఎందుకు?

'గరివిడి లక్ష్మి' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సీనియర్ నటుడు వీకే నరేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఈ మధ్య కాలంలో చిత్ర పరిశ్రమలో సినిమాలకు ప్రాంతీయ ముద్రలు వేయడం ఒక ఫ్యాషన్‌గా మారింది. తెలంగాణ సినిమా, ఉత్తరాంధ్ర సినిమా, రాయలసీమ సినిమా అంటూ విభజించడం సరికాదు. సినిమాను సినిమాగానే చూడాలి. పాటలకు, సంగీతానికి ఎలాంటి సరిహద్దులు ఉండవో, సినిమాలకు కూడా అలాంటి సరిహద్దులు ఉండకూడదు' అని అన్నారు.

